అనుదినం... జనస్వరం

# నవతెలంగాణ

బుధవారం 12-4-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 43 | Published from Karimnagar , Rangareddy, Hyderabad, Khammam | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50


## ప్రజాస్వామ్య మూల స్తంభాలపై దాడి

- ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే మోడీ సర్కార్ దృష్టి : సోనియా గాంధీ



**న్యూఢిల్లీ :** ప్రజాస్వామ్య మూలస్తంభాలను కేంద్ర ప్రభుత్వం కూలదోస్తోందని కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ ధ్వజమెత్తారు. " నిర్బంధపు మౌనం దేశ సమస్యలను పరిష్కరించదు" అనే పేరుతో జాతీయ వార్తా పత్రిక సంపాదకీయంలో మోడీ ప్రభుత్వంపై సోనియా విరుచుకుపడ్డారు. ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలోని మూడు స్తంభాలను క్రమపద్ధతిలో కూల్చివేస్తోందని అన్నారు. పార్లమెంటులో ఇటీవల అంతరాయాలను ...5లో


# టార్గెట్ నల్లమల

## లక్ష్మణ్ నోట...యురేనియం మాట

- అభివృద్ధి కాదు లక్ష్మణా.. నల్లగొండ ఎడారే
- నల్లమలలో ఆ నిక్షేపాలను వెలికితీస్తే అంతే
- ఐదు జిల్లాలపై ఎఫెక్ట్ పడే అవకాశం
- నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు పెను ప్రమాదం
- రాజధానిలో తాగునీళ్లకూ కష్టమే
- నల్లమల నిక్షేపాలపై కేంద్రం కన్ను



**దేని పేరు చెబితే తెలంగాణ సమాజం ఏడాదికిపైగా ఉలిక్కిపడిందో దాని పేరు మళ్లీ బీజేపీ నేతల నోటి నుంచి వినపడింది. వినాశనంతో కూడిన అభివృద్ధి వద్దేవద్దు.. ప్రత్యామ్నాయాలెన్నో ఉన్నాయంటూ రాజకీయపార్టీలు, యువజన సంఘాలు, మేధావులు, పర్యావరణవేత్తలంతా కలిసి 'సేవ్ నల్లమల ఫారెస్ట్' పేరుతో ఉద్యమాలు చేసి అడ్డుకున్న యురేనియం తొవ్వకాల అంశాన్ని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ మళ్లీ తెరపైకి తెచ్చారు.**




నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

యురేనియం తవ్వకాలతో నల్లగొండ జిల్లా అభివృద్ధి జరుగుతుదంటూ తమ పార్టీ నిజస్వరూపం ఏమిటో చెప్పకనే చెప్పారు. వేల కొలది ఉద్యోగాలు దేవుడెరుగుగానీ తవ్వకాలు జరిగితే నల్లగొండ జిల్లా ఎడారిగా మారుతుంది. కృష్ణానది కాలుష్యకాసారమవుతుంది. ఆధునీక దేవాలయం ప్రసిద్ధిగాంచిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఒట్టిపోతుంది. యురేనియం ధాతువు భూమిలో ఉన్నంత వరకు ఏమీ కాదు. దాన్ని వెలికి తీస్తే మాత్రం అది వేగంగా గాలిలోకి, భూగర్భజలాల్లోకి వ్యాప్తి చెంది అక్కడి ప్రాంతమంతా కాలుష్యకాసారంగా మారే ప్రమాదముంది. ఇప్పుడు జార్ఖండ్ రాష్ట్రంలోని జాదుగూడ ప్రాంతంలో, ఏపీలోని పులివెందుల సమీపంలో జరుగుతున్న యురేనియం తవ్వకాల వల్ల అక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులను మనం కండ్లారా చూస్తూనే ఉన్నాం. పిల్లలు వింత ఆకారాల్లో పుట్టడం, అంగవైక్యం పొందడం, చర్మ సంబంధ, క్యాన్సర్ వంటి వ్యాధులు రావడం సజీవ సాక్ష్యంగా మనకు కనిపిస్తున్నాయి. జాదుగూడ పరిసరాల్లో ప్రజలు నివాసం ఉండలేక ఊర్లకు ఊర్లే ఖాళీ అవుతున్న పరిస్థితి. వాస్తవం ఇలా ఉంటే అభివృద్ధి జరిగేది అంటూ లక్ష్మణ్ వ్యాఖ్యానించడం తెలంగాణ సమాజం చెవిలో పువ్వు పెట్టడమే అవుతుంది.

వాస్తవానికి 2019లో నల్లమలలో యురేనియం తవ్వకాల కోసం అంటూ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో యూసీఐఎల్ హడావిడి చేసింది. అప్పుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో సఖ్యతతో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం కూడా తొలుత చూసీచూడనట్టు ఊరుకుంది. కానీ, ప్రకృతి రమణీయమైన నల్లమలలో అడుగుపెట్టనీయబోమంటూ నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పెద్ద ఎత్తున ఉద్యమమే కొనసాగింది. అది కాస్తా రాజధానికి పాకింది. రాజకీయ పార్టీలు, పర్యావరణ, యువజన, మేధావులతో కూడిన 63 సంఘాలు ఒక్కతాటిపైకి వచ్చి 'సేవ్ నల్లమల ఫారెస్ట్' పేరుతో ఊరూరా తిరిగి వివరించాయి. చెంచు పెంటల్లో, గ్రామాల్లో ...2లో

### యురేనియం నిక్షేపాలు ఉన్నా..

ఫ్రాన్స్‌లో 70 శాతం విద్యుత్ యురేనియం ద్వారానే ఉత్పత్తి చేస్తున్నారని చెబుతున్న లక్ష్మణ్ ప్రపంచ దేశాలు తమ దేశాల్లో తవ్వకాలను ఎందుకు ఆపేస్తున్నాయో చెబితే బాగుండేది. మనకు యురేనియం ద్వారా విద్యుత్‌ను తయారు చేసుకోవాల్సిన అగత్యం లేదు. నూటికి 90 శాతానికిపైగా థర్మల్, హైడల్ పద్ధతిలోనే తయారు చేసుకుంటున్నాం. నీటి వనరులను సక్రమంగా వాడుకుంటే ఉత్పత్తిని ఇంకా పెంచుకునే వెసులుబాటు కూడా ఉంది. తయారీ కూడా తక్కువ ఖర్చుతో కూడుకున్నది. యురేనియంతో ఖర్చే కాదు కాలుష్యమూ ఎక్కువే. ప్రపంచంలోనే అతిపెద్ద యురేనియం ప్రాజెక్టు చెర్నోబిల్. ఆ దాతువు దుష్పరిణామాలతో ఆ ప్రాజెక్టునే రష్యా నిలిపేసింది. అమెరికా, రష్యా, కెనడా వంటి దేశాలు యురేనియం తవ్వకాలనే ఆపేశాయన్నది బహిరంగ సత్యం.

## యురేనియం తవ్వకానికి రాష్ట్ర సర్కారే అడ్డు

### అనుమతిస్తే నల్లగొండ అభివృద్ధి చెందేది

- కొన్ని వేల మందికి ఉద్యోగాలొచ్చేవి
- బయ్యారంలో బొగ్గు నిల్వలు ఆశించిన స్థాయిలో లేవు : బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్



వివరాలు 2లో..

## అంతా అదానీ కోసమే..

### బయ్యారాన్ని ఎండబెడుతున్నరు.. విశాఖ పొట్టగొడుతున్నరు...

- కేంద్రం చర్యలతో తెలుగు రాష్ట్రాలకు చావు దెబ్బ : మంత్రి కేటీఆర్
- తాను చెప్పింది తప్పయితే పరువు నష్టం దావా వేసుకోవాలంటూ బీజేపీకి సవాల్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రధాని మోడీ తన మిత్రుడైన అదానీకి దేశ సంపదను అప్పనంగా దోచి పెడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కె.తారక రామారావు విమర్శించారు. అదానీ కోసమే తెలంగాణలోని బయ్యారాన్ని ...5లో

## రారెత్తిస్తున్న ఎండలు

### నిప్పల కొలిమిలా రామగుండం

- మేలో 50డిగ్రీలకు చేరుకునే అవకాశం
- వడగాలులు తోడవడంతో జనం బెంబేలు






నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

వారం రోజులుగా ఎండలు ఠారెత్తిస్తున్నాయి. మార్చి చివరి వారం నుంచే ఎండలు ముదరగా.. ఏప్రిల్ మొదటి వారం నుంచి ఉష్ణోగ్రతలు 40డిగ్రీల నుంచి 43డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. అందులోనూ బొగ్గుగనుల క్షేత్రమైన రామగుండంలో నాలుగు రోజులుగా నాలుగు డిగ్రీల ఎండ పెరిగి 44డిగ్రీలు నమోదవుతోంది. దీంతో రామగుండం నిప్పుల కొలిమిలా మారింది. ఇప్పుడే ఎండలతో మండిపోతుంటే.. వచ్చే మేలో పరిస్థితి ఎలా ఉంటుందోనని జనం బెంబేలెత్తుతున్నారు. వడగాడ్పులు తోడవడంతో వడదెబ్బకు జనం గురవుతున్నారు.ఐదేండ్ల వాతావరణ ...2లో

### వడదెబ్బతో ఇద్దరు కూలీలు మృతి



నవతెలంగాణ- లక్ష్మణచాంద/దుగ్గొండి

ఎండ పెరగడం.. దానికి వడగాడ్పులు తోడవ్వడంతో కూలీలు వడదెబ్బకు గురవుతున్నారు. మంగళవారం ...2లో



## కర్నాటక అసెంబ్లీ ఎన్నికల వేళ బీజేపీకి ఎదురుదెబ్బ

### పోటీకి సీనియర్లు దూరం

**బెంగళూరు :** మరికొన్ని రోజుల్లోనే కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఆ రాష్ట్రంలో బీజేపీకి ఊహించని ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇప్పటికే అవినీతి ఆరోపణలతో విలవిలాడుతున్న బీజేపీకి ఆ పార్టీ సీనియర్ల నుంచి ప్రతిఘటనలు ఎదురవుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయమని కొంత మంది సీనియర్ నాయకులు ప్రకటించడం బీజేపీ అధిష్టానానికి మింగుడు పడటంలేదు.. మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ షెట్టర్, మాజీ ఉప ముఖ్యమంత్రి, కురుబా సామాజిక వర్గానికి చెందిన నాయకులు కెఎస్ ఈశ్వరప్ప, మంత్రులు గోవింద్ కర్జోల్, సోమన్న, బీసీ నాగేష్, అసెంబ్లీ స్పీకర్ విశ్వేశ్వర్ హెగ్డే కగేరి వంటి ప్రముఖ నాయకులు త్వరలో జరిగే ఎన్నికల్లో పోటీకి దూరంగా ...2లో

### గోమూత్రం హానికరం

- అందులో 14 రకాల హానికర బాక్టీరియా
- ఇది మానవులకు పనికి రాదు : ఐవీఆర్ఐ పరిశోధనలో వెల్లడి

వివరాలు 5లో..

## ఫూలే స్ఫూర్తితో మనువాదంపై పోరు

### ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం ఎంత ప్రమాదమో ప్రజలకు తెలియజెప్పాలి : జయంతి సభలో సీపీఐ, సీపీఐ(ఎం) నేతలు చాడ, చెరుపల్లి




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహాత్మా జోతిబా ఫూలే స్ఫూర్తితో మనువాదంపై బలమైన ఉద్యమం నిర్మించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్-బీజేపీ అనుసరిస్తున్న సిద్ధాంతం ఎంత ప్రమాదకరమనే అంశాన్ని ప్రజలకు విడమరిచి చెప్పాలని కోరారు. సమాజాన్ని మార్చేందుకు ఉద్యమాలను ముందుకు తీసుకుపోవడమే ఫూలేకు ఇచ్చే నిజమైన నివాళి అని వారు అన్నారు. మహాత్మా జోతిబాఫూలే 197వ జయంతి సందర్భంగా 'మనువాదాన్ని మట్టుపెడదాం-సామాజిక న్యాయాన్ని కాపాడుకుందాం'అనే అంశంపై మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చెరుపల్లి మాట్లాడుతూ ఆరోజుల్లో మనువాద భావజాలం ఎంత భయంకరంగా ఉన్నప్పటికీ ఫూలే... ఆ దుర్మార్గాలు, పీడన, అణచివేత, మూఢవిశ్వాసాలకు ...5లో

## నిబంధనలకు విరుద్ధంగా భూ కేటాయింపు

### యశోదకు రూ. 100 కోట్లకే రూ. 800 కోట్ల భూమి

- అందులో కేటీఆర్ కమీషన్ 20 శాతం
- ఎకరాకు 5 లక్షల చదరపు గజాల్లో నిర్మాణాలకు అనుమతి
- ఆరోపణలు తప్పని నిరూపించాలని కేటీఆర్‌కు రేవంత్ సవాల్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నిబంధనలకు విరుద్ధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ భూకేటాయింపులు చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి విమర్శించారు. కోట్ల రూపాయలను దోపిడీ చేస్తున్న వైనంలో భాగంగా నిన్న హెటిరో పార్థసారధి రెడ్డి వ్యవహారాన్ని వెలుగులోకి తెచ్చిన రేవంత్... ...5లో



## కర్నాటకలో పాల రాజకీయం

### అమూల్ వర్సెస్ నందిని

- సహకార వ్యవస్థను కబళించే కుట్ర
- ఎన్నికల వేళ పార్టీల కలవరపాటు




**బెంగళూరు :** ఎన్నికల వేళ కర్నాటకలో 'పాల' రగడ ప్రధాన రాజకీయ పార్టీలను కలవరపెడుతోంది. ఈ నెల ఐదున అమూల్ చేసిన ఓ ట్వీట్‌తో వివాదం మొదలైంది. బెంగళూరులో పాలు, పెరుగు విక్రయించబోతున్నట్టు వెలువడిన ఆ ట్వీట్ ఇప్పుడు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. సాధారణ పరిస్థితుల్లో అయితే ఇదేమంత పెద్ద విషయం కాదు. ఎందుకంటే ఏ రాష్ట్రంలో అయినా అనేక కంపెనీలు పాలు, పాల ఉత్పత్తులు విక్రయిస్తుంటాయి. అయితే కర్నాటక విషయం వేరు. అక్కడ ఇప్పటి వరకూ నందినీ ఉత్పత్తులదే హవా. ఇప్పుడు ఆ రాష్ట్రంలోకి గుజరాత్‌కు చెందిన అమూల్ ప్రవేశిస్తానంటోంది. అసలే ఎండాకాలం. ఆ వేడికి ఇప్పుడు 'పాల' వేడి తోడైంది. రాష్ట్రంలో అధికారం కోసం మూడు పార్టీలు తీవ్రంగా చెమటోడుస్తున్నాయి. తిరిగి అధికారాన్ని నిలుపుకునేందుకు బీజేపీ విశ్వప్రయత్నం చేస్తోంది. మరోవైపు పూర్వవైభవం ...2లో

## ఫ్యాక్ట్ చెకింగ్ యూనిట్ ఎందుకు?

### దీని వెనక ఏమైనా కారణం ఉందా? : కేంద్రాన్ని ప్రశ్నించిన బాంబే హైకోర్టు



**ముంబయి :** ఫ్యాక్ట్ చెకింగ్ యూనిట్ ఏర్పాటు విషయంలో బాంబే హైకోర్టు సైతం స్పందించింది. దీనిని ఎందుకు ఏర్పాటు చేయాలనుకుంటున్నారని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఐటీ నిబంధనలు, 2021లో సవరణలు చేయడానికి గల వివరణను న్యాయస్థానం కోరింది. ఈ మేరకు కేంద్రానికి ఆర్డర్ జారీ చేసింది. కేంద్రం చేసిన సవరణల రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై విచారించిన న్యాయస్థానం మోడీ సర్కారును ప్రశ్నించింది. ఈ సవరణలు తీసుకురావడానికి ఏదైనా కారణం ఉన్నదా? అని అడిగింది. అయితే, కేంద్రం తీసుకొచ్చిన సవరణలు భావస్వేచ్ఛను కలిపించే భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19ని ఉల్లంఘిస్తుందని కునాల్ కమ్రా తరఫు న్యాయవాది నవ్రోజ్ సీర్వాయ్ కోర్టుకు తెలిపారు. కేంద్రం తన వైఖరిని తెలియజేస్తూ ఈనెల 19లోగా అఫిడవిట్‌ను దాఖలు చేయాలని కోర్టు ఆదేశించింది. అయితే, కేంద్రం తీసుకొచ్చిన సవరణలు ఇంకా అమలులోకి రాలేదనీ, తమకు కొంత సమయం కావాలని కేంద్రం తరఫున వాదించిన అడిషనల్ సొలిసిటర్ జనరల్ అనిల్ సింగ్ న్యాయస్థానానికి తెలిపారు. తదుపరి విచారణను న్యాయస్థానం ఈనెల 21కి వాయిదా వేసింది.

### వర్షాకాల సమావేశాల్లో సమాచార రక్షణ బిల్లు

- సుప్రీంకోర్టులో కేంద్రం

**న్యూఢిల్లీ :** నూతన సమాచార రక్షణ బిల్లు సిద్ధమైందని, దానిని రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెడతామని కేంద్రప్రభుత్వం మంగళవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. జస్టిస్ కేఎం జోసఫ్ నేతృత్వంలో అజయ్ రస్తోగి, అనిరుద్ధ బోస్, హృషీకేశ్ రాయ్, సీటీ రవికుమార్‌తో కూడిన ధర్మాసనానికి అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి ఈ విషయాన్ని తెలియజేశారు. దీనిని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. జస్టిస్ జోసఫ్ ...5లో

నవతెలంగాణ

## టార్గెట్ 'నల్లమల'

(మొదటిపేజీ తరువాయి)

యురేనియ వ్యతిరేక కమిటీ, పొలిటికల్ జేఏసీ, కాంగ్రెస్, సీపీఐ(ఎం), డీవైఎఫ్ఐ, టీపీఎఫ్, తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అవగాహనా సదస్సులను నిర్వహించారు. జాదుగూడ, చెర్నోబిల్, అమెరికాలో యురేనియం తవ్వకాల వల్ల జరిగిన ప్రమాదాలు, ప్రస్తుత పరిస్థితులకు సంబంధించిన అంశాలను వీడియోల ద్వారా చూపెట్టి ప్రజలను చైతన్యపరిచారు. ఆ సమయంలోనూ బీజేపీ తన కపట నాటకాన్ని ప్రదర్శించింది. ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ వాళ్లు యురేనియం ప్రభావం వల్ల తమ గ్రామానికి రాబోతున్న ముప్పును వదిలేసి మోడీ సర్కారును వెనకేసుకొచ్చిన తీరు కొట్టొచ్చినట్టు కనిపించింది. "పాకిస్తానోడు మనల్ని అణుబాంబులతో భయపెడుతున్నడు. మనమీద దాడిచేస్తే అణుబాంబులు ఉండాలి కదా! దేశం కోసం త్యాగాలు చేయాలి కదా! యురేనియం తీస్తే ఏం కాదు' అనే ప్రచారాన్ని చేయబోగా చెంచు గూడాల్లో ప్రజలు ఎక్కడికక్కడ తిప్పికొట్టడంతో వారి పప్పులు ఉడకలేదు. ఇంతింతై..వటుడింతై అన్నట్టుగా చెంచు బిడ్డల నుంచి మొదలైన పోరాటం రాజధానికీ పాకింది. 'తాము ప్రాథమిక సర్వేకు మాత్రమే అనుమతిచ్చాం. ఎట్టిపరిస్థితుల్లోనూ యురేనియం తవ్వకాలకు అనుమతించబోం' అంటూ రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గుతూ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించింది. సహజవనరులను తమకిష్టమైన ఇద్దరు ముగ్గురు కార్పొరేట్లకు కట్టబెట్టే యావలో ఉన్న బీజేపీ తాను చేయాల్సినది ఆ పార్టీ నేతలో చెప్పించడం ఆనవాయితీగా వస్తున్నది. బయ్యారం ఉక్కు కర్మాగారం ఏర్పాటు, విశాఖ స్టీలు ఫ్యాక్టరీ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం జరుగుతున్న ఈ సమయంలో కావాలనే మరోమారు యురేనియం బాంబును లక్ష్మణ్ చేత బీజేపీ అధిష్టానం వేయించిందని భావించాలి. లక్ష్మణ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రయివేటు పరిశ్రమలు అవసరం లేదా అంటూ మాట్లాడటం కూడా తాము నిజంగా పనిచేసేది కార్పొరేట్ల కోసమే అనేది నిగూఢ సత్యం.

## కర్నాటక అసెంబ్లీ ఎన్నికల వేళ బీజేపీకి ఎదురుదెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

ఉండనున్నారు. అలాగే హలది శ్రీనివాస్ షెట్టీ, రవీంద్రనాథ్, మంత్రి ఎంటిబి నాగరాజ్ వంటి నాయకులు కూడా వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి ఇష్ట పడ్డం లేదు.

**ఎన్నికల రాజకీయా నుంచి నిష్క్రమిస్తున్నా : ఈశ్వరప్ప**

ఎన్నికల రాజకీయాల నుంచి నిష్క్రమిస్తున్నట్లు బీజేపీ ప్రముఖ నాయకులు, శివమొగ్గ నియోజకవర్గం నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఈశ్వరప్ప మంగళవారం ప్రకటించారు. బీజేపీ అధ్యక్షులు జెపి నడ్డాకు పంపిన లేఖలో ' ఎన్నికల రాజకీయాల నుంచి స్వచ్ఛంధంగా తప్పుకోవాలనుకుంటున్నాను. ఈ అసెంబ్లీ ఎన్నికలకు ఏ నియోజకవర్గం నుంచి కూడా నా పేరును పరిగణనలోకి తీసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను' అని ఈశ్వరప్ప పేర్కొన్నారు. ఈశ్వరప్ప ఎమ్మెల్యే మంత్రిగానే కాదు, కర్నాటక బీజేపీ అధ్యక్షులుగానూ పని చేశారు. మాజీ ముఖ్యమంత్రి యెడియూరప్పతో కలిసి రాష్ట్రంలో బీజేపీ బలపడ్డానికి కృషి చేశారు. ఇలాంటి ఈశ్వరప్ప ఎన్నికలకు దూరంగా ఉండటం బీజేపీకి నష్టం కలిగించే అంశమే కాగా. తన కుమారుడు కెఇ కాంతేష్ కోసమే ఈశ్వరప్ప ఈ నిర్ణయం తీసుకున్నారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

మరోవైపు, మాజీ ముఖ్యమంత్రి జగదీష్ షెట్టర్‌ను ఈ ఎన్నికల్లో పోటీ చేయవద్దని అధిష్టానం ఆదేశించడంపై షెట్టర్ ఆగ్రహంగా ఉన్నారు. ముఖ్యమంత్రిగా పనిచేయడమే కాక.. ఆరు సార్లు అసెంబ్లీకి షెట్టర్ ఎన్నికయ్యారు. నామినేషన్ వేయడానికి కేవలం కొన్ని రోజుల ముందే తనకు అధిష్టానం ఈవిధంగా చెప్పిందని, కనీసం కొన్ని నెలలు ముందు చెప్పినా తనకు గౌరవ ప్రదంగా ఉండేదని ఆయన మీడియాతో వాపోయారు. కాగా, కర్నాటక అసెంబ్లీ ఎన్నికలకు బుధవారం బీజేపీ తన తొలి జాబితాను విడుదల చేసే అవకాశం ఉంది.

## ఠారెత్తిస్తున్న ఎండలు

(మొదటిపేజీ తరువాయి)

రికార్డుల ప్రకారం.. రామగుండంలో మే చివరినాటికి 48, 49డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 50డిగ్రీల ఉష్ణోగ్రత దాటిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడున్న ఎండలను చూస్తుంటే మే నాటికి రామగుండంలో 50డిగ్రీలు దాటి ఎండలు దంచికొట్టే అవకాశం లేకపోలేదని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. పారిశ్రామిక ప్రాంతం కావడంతో సాధారణం కంటే కొద్దిగా ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతూ ఉంటాయి. సింగరేణి, నేషనల్ థర్మల్ పవర్ స్టేషన్(ఎన్‌టీపీసీ), సోలార్ పవర్ ప్లాంట్‌లు, కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీ, ఆర్ఎఫ్‌సీఎల్, టీ-జెన్‌కో ఉన్న ఈ ప్రాంతం ఉత్తర తెలంగాణలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే ఏరియాగా చెప్పొచ్చు. సింగరేణి బొగ్గుగని కార్మికులు ఓసీపీ గనుల్లో బొగ్గు ఉత్పత్తులను మండుటెండల్లోనే జరుపుతున్నారు. బొగ్గుగనుల నుంచి వెళ్ళే వేడితోపాటు ఎండ తీవ్రతకు తట్టుకోలేకపోతున్నారు. ఈ ప్రాంతాల్లో మధ్యాహ్నం డ్యూటీల నుంచి విరామం కల్పించాలని కార్మికులు కోరుతున్నారు. జగిత్యాల, కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లో కూడా వారం రోజులుగా 41డిగ్రీల నుంచి 42డిగ్రీలు నమోదవుతున్నాయి. మార్చి రెండో వారం నుంచే ఉష్ణోగ్రతలు పెరగడంతో అనారోగ్యం బారిన పడి ఆస్పత్రులకు వచ్చే వారి సంఖ్య కూడా ఎక్కువగా ఉంటోంది. శుభకార్యాలు, విహారయాత్రలు వెళ్లేవారు తప్పనిసరి జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

## వడదెబ్బతో ఇద్దరు కూలీలు మృతి

(మొదటిపేజీ తరువాయి)

నిర్మల్, వరంగల్ జిల్లాల్లో ఇద్దరు కూలీలు మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి.. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని నర్సాపూర్ గ్రామంలో వడదెబ్బతో ఉపాధిహామీ కూలీ మృతిచెందాడు. తోటి కూలీలు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ గ్రామానికి చెందిన వికలాంగుడు పడిగెల రవి(45) మంగళవారం ఎప్పటిలాగే ఉపాధిహామీ పనులకు వెళ్లాడు. పని చేస్తుండగానే ఒక్కసారిగా కండ్లు తిరిగి కింద పడిపోయాడు. గమనించిన తోటి కూలీలు నీళ్లు తాగించే ప్రయత్నం చేశారు. సొమ్మసిల్లిపోయిన రవి పని ప్రదేశంలోనే ప్రాణం విడిచాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాహుల్ గైక్వాడ్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఏపీఓ ప్రమీల, టీఏ దినేష్ పరిశీలించారు. మృతునికి భార్య రామణితో పాటు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం స్వామిదావుపల్లి గ్రామానికి చెందిన దుగ్గొండి ముప్పారపు సారయ్య (67) వ్యవసాయ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. మిరపతోటలో పనికి వెళ్లాడు. మధ్యాహ్నం ఎండ తీవ్రంగా ఉండటంతో పక్కనే ఉన్న వేపచెట్టు కింద కూర్చున్నాడు. ఈ క్రమంలోనే ఒక్కసారిగా పడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. నిరుపేద అయిన సారయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## 21 నుంచి రైస్ బ్రాన్ ఆయిల్‌పై అంతర్జాతీయ సదస్సు




**హైదరాబాద్:** ఏప్రిల్ 21 నుంచి 23 వరకు హైదరాబాద్ లో రైస్ బ్రాన్ ఆయిల్‌పై 7వ అంతర్జాతీయ సదస్సు (ఐసిఆర్ బిఒ) జరగనుంది. ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ రైస్ బ్రాన్ ఆయిల్ (ఐఎఆర్‌బిఒ), సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఇఎ) భాగస్వామ్యంతో దీన్ని నిర్వహిస్తున్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్ఇఎ ఇండియా అధ్యక్షుడు అజయ్ ఝున్‌ఝువాలా, ఐఎఆర్‌బిఒ సెక్రటరీ జనరల్ బివి మెహతా, జెమినీ ఎడిబల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి చంద్రశేఖర రెడ్డి సదస్సు వివరాలను వెల్లడించారు. ఈ సదస్సులో 400 మందికి పైగా ప్రతినిధులు పాల్గొననున్నారని తెలిపారు. రైస్ బ్రాన్ ఆయిల్ ఉత్పత్తి దేశాలైన ఇండియా, చైనా, థాయిలాండ్, జపాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, వియాత్నం తదితర దేశాల నుంచి ప్రత్యేక అథిథులు రానున్నారని పేర్కొన్నారు.

## ధాన్యం ఆరబెట్టేందుకు..

# రైతుకు రహదారే దిక్కు

### రోడ్లపైనే ధాన్యం ఆరబోత

- ప్రయాణికులకు తప్పని ప్రాణహాని
- ప్రత్యామ్నాయం చూపాలని వినతి

**నవతెలంగాణ-నవీపేట్**



రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ఆరబెట్టేందుకు రహదారులే దిక్కవుతున్నాయి. రాష్ట్రంలో 7 వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ రైతులు పంట కోసి ఆరబెట్టేందుకు స్థలం లేకపోవడంతో రోడ్లపైనే ఆరబెడుతున్నారు. ఆరు నెలల కిందటే భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు రహదారులపై ధాన్యం ఆరబెట్టొద్దని, ప్రమాదాలు జరిగితే రైతులే బాధ్యత వహించాలని స్పష్టం చేసింది.

రాష్ట్ర ప్రభుత్వం 2021లో ధాన్యాన్ని ఆరబెట్టేందుకు కల్లాల పథకాన్ని ప్రారంభించింది. రైతు కల్లాలు పొడవు, వెడల్పు కలిపి 50 చదరపు మీటర్ల నుంచి 75 చదరపు మీటర్ల వరకు నిర్మించుకునేందుకు 60 వేల నుంచి 85 వేల వరకు ఉపాధి హామీ ద్వారా కేటాయించింది. కాగా ఎక్కువ విస్తీర్ణం కలిగిన బడా భూస్వాములు, రైతులే రైతు కల్లాలు నిర్మించుకునేందుకు ఆసక్తి చూపారు. అయితే వ్యవసాయ భూముల్లో నిర్మించుకోవాల్సి ఉండగా పలువురు ఇంటి ఆవరణలో నిర్మించుకున్నారు. దీన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉపాధి హామీ సర్వర్‌లో చేర్చింది. అయితే కేంద్రం నిరాకరించింది. దాంతో కేంద్ర ప్రభుత్వ సర్వర్‌లో కల్లాల పథకం లేదు.

**ప్రయాణికులకు ప్రాణహాని**

రోడ్లపైన ధాన్యం ఆరబెట్టుతుండటంతో అప్పుడప్పుడు ప్రయాణికుల ప్రాణాలకు హాని కలుగుతోంది. ప్రయాణికులకు రాత్రి సమయంలో రోడ్లపైన ఉన్న ధాన్యం కుప్పలు కనిపించకపోవడంతో వాడికి ఢీకొని ప్రమాదాలకు గురవుతూ మృత్యువాత పడుతున్నారు. ఇప్పటివరకు నవీపేట్ మండలంలో గాయాల పాలైన ప్రయాణికులు కోకొల్లలు. మృతి చెందిన వారూ ఉన్నారు. గత సీజన్లో మండలంలోని గాంధీ నగర్ వద్ద భార్యాభర్తలు ఇద్దరూ ధాన్యం కుప్పను మోటార్ బైక్‌తో ఢీకొనగా భర్త మృతిచెందారు. దాంతో రైతుపై కేసు నమోదు చేయడంతో జైలు పాలయ్యాడు. తాజాగా ఆదివారం సైతం డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌లో రోడ్డుపై మక్కపంట ఆరబెట్టగా ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురై వ్యక్తి మృతిచెందాడు. ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయి కుటుంబాలు రోడ్డు పాలవడమే కాక రైతులు సైతం తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం స్పందించి ధాన్యం ఆరబెట్టేందుకు గ్రామాల్లో అవకాశం ఉన్న స్థలాలను గుర్తించి, ముందు జాగ్రత్త చర్యలు తీసుకొని ప్రయాణికుల ప్రాణాలతో పాటు రైతు కుటుంబాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

**ధాన్యం ఆరబెట్టేందుకు కష్టాలు పడుతున్నాం**

ధాన్యం ఆరబెట్టేందుకు సరైన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నాం. వాతావరణ మార్పులతో అకాల వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించాలి. కొనుగోలు చేయాలి. వానొస్తే తడిసిన వడ్లు ఆరబెట్టేందుకు అధికారులు స్థలాన్ని కేటాయించాలి.

*గుగ్లోత్ భీమ్‌రావు, గిరిజన రైతు, దర్యాపూర్ తండా*

# కర్నాటకలో పాల రాజకీయం

(మొదటిపేజీ తరువాయి)

పొందేందుకు కాంగ్రెస్ తహతహలాడుతోంది. వీటి మధ్యలో జెడీ (ఎస్) ఎలాగైనా అధిక స్థానాలు సంపాదించి, హంగ్ ఏర్పడితే చక్రం తిప్పాలని యోచిస్తోంది. వీటితో పాటు ఆప్ కూడా ఈసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. కనీసం సాధ్యమైనన్ని ఎక్కువ ఓట్లు సాధించి ఉనికి చాటుకోవాలని చూస్తోంది. పైగా దానికి ఇప్పుడు జాతీయ పార్టీ హోదా కూడా లభించింది. అధికార బీజేపీ సహా ఈ పార్టీలన్నీ రాష్ట్రంలోకి అమూల్ రాకను ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నాయి. రైతులందరూ నిరసన తెలపాలని ఆయ పార్టీలు పిలుపు ఇస్తున్నాయి. నందిని బ్రాండ్ ఉత్పత్తులను విక్రయిస్తున్న కర్ణాటక పాల సమాఖ్య (కేఎంఎఫ్), అమూల్ బ్రాండ్ ఉత్పత్తులను విక్రయిస్తున్న గుజరాత్ సహకార పాల మార్కెటింగ్ సమాఖ్య (జీసీఎంఎంఎఫ్)లను విలీనం చేయాలన్న కుట్రతో కేంద్రప్రభుత్వం అమూల్‌ను తెరపైకి తెస్తోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. పెరుగు ప్యాకెట్లపై హిందీలో 'దహీ' అని ముద్రించేందుకు చేసిన ప్రయత్నాన్ని గుర్తు చేస్తున్నాయి. ఈ వివాదాల నేపథ్యంలో ఇప్పుడు ఎక్కడ చూసినా చర్చలు, ఆందోళనలే కన్పిస్తున్నాయి.

ఈ వ్యవహారం చిన్నకారు రైతులు, వారి ప్రయోజనాలతోనే ముడిపడినప్పటికీ ఇప్పుడది మరింత విస్తరించింది. ఒక్క మాటలో చెప్పాలంటే 'పాలు' అనే అంశం కర్నాటక ఎన్నికల కురుక్షేత్రంలో ఓ ఆయుధమై పోయింది. 'కర్నాటకలో తిండి, బట్ట, నివాసంతో పాటు పాలు కూడా ఒక భాగమే' అన్న ప్రచారం నడుస్తోంది. ఇప్పుడు వాస్తవాలను పరిశీలిద్దాం. కేఎంఎఫ్ అనేది సహకార సంస్థ. అది కూడా గుజరాత్‌లో అమూల్ బ్రాండ్ యజమాని జీసీఎంఎంఎఫ్ లాంటిదే. ఈ రెండూ పాల వినియోగదారులకు సేవలు అందిస్తున్న సంస్థలే. జీసీఎంఎంఎఫ్ వార్షిక టర్నోవర్ 72 వేల కోట్ల రూపాయలు కాగా కేఎంఎఫ్ టర్నోవర్ రూ. 25 వేల కోట్లు. దేశమంతటికీ ఒకే పాల సమాఖ్య ఉండాలా అన్నదే ఇప్పుడు చర్చనీ యాంశం. 'ఒకే దేశం ఒకే పన్ను' తరహాలో 'ఒకే దేశం, ఒకే పాలు' అనే నినాదాన్ని ముందుకు తేవాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. అమూల్ ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు కేంద్రం చేయని ప్రయత్నమంటూ లేదు. అయితే ఇక్కడ ఆలోచించాల్సిన విషయమేమంటే మన దేశం ఫెడరల్ ప్రజాస్వామిక దేశం. అనేక రాష్ట్రాల సమాహారం. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో భాష, భిన్నమైన ఆహార అలవాట్లు, ఆర్థిక ప్రయోజనాలు....ఇలా అన్ని విషయాలలోనూ భిన్నత్వం కన్పిస్తుంది. స్థానిక ప్రయోజనాల పరిరక్షణకు, స్థానిక వ్యాపారాలకు ఊతమిచ్చేందుకే మన దేశంలో సహకారోద్యమం ప్రారంభమైంది. ఆర్థిక వ్యవహారాలు, పాలు, చక్కెర, వినియోగం, గృహ నిర్మాణం వంటి విషయాలలో స్థానికులకు పెద్దపీట వేయడమే దీని లక్ష్యం. తమ ప్రయోజనాలకు భంగం కలిగించే దేనినీ ప్రజలు సమ్మతించరు. వ్యతిరేకంగా గళం విప్పుతారు. ఇప్పుడు కర్నాటకలో జరుగుతోంది అదే. పాడి రైతుల్లో అభద్రతాభావం కన్పిస్తోంది. కర్నాటకలో స్థానికంగా లభించే నందిని ఉత్పత్తులు చౌకగా లభిస్తాయి. అదే బయటి రాష్ట్రానికి చెందిన అమూల్ ఉత్పత్తుల ధర ఎక్కువగానే ఉంటుంది. ఇది భావోద్వేగాలకు సంబంధించిన విషయం. ఏదేమైనా ఇప్పుడీ ఆందోళన విస్తృతమైంది. బహుళజాతి కంపెనీగా రూపాంతరం చెందుతున్న అమూల్, సహకార వ్యవస్థలో ఉన్న చిన్న నందిని బ్రాండ్ల మధ్య పోరు తీవ్రమవుతోంది. ఒకప్పుడు చిన్న సంస్థగా ప్రారంభమైన అమూల్, ఇంతింతైవటుడింతై అన్నట్టు పెరిగిపోతోంది. వివిధ రాష్ట్రాలలోని చిన్న చిన్న పాల సహకార వ్యవస్థలను కబళించేందుకు అర్రులు చాస్తోంది.

# యురేనియం తవ్వకానికి రాష్ట్ర సర్కారే అడ్డు

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

'నల్లగొండ జిల్లాలో యురేనియం నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. కేసీఆర్ ఏమో తొవ్వనిచ్చే ప్రసక్తే లేదంటున్నడు. పులివెందులలో యూసీఐఎల్ ద్వారా యురేనియం తవ్వకాలు జరుగుతున్నాయి. నిక్షేపాలను వెలికి తీస్తున్నారు. ఇక్కడేమో కేసీఆర్ సర్కారు అడ్డుకుంటున్నది. ఒక కిలో యురేనియం విలువ 35 కేజీల బొగ్గుతో సమానం. ఫ్రాన్స్‌లో 70 శాతం ఎనర్జీ యురేనియం ద్వారానే ఉత్పత్తి అవుతున్నది. ఈ విషయంలో నల్లగొండ జిల్లా ప్రజలకు విశ్వాసం కల్పించాల్సిన రాష్ట్ర సర్కారు తన బాధ్యతను విస్మరించింది. తవ్వకాలు ప్రారంభమై ఉంటే కొన్నివేల మందికి ఉద్యోగాలు, పరోక్షంగా ఉపాధి లభించే అవకాశం ఉండేది. నల్లగొండ జిల్లా వేగంగా అభివృద్ధి చెందేది.

ఇలాంటి వాటికి దిక్కులేదుగానీ విశాఖ స్టీలు ఫ్యాక్టరీ గురించి మాట్లాడుతుంటే తెలంగాణ ప్రజలు నవ్వుకుంటు న్నారు' అని బీజేపీ ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. తాను గొప్ప విజ్ఞాని అనీ, బీజేపీ వాళ్లు అజ్ఞానులు అన్నట్టు కేటీఆర్ మాట్లాడారని విమర్శించారు. అమెరికాలో చదివినంత మాత్రాన మిగతా వాళ్లను చులకన చూసి మాట్లాడటం సరికాదనీ, దాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నా మన్నారు. కేటీఆర్ నిద్రలో కూడా అదాని, ప్రధాని అని కలవరిస్తున్నాడన్నారని విమర్శించారు. తెలంగాణలో మూతపడ్డ పరిశ్రమలకే దిక్కు లేదుగానీ వైజాగ్ స్టీల్ ప్లాంట్ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. వంద రోజుల్లో నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరుస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. హెచ్ఎమ్‌టీ, ఐడీపీఎల్, అజమ్ జాహి కంపెనీల మాటేంటని నిలదీశారు. హెచ్ఎమ్‌టీ, ఐడీపీఎల్ భూములపై బీఆర్ఎస్ నేతల కన్ను పడిందని ఆరోపించారు. మోడీ వచ్చాక 31 మినరల్స్ పై పూర్తి హక్కులను రాష్ట్రాలకు కల్పించామని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో డిమాండ్ కు తగ్గ బొగ్గు ఉత్పత్తి లేకపోవడంతో దిగుమతి చేసుకొనే వాళ్ళమన్నారు. తమకు నచ్చినవాళ్లకు బొగ్గు గనులిచ్చి బొగ్గు కుంభకోణంలో కాంగ్రెస్ కూరుకుపోయిందని విమర్శించారు. బయ్యారం ప్రమేయం లేకుండా కడప స్టీల్ ప్లాంట్ నడుస్తోంది కదా? అని ప్రశ్నించారు. ఎన్ఎమ్‌డీసీ ద్వారా ఆక్షన్‌లో పాల్గొని ఎవరైనా బొగ్గు నిక్షేపాలను కొనుక్కోవచ్చు నన్నారు. బైలడిల్ల నుంచి జపాన్ కంపెనీ బొగ్గు కొనుగోలు చేస్తోందనీ, దానికీ అదాని కంపెనీకి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. బైలడిల్ల ద్వారా విదేశాలకు బొగ్గు ఎగుమతి చేస్తున్నామని చెప్పారు. బయ్యారం ఉక్కు కర్మాగారం విషయంలో పారిశ్రామిక వేత్తలకు కావాల్సిన పాలసీ తెచ్చారా? రాష్ట్రంలో ప్రయివేటు సంస్థల అవసరం లేదా? అని ప్రశ్నించారు. స్టీల్ ప్లాంట్ పెట్టాలంటే కనీసం 200 మిలి యన్ టన్నుల ఐరన్ నిల్వలు ఉండాలనీ, బయ్యారంలో మాత్రం ఐదు మిలియన్ల టన్నుల స్టీల్ మాత్రమే ఉందని నిపుణుల నివేదికలు తేల్చి చెప్పాయన్నారు. అందుకే అక్కడ ఫ్యాక్టరీ పెట్టడం లేదని చెప్పారు. ప్రశ్నపత్రాల లీకుల గురించి సీఎం ఎందుకు మాట్లాడటం లేదు? బాధితులకు ఎందుకు భరోసా ఇవ్వడం లేదు? అని ప్రశ్నించారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని రాష్ట్రాన్ని కొల్లగొడతమంటే ప్రజలు చూస్తూ ఊరుకోబోరని హెచ్చరించారు. సింగరేణి లో జరుగుతున్న అవినీతి, కుంభకోణాలు కేంద్రానికి తెలిసి జరుగుతున్నాయా? అని ప్రశ్నించారు.

# ప్రశ్నాపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి వ్యవహారాన్ని తేల్చాలి

- టీఎస్‌పీఎస్సీ అభ్యర్థులకు నెలకు రూ.20వేలు ఇవ్వాలి
- సీఎం కేసీఆర్ స్పందించాలి
- ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ మహాదీక్షలో వక్తలు
- దీక్షను ప్రారంభించిన జాన్‌వెస్లీ
- నిమ్మరసం ఇచ్చి విరమింపచేసిన ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీపై హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. టెన్త్ ప్రశ్నాపత్రాల లీకేజీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రమేయాన్ని నిగ్గుతేల్చాలని కోరారు. భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ), భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర శాఖల సంయుక్తాధ్వర్యంలో మంగళవారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద మహా దీక్ష నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టీ నాగరాజు, ఉపాధ్యక్షులు టీ రవి, మిశ్రీన్, ప్రశాంత్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేష్, ఉపాధ్యక్షులు బషీర్, జావేద్, నవీన్, జగన్, కృష్ణనాయక్ తదితరులు దీక్షలో కూర్చున్నారు. ఎస్ఎఫ్ఐ మాజీ నేత, కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ వారందరికీ పూలమాలలు వేసి దీక్షల్ని ప్రారంభించారు. ఎస్ఎఫ్ఐ మాజీ నేతలు మూడ్ శోభన్, ఎస్ వీరయ్య, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్‌బాబు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీరాంనాయక్, ప్రయివేట్ టీచర్స్, లెక్చరర్స్ అసోసియేషన్ కన్వీనర్ విజయకుమార్ తదితరులు పాల్గొని, వారి దీక్షలకు మద్దతు ప్రకటించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మహేష్, శ్రీకాంత్, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి సందీప్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పీ లక్ష్మణ్, పీడీఎస్‌యూ అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, సందీప్, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణజ్యోతి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేష్ తదితరులు 'మహాదీక్ష'కు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రశ్నాపత్రాల లీకేజీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనీ, బండి సంజయ్ వ్యవహారంపై రాజకీయ కుట్రకోణంలో విచారణ జరపాలని కోరారు. పోటీ పరీక్షలకు దాదాపు 30 లక్షల మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారనీ, మళ్లీ పరీక్షలు సక్రమంగా నిర్వహించే వరకు వారందరికీ ప్రతినెలా రూ.20వేలు బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. ఏటా ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించాలనీ, నియామకాలను పారదర్శకంగా చేపట్టాలని కోరారు. ప్రశ్నాపత్రాల లీకేజీపై సిట్ దర్యాప్తుపై నమ్మకం లేదంటూ ఆక్షేపణలు వస్తున్నా యనీ, సీబీఐ విచారణపైనా విశ్వాసం లేదన్నారు. అందువల్ల హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి రాష్ట్ర ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీని కూడా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రాజ కీయాలకు వాడుకుంటున్నా యనీ, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ ఎవరికి అనుకూలమైన రాజకీయం వారు చేసుకుంటున్నారే తప్ప, నిరుద్యో గుల మనోవేదనను అర్థం చేసుకోవట్లేదన్నారు. కేంద్రం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చిందనీ, రాష్ట్ర ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి, ఇద్దరూ మాట తప్పారని విమర్శిం చారు. విద్యారంగంలో మనుధర్మశాస్త్రాన్ని అమలు చేయాలని బీజేపీ కుట్రలు చేస్తున్నదనీ, దానిలో భాగంగానే భగత్‌సింగ్ సహా అనేకమంది దేశభక్తుల పాఠ్యాంశాలను తప్పించి, కాషాయీకరణ చదువుల్ని చొప్పించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. లీకేజీల కారణంగా మనోవేదనకు గురై ఆత్మహత్యలు చేసుకున్న నిరుద్యోగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే సమాధానం చెప్పాలని స్పష్టం చేశారు.

**దీక్ష విరమణ**

మహాదీక్షలో కూర్చున్న నాయకులకు సాయంత్రం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి నిమ్మరసం ఇచ్చి విరమింపచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక కష్టనష్టాల కోర్చి, పోటీపరీక్షలకు ప్రిపేర్ అవుతూ, లీకేజీలతో మనోధైర్యం కోల్పోతున్న నిరుద్యోగులకు భరోసా కల్పించాలని చెప్పారు. లీకేజీలతో నష్టపోయిన తెల్లరేషన్ కార్డు నిరుద్యోగులకు ప్రతినెలా రూ.50 వేలు వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై చట్టసభల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు.

## వివక్ష లేని ఆధునిక సమాజ నిర్మాణమే లక్ష్యం

- ఫూలే జయంతి సభలో

**సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవి రాఘవులు**

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

కుల రహిత, అసమానతల్లేని సమాజం కోసం సామాజిక తత్వవేత్త మహాత్మా జోతిబాఫూలే చేసిన కృషి వెలకట్టలేనిదని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. ఆయన ఆశయాల సాధనలో భాగంగా వివక్ష లేని ఆధునిక సమాజ నిర్మాణమే లక్ష్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఫూలే 197వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యక్రమాన్ని నిర్వహించింది. ఫూలే చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ సమాజంలో పేరుకుపోయిన మూఢ విశ్వాసాలు, అజ్ఞానానికి కారణమైన మనువాద భావజాలాన్ని కూకటివేళ్లతో పెకలించాలన్నారు. విద్య ద్వారానే ప్రజలు, విద్యార్థుల్లో చైతన్యం తేవొచ్చని సూచించారు. మహిళ అభివృద్ధి చెందకపోతే సమాజం అభివృద్ధి చెందబోదని ఆనాడే ఫూలే భావించారని గుర్తు చేశారు.

అందుకే ఆయన సహచరి సావిత్రిబాయి ఫూలేకు విద్యాబుద్ధులు నేర్పించారని, ఆమె తొలి పంతులమ్మగా సఫలీకృతులయ్యారని చెప్పారు. వితంతువుల కోసం ఆశ్రమాన్ని స్థాపించారని అన్నారు. పితృస్వామ్య వ్యవస్థపై పిడిగులు కురిపించి పురాణాల కట్టుకథల గుట్టు రట్టు చేశారని వివరించారు. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థపై కలం, గళమెత్తారని వివరించారు. మనుషులంతా ఒక్కటేనని ఫూలే అన్నారని చెప్పారు. టీపీఎస్‌కే నాయకులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కారల్ మార్క్స్ రాసిన పెట్టుబడి గ్రంథం ద్వారా పెట్టుబడిదారీ సమాజం గుట్టును విప్పినట్టుగానే ఫూలే అంటరానితనం, కుల వివక్షను గులాంగిరీ పుస్తకంలో ఎండగట్టారని అన్నారు. ఆయన స్ఫూర్తితో ఆధిపత్య శక్తులపై పోరాడాలన్నారు. ఈనెల 16న సమతా వారోత్సవాల్లో భాగంగా సామాజిక సాంస్కృతికోత్సవాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీకే ప్రతినిధులు జి బుచ్చిరెడ్డి, ఎస్ సోమయ్య, జి రఘుపాల్, నియోకర్సర్ ప్రతినిధి జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

## మనువాదంపై పోరాడటమే ఫూలే కు నిజమైన నివాళి : ఆర్. శ్రీరాం నాయక్



మను వాదంపై పోరాడటమే ఫూలేకు నిజమైన నివాళని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్ అన్నారు. మంగళవారం సామాజిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య పార్కు వద్ద ఫూలే 197వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనువాదులు వేల సంవత్సరాలుగా ఎస్సీ ,ఎస్టీ, బలహీన వర్గాలను శూద్రులుగా ముద్ర వేసి వారిని సమాన అవకాశాలకు దూరం చేశారని తెలిపారు. అణిచివేతకు గురిచేశారని చెప్పారు. మనుస్మృతి ఆధారంగానే ఈ విధానాన్ని అమలు చేశారని తెలిపారు. మనుస్మృతికి వ్యతిరేకంగా 150 ఏండ్ల క్రితమే ఫూలే అనేక ఉద్యమాలు నిర్వహించారని గుర్తు చేశారు. శూద్ర కులాలు, మహిళలకు విద్యను అందించడంతోపాటు వారికి సమాన అవకాశాలు ఉండాలంటూ ఆధిపత్య బ్రాహ్మణీయ వాదానికి వ్యతిరేకంగా పోరాడుతూనే ప్రత్యక్షంగా పాఠశాలలు నెలకొల్పి విద్యనందించారని తెలిపారు. ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని ప్రవేశపెట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించిందని తెలిపారు. కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జాన్ వెస్లీ , స్కైలాబ్ బాబు, దశరథ్, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎం.వి రమణ, నరేష్, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బాస్, మిరియం వెంకటేశ్వర్లు, రాజు, గిరిజన సంఘం హైదరాబాద్ సౌత్ జిల్లా నాయకులు ఆంగోత్ కృష్ణా నాయక్, చిన్నాశ్రీను,ఆర్.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచంతో పోటీ పడేలా విద్యావకాశాలు

- విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- ఓయూలో ఇంజినీరింగ్ వసతిగృహ సముదాయానికి హోంమంత్రితో కలిసి శంకుస్థాపన



**నవతెలంగాణ-ఓయూ**

తెలంగాణ బిడ్డలు ప్రపంచంతో పోటీ పడేలా రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యావకాశాలు కల్పిస్తుందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ విద్యారంగంపై ప్రత్యేకంగా దృష్టి సారించారని చెప్పారు. విభిన్న రంగాల్లో ఆణిముత్యాలను అందించిన ఉస్మానియా విశ్వవిద్యాలయ అభివృద్ధికి అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఓయూలో ఇంజినీరింగ్ వసతిగృహ సముదాయానికి హోంశాఖ మంత్రి మహమూద్ ఆలీతో కలిసి మంగళవారం సబితాఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రూ.39.50 కోట్లతో 500 మంది విద్యార్థులకు సరిపోయేలా హాస్టల్ భవన నిర్మాణం చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. హోంశాఖ మంత్రి మహమూద్ ఆలీ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ విద్యారంగానికి ప్రతి ఏడాదీ బడ్జెట్‌లో నిధులు పెంచుతున్నారన్నారు. ఆరు నెలల వ్యవధిలోనే రూ.113 కోట్లతో ఓయూలో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. విద్యారంగంలో మౌలిక వసతుల కల్పన కోసం విద్యాశాఖమంత్రి కష్టపడి పని చేస్తున్నారని ప్రశంసించారు. ఓయూ వీసీ ప్రొ.రవీందర్ మాట్లాడుతూ.. ఓయూలో ఎప్పుడూ లేని విధంగా పెద్దఎత్తున మౌలిక వసతుల కల్పన జరుగుతోందన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో సముచిత నిధులు సమకూరుస్తోందన్నారు. మరో రెండు వసతి గృహాల నిర్మాణం కోసం గిరిజన సంక్షేమ శాఖ నుంచి రూ.40 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని వివరించారు.

ఓయూ ఎస్సీ, ఎస్టీ సెల్, బీసీ సెల్, మైనారిటీ సెల్ నిర్వహిస్తున్న మహనీయుల జయంతి ఉత్సవాల పోస్టర్‌ను మంత్రులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, రావుల శ్రీధర్‌రెడ్డి, తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొ.లింబాద్రి, రిజిస్ట్రార్ ప్రొ.పి.లక్ష్మీనారాయణ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరాం వెంకటేశ్, ప్రొ.జి.మల్లేశం, ప్రొ.మంగు, ప్రొఫెసర్ నవీన్, డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ ప్యాట్రిక్, ఆయా విభాగాల డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# మహిళల అభ్యున్నతి కోసం కృషి చేసిన పూలే..

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. వీరయ్య
- సీఐటీయూ కార్యాలయంలో పూలే జయంతి

**నవతెలంగాణ-అడిక్ మెట్**

అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళల అభ్యున్నతి కోసం జోతిరావు పూలే అహర్నిశలూ కృషి చేశారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. వీరయ్య అన్నారు. హైదరాబాద్ ముషీరాబాద్‌లోని సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అధ్యక్షతన జ్యోతిరావు పూలే జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం వీరయ్య మాట్లాడుతూ.. పూలే, అతని భార్య సావిత్రిబాయి పూలే దేశంలో మహిళలకు విద్య నేర్పడానికి మార్గదర్శకులుగా నిలిచారన్నారు. పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. 1848లో బాలికల విద్య కోసం పూలే పూణేలో పాఠశాల ప్రారంభించారని, వితంతువుల కోసం ఒక గృహాన్ని స్థాపించారని తెలిపారు. వేదాలను పవిత్రంగా భావించడాన్ని వ్యతిరేకించారని. విగ్రహారాధనను ఖండించారని చెప్పారు. నేటి తరాలకు ఆయన ఆదర్శమని, ఆశయాల సాధన కోసం పునరంకితమవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుయి ఎస్‌వి.రమ, పి.జయలక్ష్మి, కార్యదర్శులు జె.వెంకటేష్, బి.మధు, పి.శ్రీకాంత్, కార్యకర్తలు వై.సోమన్న, పి.సుధాకర్, ఎ.సునీత, ఎస్.ఎస్.ఆర్.ఎ. ప్రసాద్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఏ పార్టీకి లొంగి పనిచేయను

- బండి సంజయ్ బ్లాక్ మెయిల్‌కు బెదరం
- దర్యాప్తులో నిజాలు వెలుగులోకి వస్తాయి
- సెటిల్‌మెంట్లు చేశానని నిరూపిస్తే ఉద్యోగం వదిలేస్తా..
- వరంగల్ సీపీ రంగనాథ్



**నవతెలంగాణ-ఎన్‌జీవోస్ కాలనీ**

విధి నిర్వహణలో ఏ పార్టీకి లొంగిపని చేయనని, బండి సంజయ్ బ్లాక్‌మెయిల్‌కు బెదిరేది లేదని వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ ఆరోపణలపై పోలీసు కమిషనర్ స్పందించారు. ఈ మేరకు ఆయన మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. తాను ఎవరి పక్షాన ఉంటానో ప్రజలకు తెలుసునని స్పష్టం చేశారు. తాను ఎక్కడ పనిచేసినా ప్రజలు తనను గుర్తుంచుకుంటారన్నారు. పోలీసులు చేసిన దర్యాప్తును ఎవరైనా తప్పుపట్టడం సహజమని, అందులో భాగంగానే బండి సంజయ్ తనపై తీవ్ర ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. వివిధ కేసుల్లో తాను నిందితులపై కఠినచర్యలు తీసుకుంటే కొందరికి బాధ ఉండొచ్చు.. వాళ్లే పోలీసులపై ఆరోపణలు చేస్తుంటారని తెలిపారు. తాను సెటిల్‌మెంట్లు చేశాననే ఆరోపణలు చూసి నవ్వాలో ఏడవాలో తెలియలేదని అన్నారు. సెటిల్‌మెంట్ చేయలేదని ప్రమాణం చేయాలంటూ బండి చేసిన సవాల్‌పై సీపీ స్పందిస్తూ.. సెటిల్‌మెంట్లు చేసినట్లు నిరూపిస్తే ఉద్యోగం వదిలేస్తానని సీపీ సవాల్ చేశారు. ప్రతి కేసులో ప్రమాణాలు చేసుకుంటూ పోతే ఇప్పటివరకు తాను పదివేల సార్లు ప్రమాణాలు చేసి ఉండాల్సిందని అన్నారు. విచారణకు ఈటల రాజేందర్ అద్భుతంగా సహకరించారని, వారిని గౌరవంగా చూసుకున్నామని వ్యాఖ్యానించారు. బీజేపీ నేతలను ఇబ్బంది పెట్టాలనే ఆలోచన తమకు లేదని, చట్టం ప్రకారమే నడుచుకున్నామని అన్నారు. తాను విధుల్లో చేరినప్పటి నుంచి రాజకీయాలకతీతంగా విధులు నిర్వహించానని, ఏ పార్టీ నేతలకు లొంగలేదని గుర్తుచేశారు. తనకు పోలీస్‌స్టేషన్ దేవాలయంతో సమానమని, ప్రజలు న్యాయం కోసం స్టేషన్ మెట్లు ఎక్కుతుంటారని, వారికి న్యాయం చేయడానికి మాత్రమే కృషి చేస్తానని అన్నారు. అంతేగాక స్పెషల్ ఆఫీసర్‌గా నందిగామకు తనను పంపించారని, సత్యంబాబు కేసులో తాను ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ కాదని క్లారిటీ ఇచ్చారు. వరంగల్ హిందీ పేపర్‌ది లీకేజీ కేసు కాదని, ఇది కేవలం మాల్ ప్రాక్టీస్ కేసు మాత్రమేనన్నారు. మాల్ ప్రాక్టీస్ జరిగిందని ముందుగా చెప్పింది కూడా తానేనని వెల్లడించారు.

# మోటర్లకు మీటర్లు పెట్టలేదని..

## రాష్ట్రానికి నిధులివ్వని కేంద్రం

- రూ.60 వేల కోట్ల మేర నిధులాపిన మోడీ
- రైతుల కోసం ఎన్ని కష్టాలైనా భరిస్తం
- ఉపాధి పని దినాలు తగ్గించి పేదలపై కుట్ర
- మీటర్లు పెట్టబోమంటూ జెడ్పీ ఏకగ్రీవ తీర్మానం
- సంగారెడ్డి జెడ్పీ సమావేశంలో మంత్రి హరీశ్‌రావు



**నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి**

వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టలేదన్న నెపంతో రాష్ట్రానికి రావాల్సిన రూ.30 వేల కోట్ల నిధుల్ని కేంద్రం ఆపిందని, అయినా రైతుల కోసం ఎన్ని కష్టాలైనా భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్దంగా ఉందని ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా జెడ్పీ సమావేశానికి హాజరయిన మంత్రి హరీశ్.. ముందుగా జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ అధ్యక్షతన జరిగిన జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ సంస్కరణల పేరిట కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు ఇచ్చే ఉచిత కరెంట్‌ను ఎత్తివేయాలని ఒత్తిడి చేసిందన్నారు. నిధులివ్వకుండా ఇబ్బందులు పెట్టిందన్నారు. కేంద్రం ఎంత ఒత్తిడి చేసినా సీఎం కేసీఆర్ రైతుల కోసం యూనిట్‌కు రూ.20 ఖర్చు చేసి అయినా ఉచిత కరెంట్‌ను కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ యాసంగీ సీజన్ పంటలు ఎండకుండా ఉండేందుకు విద్యుత్ కొనుగోలు కోసం రూ.15 వేల కోట్ల అదనపు భారాన్ని రాష్ట్రం భరిస్తుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించినందుకు బీఆర్ఎస్‌పై కక్షకట్టి రాష్ట్రానికి రావాల్సిన బీఆర్‌జీఎఫ్ నిధులు రూ.1350 కోట్లు, మిషన్ భగీరథకు నిటి ఆయోగ్ సిఫార్సు చేసిన రూ.13 వేల కోట్లు, మిషన్ కాకతీయకు రావాల్సిన రూ.12 వేల కోట్లు, రైతులకు కల్లాలు కట్టిన డబ్బులు ఇలా సుమారు రూ.60 వేల కోట్ల వరకు నిధుల్ని ఇవ్వట్లేదన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత కరెంట్, రైతు బంధు, ఎరువుల సరఫరా, రుణమాఫీ వంటి పథకాలు అమలు చేయడం వల్ల తెలంగాణ ధాన్యాగారంగా మారిందన్నారు. ఏటా రైతులు పండించే ధాన్యాన్ని రాష్ట్రం కొనుగోలు చేసి రూ.26 వేల కోట్లు ఖాతాలో వేస్తుందని తెలిపారు. కేంద్రం ఉపాధి హామీ చట్టంలో కూలీలకు పని దినాల్ని తగ్గించి, పని గంటలు పెంచిందని, అయినా వేతనం మాత్రం పెంచలేదని విమర్శించారు. రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరిగినందున ఉపాధి కూలీలతో ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకే పని చేయించాలని అధికారుల్ని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రభుత్వ దవాఖానాలంటే ప్రజలకు భరోసా కల్పించే విధంగా వైద్య సేవల్ని మెరుగుపర్చామన్నారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంపై మహిళలకు అవగహన కల్పించాలని అధికారుల్ని ఆదేశించారు. రాష్ట్రంలో 108 అంబులెన్స్‌లకు 200 కొత్త వాహనాల్ని సమకూర్చుతున్నామన్నారు. రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో ఆస్పత్రుల్లో బెడ్లు పెంచామన్నారు. గర్భిణుల కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రుల్లో టిఫా స్కాన్, నియోజకవర్గ కేంద్రంలో డయాలసిస్ సెంటర్ పెట్టామని తెలిపారు. త్వరలోనే ప్రతి నర్సు పోస్టుల్ని భర్తీ చేస్తామన్నారు. అనంతరం బస్తీ దవాఖానాను ప్రారంభించారు. కాగా, రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.30వేల కోట్ల నిధుల్ని వెంటనే విడుదల చేయాలని సంగారెడ్డి జెడ్పీ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, చంటిక్రాంతికిరణ్, మాణిక్యరావు, చేనేత అభివృద్ధి సంస్థ చైర్మెన్ చింత ప్రభాకర్, కలెక్టర్ డాక్టర్ శరత్ పాల్గొన్నారు.

# మనిషిని సన్మార్గంలో నడిపేది పుస్తకం

**డిజిటల్ యుగంలో సాహిత్యానికి ఆదరణ**

- వచ్చే ఏడాది కళాభారతిలో పుస్తకాల ప్రదర్శన : మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- నవతెలంగాణ పుస్తకప్రదర్శన ప్రారంభం



**నవతెలంగాణ- మహబూబ్‌నగర్**

సమాజంలో ప్రతి మనిషినీ సన్మార్గంలో నడిపేది ఒక పుస్తకం మాత్రమేనని ఎక్సైజ్ క్రీడలు సాంస్కృతిక సమాచార శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ మైదానంలో మంగళవారం ఏర్పాటు చేసిన నవతెలంగాణ పుస్తక ప్రదర్శనను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు ప్రతి మనిషీ వేగంగా ప్రయాణిస్తూ.. ఆలోచింపజేస్తున్న డిజిటల్ యుగంలోనూ సాహితీ రంగానికి ఎంతో ఆదరణ ఉందన్నారు. ఎందరో మహనీయుల జీవిత చరిత్రలు, జ్యోతిరావు పూలేలాంటి సాహితీవేత్తలను గుర్తుకు తెచ్చేవి ఒక్క పుస్తకాలు మాత్రమేనని చెప్పారు. ఎంతటి చెడ్డవారిలోనైనా పుస్తక జ్ఞానం ద్వారా మార్పు తీసుకురావచ్చని తెలిపారు. పుస్తకాలకు సాహిత్యానికి ఆదరణ లేదంటూ చర్చ జరుగుతున్న ఈ రోజుల్లో నవ తెలంగాణ యాజమాన్యం పుస్తక సాహిత్యాన్ని ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చి ప్రదర్శిస్తున్నందుకు వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. దేశంలో మన మహనీయులు సాధించిన అనేక విజయాలను, చరిత్రను ఘట్టాలను నేటి కేంద్ర ప్రభుత్వం మరుగున పరిచేందుకు కుట్ర చేస్తుందని విమర్శించారు.

తెలంగాణ పోరాటంలో తాను ప్రత్యక్షంగా పాల్గొన్న అనేక సంఘటనలను వివిధ పత్రికల్లో ప్రచురించిన అంశాలతో ముద్రించిన పుస్తకాలను నవతెలంగాణ వారికి అందజేశారు. ప్రస్తుతం ఇక్కడ ఈ చిన్న స్థలంలో నవతెలంగాణ పుస్తక ప్రదర్శన నిర్వహించుకుంటున్నారని, వచ్చే ఏడాది నాటికి కళాభారతిని పూర్తి చేసి అందులో పెద్దఎత్తున పుస్తక ప్రదర్శన నిర్వహించడానికి అవకాశం ఇస్తామని తెలిపారు.

ఇలాంటి మంచి కార్యక్రమం చేస్తున్న నవతెలంగాణ పత్రిక యాజమాన్యానికి ప్రభుత్వం తరపున ఎప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ జనరల్ మేనేజర్ వాసు, ఉమ్మడి జిల్లా మేనేజర్ ఎం.కార్తీక్, ప్రాంతీయ ప్రతినిధి పరిపూర్ణం, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ.రాములు, సీనియర్ నాయకులు కె.గోపాల్, నల్లవెల్లి కురుమూర్తి, చంద్రకాంత్, రాజు కుమార్, నవతెలంగాణ డెస్క్ ఇన్‌చార్జి భాస్కర్, విలేకరి జనార్దన్, బుక్‌హౌస్ ఇన్‌చార్జి సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆమె గవర్నరా, బీజేపీ నాయకురాలా?

- బిల్లులను పెండింగ్‌లో ఉంచే అధికారం ఆమెకెక్కడిది..
- గవర్నర్‌ను అడ్డుపెట్టి కేంద్రం ఆడుతున్న నాటకం : మంత్రి జగదీశ్‌రెడ్డి



**నవతెలంగాణ-సూర్యాపేట**

గవర్నర్ గవర్నర్‌గా కాకుండా బీజేపీ నాయకురాలిలా పనిచేస్తున్నారని విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామిక పద్ధతిలో ఎన్నికైన ప్రభుత్వం రూపొందించే చట్టాలను అడ్డుకునే అధికారం గవర్నర్‌కెక్కడిదని ప్రశ్నించారు. రాజ్యాంగ మూలసూత్రాలను కాదని చట్టాలు రూపొందిస్తే అడ్డుకునే అధికారం సుప్రీంకోర్టు ధర్మాసనానికి మాత్రమే ఉందని చెప్పారు. ప్రజాస్వామిక ప్రభుత్వాలు నిండు సభలో శాసనసభ్యుల ఆమోదంతో రూపొందించిన బిల్లులను నిలువరించే హక్కు గవర్నర్ లేదన్నారు. యావత్ ప్రపంచానికి భారత పార్లమెంటరీ వ్యవస్థ, రాజ్యాంగం స్ఫూర్తిదాయకంగా నిలిస్తే.. మోడీ సర్కార్ దాన్ని తూట్లు పొడుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత ప్రజాస్వామ్యానికి ఇది గొడ్డలి పెట్టని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీయేతర రాష్ట్రాల అభివృద్ధిని అడ్డుకునే కుట్రలో ఇది భాగమని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులను గవర్నర్ పెండింగ్‌లో పెట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్ర శాసనసభలో ఒకలా.. రాజ్ భవన్‌లో మరోలా ప్రవర్తించడం గవర్నర్ తమిళిసైకే చెల్లిందన్నారు. నిన్నగాక మొన్న నిండు సభలో తెలంగాణా అభివృద్ధిని స్వయంగా కొనియాడిన గవర్నర్.. రాజ్‌భవన్‌కు వెళ్లగానే అదే సభలో ఆమోదించిన పద్దులను పెండింగ్‌లో పెట్టడమే ఇందుకు తార్కాణమన్నారు. బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్లను కేంద్రం బీజేపీ కార్యకర్తల్లాగా వినియోగించుకుంటోందని విమర్శించారు.

తమిళనాడు శాసనసభ సమావేశాల్లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం గవర్నర్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేసిందంటే కేంద్రం వైఖరి ఏమిటో బట్టబయలైందన్నారు. గవర్నర్‌ను అడ్డు పెట్టుకుని కేంద్రం ఆడుతున్న దుర్మార్గమైన నాటకానికి గవర్నర్ల తీరు నిదర్శనంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తుంటే తట్టుకోలేక బీజేపీ ఈ డ్రామాలను తెర లేపిందని విమర్శించారు. ఇక్కడి పథకాల డిమాండ్ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రజల నుంచి వస్తున్నందునే ఇటువంటి కుట్రలకు బీజేపీ రూట్ మ్యాప్‌గీసిందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల కంటే బీజేపీయేతర రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధి మోడీ సర్కార్‌కు కంటగింపుగా మరినందునే రాజ్‌భవన్‌లను అడ్డుపెట్టుకుని గవర్నర్‌లు బిల్లులను పెండింగ్‌లో పెడుతున్నారని, ఇది ప్రజాస్వామ్యానికి హానికరమని అన్నారు.

# ఇండ్ల స్థలం100 గజాలు ఇవ్వలేరా..?

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లెల బాలకృష్ణ
- కోరుట్లలోని ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్న పేదలు



**నవతెలంగాణ - కోరుట్ల**

పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థలకు వేల ఎకరాలు కట్టబెడుతున్న ప్రభుత్వం.. పేదల ఇండ్ల స్థలాలకు 100 గజాలు ఇవ్వలేదా అని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లెల బాలకృష్ణ ప్రశ్నించారు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రభుత్వ భూమిలో మంగళవారం గుడిసెలు వేశారు. జ్యోతిరావు పూలే 197 జయంతిని కూడా అక్కడే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనీసం ఒక్కో పేదింటికి 100 గజాల స్థలం కూడా కేటాయించకుండా.. ప్రభుత్వం ఇండ్లు కట్టుకునేందుకు డబ్బులు ఇస్తామంటోందన్నారు. స్థలం లేకుండా ఇండ్లు ఎలా కట్టుకుంటారని ప్రశ్నించారు. రెక్కాడితేగానీ డొక్కాడని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని పేదలకు స్థలం కేటాయించి ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10లక్షలు ఇవ్వాలని కోరారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 28 కేంద్రాల్లో తమ పార్టీ ఆధ్వర్యంలో లక్షా 70వేల గుడిసెలు వేయించామని, ఇందులో 90వేల మందికి పక్కా గృహాలు ఏర్పడ్డాయని చెప్పారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్ర వ్యాప్తంగా ఇండ్లు లేని పేదలకు స్థలాలు ఇప్పించేవరకు తమ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు సాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జగిత్యాల జిల్లా కన్వీనర్ తిరుపతి నాయక్, నాయకులు ఇందూరి సులోచన, ఎంఎ.చౌదరి, ముడుగం రాజలింగు, గుమ్మడి రమేష్, జంగిలి ఎల్లన్న, గంగారెడ్డి, తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం నాయకులు లాక్‌వత్ మహిపాల్, భూపోరాట నాయకులు, పేదలు పాల్గొన్నారు.

# దేవుడు కలలో చెప్పాడని.. మహిళ ఆత్మహత్యాయత్నం

- ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న మహిళ
- రాజేంద్రనగర్ పరిధిలో ఘటన

**నవతెలంగాణ-రాజేంద్రనగర్**

దేవుడు కలలోకి వచ్చి చెప్పాడంటూ ఓ మహిళ ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పు అంటించుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. రాజేంద్రనగర్ సీఐ నాగేంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నంది ముసలైగూడకు చెందిన శివాని(35) భర్త లేకపోవడంతో తల్లితో కలిసి ఉంటుంది. స్థానికంగా భిక్షాటన చేస్తూ జీవనం కొనసాగిస్తోంది. అయితే కొద్ది కాలంగా ఆమె మానసిక పరిస్థితి సరిగా లేదు. మంగళవారం ఉదయం అత్తాపూర్‌లోని ప్రధాన రహదారి పక్కన కూర్చుని ఒకసారిగా ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పంటించుకుంది. వెంటనే స్థానికులు గమనించి మంటలను ఆర్పించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. అయితే రాత్రి దుర్గాదేవి కలలో కనిపించి ఆత్మహత్య చేసుకోవాలని చెప్పిందని, అందుకే తాను ఆత్మహత్య చేసుకున్నానని శివాని తెలిపింది. తనకు భర్త లేదని, తాను ఎవరి కోసం జీవించాలని, అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నానని పోలీసులకు తెలిపింది. పోలీసులు ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

# పరిహారం కోసం ఇరిగేషన్ ఏఈ నిర్బంధం



**నవతెలంగాణ - మంథని**

ప్రాజెక్టులో మునిగిన భూములకు సంబంధించి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు ఇరిగేషన్ శాఖ ఏఈని నిర్బంధించారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఆనంద గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇరిగేషన్‌శాఖ ఏఈని మంగళవారం నిర్బంధించారు. అన్నారం ప్రాజెక్టులో భాగంగా భూములు తీసుకున్న ప్రభుత్వం సుమారు 365 ఎకరాలకు క్రాప్‌హాలిడే పరిహారాన్ని ప్రకటించింది. సుమారు 8 సీజన్లకు చెందిన క్రాప్ హాలిడే కింద రావాల్సిన పరిహారంలో మూడు పంటలకు మాత్రమే ప్రభుత్వం డబ్బులు చెల్లించింది. మిగతా పరిహారం కోసం గ్రామస్తులు ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో సర్వే కోసం వచ్చిన ఇరిగేషన్ శాఖ ఏఈ వెంకన్నను గ్రామస్తులు పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటేశ్వర్ ఉన్నతాధికారులతో మాట్లాడి పరిహారం అందేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఏఈని వదిలేశారు.

# 'పది' హిందీ పేపర్ లీకేజీ కేసులో.. బండి సంజయ్ కస్టడీ పిటీషన్ కొట్టివేత

- మరో ముగ్గురికి బెయిల్ మంజూరు

**నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి**

పదో తరగతి పరీక్షా పత్రాల లీకేజీ కేసులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కస్టడీ కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటీషన్‌ను కోర్టు డిస్మిస్ చేసింది. ఈనెల 11వ తేదీన ఈ పిటీషన్‌పై కోర్టులో విచారణ జరిగిన విషయం విదితమే. కస్టడీ అవసరం లేదని, ఇప్పటికే పోలీసుల విచారణ పూర్తయిందని బండి సంజయ్ న్యాయవాదులు చేసిన వాదనతో కోర్టు ఏకీభవించింది. దాంతో పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌ను న్యాయమూర్తి డిస్మిస్ చేశారు. కేసులో కుట్ర కోణం లేదని, కస్టడీలోకి తీసుకొని విచారించాల్సిన అవసరం లేదని సంజయ్ న్యాయవాదులు తమ వాదనలను వినిపించారు. ఈ కేసులో సంజయ్‌తోపాటు జైలుకు వెళ్లిన మరో ముగ్గురికి హన్మకొండ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఏ2 ప్రశాంత్, ఏ3 మహేశ్, ఏ5 శివగణేష్‌కు పలు కండీషన్‌లతోకోర్టు బెయిల్ మంజూరు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో ముగ్గురు నిందితులు కరీంనగర్ జైలు నుండి విడుదల కానున్నారు.

# త్వరలో తొమ్మిది మెడికల్ కాలేజీలు

- 7,090కు చేరిన ఎంబీబీఎస్ సీట్లు : మంత్రి హరీశ్ రావు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో త్వరలో మరో తొమ్మిది మెడికల్ కాలేజీలను ప్రారంభించబోతున్నామని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు. మంగళవారం ఆయన బోధనాస్పత్రుల నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2014-15లో రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 2,950 ఉంటే ప్రస్తుతం ఆ సంఖ్య 7,090కు చేరిందని తెలిపారు. ఎంబీబీఎస్ సీట్ల శాతం 240కు, పీజీ సీట్ల శాతం 111కు పెరిగాయని తెలిపారు.

**సూపరింటెండెంట్లదే బాధ్యత**

ఎంఎన్‌సీ నిబంధనల ప్రకారం మెడికల్ కాలేజీల నిర్వహణ, అన్ని వైద్య పరికరాలు పని చేసేలా చూడటం, డిశ్చార్జ్ అయిన రోగులకు ఉచితంగా మందుల సరఫరా, వాటి బోర్డుల ఏర్పాటు, మెనూ ప్రకారం డైట్ అందించడం, ఆస్పత్రి పరిసరాల పరిశుభ్రత, ఇన్ఫెక్షన్ నియంత్రణ బాధ్యత ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్లదేనని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ కె.రమేశ్ రెడ్డి పాల్గొన్నారు.

# బీజేపీ విధానాలతో బీసీలకు నష్టం

- జన గణనలో కేంద్రం నిర్లక్ష్యం
- మోడీ సర్కార్‌పై ఉమ్మడి పోరాటం తప్పదు
- ఫూలే జయంతి కార్యక్రమంలో మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, గంగుల

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

బీజేపీ విధానాలు వెనుకబడ్డ తరగతులకు వ్యతిరేకంగా ఉన్నాయని మంత్రులు వి శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్ వివరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావ్ ఫూలే 197వ జయంతిని నిర్వహించారు. గంగుల కమలాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీ గణన నిర్వహించకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని చెప్పారు. దీని మతలబేంటని ప్రశ్నించారు. ఇప్పటి వరకు బీసీలకు కేంద్ర మంత్రిత్వ శాఖ కూడా ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేషన్లు అమలు చేయకుండా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని విమర్శించారు. మోడీ ప్రభుత్వ విధానాలపై ఉమ్మడి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీసీలు ఈ రోజు ఈ మాత్రం తెలివితోటైనా ఉన్నారంటే..దానికి కారణం నాడు ఫూలే నిర్వహించిన పోరాటాలే కారణమని తెలిపారు. ఆయన ఆదర్శాలతోనే సాహు మహారాజ్ రిజర్వేషన్లను తీసుకొచ్చారని గుర్తుచేశారు. సామాజికోద్యమ నేతల స్ఫూర్తితో రాష్ట్రంలో పాలన కొనసాగుతున్నదని వివరించారు. బీసీలకు 310 హాస్టళ్ల ద్వారా ప్రపంచ స్థాయి విద్యను అందిస్తున్నామని చెప్పారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, సర్వాయి పాపన్న తదితర బీసీ బిడ్డల వేడుకలను రాష్ట్ర పండుగలుగా నిర్వహించుకుని వారిని ఘనంగా స్మరించుకుంటున్నామని తెలిపారు. గంగుల మాట్లాడుతూ సూర్య చంద్రులున్నంత వరకూ జ్యోతిభాఫూలే, సావిత్రీబాయి ఫూలేల స్ఫూర్తి వెల్లివిరుస్తుందని చెప్పారు. వారి ఆశయ సాధనలో అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. పత్రికలు, సెల్ ఫోన్లు లేని కాలంలోనే వెనుకబడిన వర్గాలపై సమగ్ర అధ్యయనంచేసి, వారి అభ్యున్నతికి విశేషకృషి చేశారని గుర్తుచేశారు.

సంపాదకీయం

# నిఘా నీడలో...

'అలలపై నిఘా, అలలు కనే కలలపై నిఘా, చిరుగాలి సితారా సంగీతంపై నిఘా, అలలపై కదిలే పడవలపై నిఘా, పడవల తెరచాపలపై నిఘా, తెరచాపల తెల్లదనంపై నిఘా' ప్రముఖ కవి శివసాగర్ అన్న వ్యాఖ్యలు మోడీ సర్కారుకు సరిగ్గా సరిపోతాయి.

'రైట్స్ అండ్ రిస్క్ అనాలసిస్ గ్రూప్' నివేదిక ప్రకారం ఒక్క 2021లోనే దేశవ్యాప్తంగా ఆరుగురు పాత్రికేయులు దారుణ హత్యలకు గురయ్యారు. వివిధ దాడుల్లో మరో వంద మందికి పైగా బాధితులయ్యారు. పదమూడు వార్తాపత్రికలు, మీడియా సంస్థలు వేధించబడ్డాయి. తమకు ఎదురే ఉండకూడదనే అప్రజాస్వామిక ఆలోచనను నెత్తినమోస్తున్న మోడీ సర్కార్, పత్రికలపై కూడా అదే కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తోంది. విమర్శనాత్మక పాత్రికేయంపై ప్రభుత్వ, ప్రభుత్వేతర పెత్తందారీ శక్తుల్లో పోనుపోను అసహనం పెచ్చరిల్లుతోంది.

సాంకేతిక పురోగతితో పారదర్శకత మెరుగుపడాలి. పౌరులు అభిప్రాయాల వ్యక్తీకరణకీ, భావాల కలబోతకీ గల అవకాశాల్ని విస్తృతం చేయాలి. కానీ, అందుకు విరుద్ధంగా మనుషుల కదలికలపై నిఘా పెంచడమంటే రాజ్యాంగం కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛని కాలరాయడమే. కేంద్ర ప్రభుత్వ విధానాలపై ప్రజలను తప్పుదోవ పట్టించే అసత్య సమాచారమేదీ ఆన్‌లైన్‌లో వ్యాప్తిచెందకుండా చూడటం కోసమంటూ... సవరించిన 2021 ఐటీ నిబంధనలను నాలుగు రోజుల క్రితం సర్కారు నోటిఫై చేసింది. ఆ ప్రకారం, సామాజిక మాధ్యమాలు, అంతర్జాల సేవలు అందించే సంస్థలు 'సురక్షితం'గా మనగలగాలంటే ఆ సర్కారీ విభాగం నకిలీ వార్తలుగా తేల్చిన వాటిని తక్షణమే తొలగించాల్సి ఉంటుంది. వార్తల తప్పొప్పులను నిర్ధారించే సర్వాధికారాలను ప్రభుత్వం తనకుతాను కట్టబెట్టుకోవడంపై 'ఎడిటర్స్ గిల్డ్' ఆందోళన వ్యక్తంచేసింది. అర్థవంతమైన సంప్రదింపులేవీ లేకుండా ఏకపక్షంగా నిబంధనల మార్పుడమేమిటని ప్రశ్నించింది.



సామాజిక ఉద్రిక్తతలు, హింసాత్మక ఘటనలకు కారణభూతమవుతున్న కల్పిత వార్తలను కట్టడి చేయడం, ప్రజాశ్రేయస్సు దృష్ట్యా కచ్చితంగా అవసరమే! కానీ, ఆ నెపంతో ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువైన భావస్వేచ్ఛను, మీడియాస్వేచ్ఛను హరించే మంత్రాంగంగా ఐటీ నిబంధనల సవరణపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే మన వ్యక్తిగత సమాచారాన్ని చాటుమాటుగా మార్కెట్‌శక్తులకు అమ్ముకుంటున్నారు. తాజాగా పర్సనల్ కంప్యూటర్‌ను కూడా ఎప్పుడంటే అప్పుడు తనిఖీ చేసే దుర్మార్గానికి పాలకులు తెరదీశారు. మనకంటూ వ్యక్తిగత అభిప్రాయాలు ఉండకూడదని, అధికారంలో ఉన్నవారు చెప్పిందే వేదంగా నమ్మాలన్నది ఏలికల అభిప్రాయం. ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలు మార్కెట్‌శక్తులకీ, పాలకపార్టీలకి గులాంగిరీ చేస్తున్న నేపథ్యంలో ప్రజల మనోభావాల వ్యక్తీకరణకు వేదికైంది సోషల్‌మీడియా. జనం గోడును పట్టించుకోని ప్రధాన స్రవంతి మీడియాకి ప్రత్యామ్నాయంగా నిలిచింది. దీనిని కూడా నియంత్రించే మహా కుతంత్రానికి తెరదీశారు కమలనాథులు.

కంప్యూటర్ల వినియోగం, ఇంటర్నెట్ విస్తరణ వంటి అవకాశాలపై ఆంక్షలు విధించడమంటే ఎటూ మెసలకుండా చేయడమే. ఎవరు తుమ్మినా, దగ్గినా బెంబేలెత్తే అభద్రతాభావంలో పాలకులు ఉన్నారనడానికి ఇంతకంటే ఉదాహరణలింకేమి కావాలి? ఒక చిన్న మెసేజ్, ఈమెయిల్ కూడా తమ కంటబడకుండా వెళ్ళరాదనే ధూర్తత్వాన్ని పాలకులు ప్రదర్శిస్తున్నారు. ప్రజలకు వాస్తవాలు వెల్లడించడం పత్రికలూ ప్రసారమాధ్యమాల విధి. మలయాళ వార్తా ఛానెల్ 'మీడియా వన్'పై కేంద్ర ప్రభుత్వ నిషేధాన్ని తొలగిస్తూ కొద్దిరోజుల క్రితం సర్వోన్నత న్యాయస్థానమే ఈ కీలకాంశాన్ని ఉద్ఘాటించింది. ప్రజాస్వామ్య మనుగడకు మీడియా స్వతంత్రత ముఖ్యమైనదని సుప్రీంకోర్టు చెప్పిన మాటలు అక్షరసత్యాలు. 'లైంగికదాడులపై మీడియా కథనాలే ప్రజల్లో చైతన్యానికి కారణమయ్యాయి... పత్రికలు ఎన్నో సామాజిక, రాజకీయ మార్పులకు ప్రేరణగా నిలిచాయి' అంటూ సిజెఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఇటీవల పత్రికాస్వేచ్ఛా పరిరక్షణకు పిలుపిచ్చారు.

ప్రభుత్వ విధానాలను ప్రజాప్రయోజనాల కోణంలో నిష్పాక్షికంగా విమర్శించే పత్రికలూ ప్రసారమాధ్యమాలపై కత్తిగట్టే ధోరణులు దేశీయంగా కొన్నేళ్లుగా విశృంఖలమవుతున్నాయి. మీడియా సంస్థల పీకనులమడానికి రాజద్రోహం వంటి కఠిన శాసనాలను ప్రయోగించిన ఉదంతాలూ గతంలో వెలుగుచూశాయి. 'రైట్స్ అండ్ రిస్క్ అనాలసిస్ గ్రూప్' నివేదిక ప్రకారం ఒక్క 2021లోనే దేశవ్యాప్తంగా ఆరుగురు పాత్రికేయులు దారుణ హత్యలకు గురయ్యారు. వివిధ దాడుల్లో మరో వంద మందికి పైగా బాధితులయ్యారు. పదమూడు వార్తాపత్రికలు, మీడియా సంస్థలు వేధించబడ్డాయి. తమకు ఎదురే ఉండకూడదనే అప్రజాస్వామిక ఆలోచనను నెత్తినమోస్తున్న మోడీ సర్కార్, పత్రికలపై కూడా అదే కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తోంది. విమర్శనాత్మక పాత్రికేయంపై ప్రభుత్వ, ప్రభుత్వేతర పెత్తందారీ శక్తుల్లో పోనుపోను అసహనం పెచ్చరిల్లుతోంది. రాజ్యాంగ బద్ధమైన పత్రికాస్వేచ్ఛకు అది ప్రాణసంకటమవుతోంది. అతిపెద్ద ప్రజాస్వామ్యదేశంలో ప్రజల భావస్వేచ్ఛకు ఇది గొడ్డలిపెట్టు. ఈ పాశవిక విధానాల్ని నిరసించడం, ప్రతిఘటించడం ఆలోచనాపరుల కర్తవ్యం.

# అతిరహస్యం బట్టబయలు : మిత్రుల మీదా దొంగకన్నేసిన అమెరికా



ఎం. కోటేశ్వరరావు

అందరికీ జోస్యం చెప్పే బల్లి తానే కుడితి తొట్లో పడికొట్టుకున్నట్లుగా ఉంది అమెరికా పరిస్థితి. పదేండ్ల క్రితం కేవలం వందడాలర్ల(రూ.8,200)తో కొనుగోలుకు అందుబాటులో ఉన్న సాఫ్ట్‌వేర్‌తో ఎడ్వర్డ్ స్నోడెన్ అనే ఒక ప్రయివేటు కంపెనీ ఉద్యోగి లక్షలాది పత్రాలను లీకు చేశాడు. స్నోడెన్‌కు ఇటీవలనే పుతిన్ తమ దేశ పౌరసత్వాన్ని ఇచ్చాడు. అంతకు ముందు 1971లో అమెరికా రక్షణ శాఖ పత్రాలు కూడా వెల్లడయ్యాయి. అదే విధంగా 2006 నుంచి ఇప్పటి వరకు దాదాపు కోటి రహస్య పత్రాలను సేకరించి బహిర్గత పరచిన వికీలీక్స్ లక్షలాది అమెరికా రహస్య పత్రాలను వెల్లడించటంతో ప్రాచుర్యం పొందింది.వాటి గురించి అమెరికాలో ఇంకా విచారణ కొనసాగుతూనే ఉంది. ఆ సంస్థలో ప్రముఖుడైన జూలియన్ అసాంజేను పట్టుకొనేందుకు,జైల్లో పెట్టేందుకు వీలైతే మట్టుపెట్టేందుకు చూస్తూనే ఉంది.

ఇప్పుడు మరోసారి అలాంటి సంచలనం మరో విధంగా చెప్పాలంటే రాసిలో తక్కువైనా వాసిలో ఎక్కువ అన్నట్లుగా వెల్లడైన వందకు పైగా పత్రాలు అమెరికా, నాటో కూటమిని పెద్ద ఇరకాటంలో పెట్టాయనటం అతిశయోక్తి కాదు. రహస్యం, అతి రహస్యం అని దాచుకున్న రక్షణశాఖ ఫైళ్లు బయటకు వస్తున్నాయి. రానున్న రోజుల్లో ఇంకేం వెల్లడౌతాయోనని అమెరికా మల్లగుల్లాలు పడుతోంది. ప్రపంచంలో ఎక్కడేం జరిగినా పసిగట్టి చెబుతామని చెప్పుకొనే అమెరికా తాజాగా తన ఫైళ్లను వెల్లడి చేసింది ఎవరన్నది తేల్చుకోలేక గిలగిలా కొట్టుకుంటున్నది. ఎవరు వాటిని వెల్లడించిందీ తరువాత సంగతి, అసలు ఎంత అజాగ్రత్తగా ఫైళ్ల నిర్వహణ చేస్తున్నదో లోకానికి వెల్లడైంది. అమెరికన్లతో తామేమి మాట్లాడినా అవి వెల్లడికావటం తథ్యంగా ఉంది కనుక ఒళ్లు దగ్గర పెట్టుకొని వ్యవహరించాలనే ఆలోచన, జాగ్రత్తలకు ఇతర దేశాలకు చెందిన అనేక మందిని పురికొల్పింది. తమ గురించిఎలాంటి సమాచారం సేకరించిందో అదెక్కడ వెల్లడి అవుతుందో అన్న ఆందోళన అమెరికా మిత్రదేశాల్లో కూడా తలెత్తింది.

ఈ ఫైళ్లలో ఉన్న అంశాలు వికీలీక్స్, ఇతర వాటి మాదిరి గతంలో జరిగిన ఉదంతాలు, పరిణామాల సమాచారం కాదు. వర్తమానంలో జరుగుతున్న ఉక్రెయిన్ సంక్షోభం, దాని గురించి అమెరికా అంతర్గత అంచనా, ఆందోళనలతో పాటు ఒకే కంచం ఒకే మంచం అన్నట్లుగా ఉండే ఇజ్రాయెల్, దక్షిణ కొరియా, చివరికి తాను చెప్పినట్లు ఆడుతున్న ఉక్రెయిన్ నేత జెలెనెస్కీ మీద కూడా దొంగకన్నేసినట్లు తేలింది. ఉక్రెయిన్ దళాల వద్ద ఉన్న మందుగుండు, ఇతర ఆయుధాలు ఎప్పటివరకు సరిపోతాయి, మిలిటరీలో తలెత్తిన ఆందోళన, ఆ సంక్షోభంలో రోజువారీ అంశాల్లో అమెరికా ఎంతవరకు నిమగ్నమైంది, పెద్దగా బహిర్గతం గాని ఉపగ్రహాలద్వారా సమాచారాన్ని సేకరించే పద్ధతులతో సహా రష్యా గురించి ఎలా తెలుసుకుంటున్నదీ, మిత్ర దేశాల మీద ఎలా కన్నేసిందీ మొదలైన వివరాలున్న పత్రాలు ఇప్పటివరకు వెలికి వచ్చాయి. రష్యన్లు తమ కంప్యూటర్లలోకి చొరబడి(హాకింగ్) సమాచారాన్ని కొల్లగొట్టారని అమెరికా ఒక కథను ప్రచారంలోకి తెచ్చింది. ఆ పత్రాల్లో ఉన్న వివరాలను బట్టి ఆ కథ అంతగా అతకటం లేదని కొందరు చెప్పారు.దాంతో పత్రాల్లో కొంత వాస్తవం కొంత కల్పన ఉందని అమెరికా అధికారులు చెవులు కొరుకుతున్నారు. తాజాగా వెల్లడైన కొన్ని ఫైళ్లు కుర్రాళ్లు ఆటలాడుకొనే వెబ్‌సైట్లలో తొలుత దర్శనమిచ్చాయి.

ఒక కథనం ప్రకారం ఐదునెలల క్రితం అక్టోబరులో కంప్యూటర్‌గేమ్స్(ఆటలు) ఆడుకొనే ఒక డిస్కార్డ్ వేదిక (ఒక ఛానల్) మీద కొన్ని వివరాలు కనిపించాయి. మన దేశంలో ఇప్పుడు నరేంద్రమోడీ- అదానీ పాత్రలతో(గతంలో అమ్మా-నాన్న ఆట మాదిరి) కొంత మంది పిల్లలు ఆడుకుంటున్నట్లుగా ఉక్రెయిన్ సంక్షోభం మీద ఆడుకుంటున్న కుర్రకారులో ఒకడు తనది పై చేయి అని చూపుకొనేందుకు ఎలుగుబంటితో పంది పోరు అంటూ ఒక వీడియోను వర్ణిస్తూ కొన్ని పత్రాలను పెట్టటంతో కొంత మంది భలే సమాచారం అంటూ స్పందించారు. దాంతో ఆ లీకు వీరుడు మరిన్ని జతచేశాడు. ఆ గేమ్‌లో పాల్గొన్నవారు ఉక్రెయిన్ పోరు పేరుతో అప్పటికే నాటో కూటమి విడుదల చేసిన అనేక కల్పిత వీడియోలను కూడా పోటా పోటీగా తమ వాదనలకు మద్దతుగా చూపారు. అనేక మంది ఆ రహస్యపత్రాలు కూడా అలాంటి వాటిలో భాగమే అనుకొని తరువాత వదలివేశారు. ఐదు నెలల తరువాత మరొక ఆటగాడు తన వాదనలకు మద్దతు పొందేందుకు మరికొన్ని పత్రాలను జత చేశాడు. తరువాత అవి ప్రాచుర్యంలోకి వచ్చాయి. వాటిని రష్యన్ టెలిగ్రామ్ ఛానల్ ఎడిట్ చేసి పెట్టింది. దాన్ని బట్టి వాటిని రష్యన్లు సంపాదించి పెట్టారని భావించారు. అంతకు ముందు వాటిని చూసిన వారు ఉక్రెయిన్ పోరు గురించి ప్రచారం చేస్తున్న అనేక అవాస్తవాల్లో భాగం అనుకున్నారు తప్ప తీవ్రమైనవిగా పరిగణించలేదు. చీమ చిటుక్కుమన్నా పసిగడతామని చెప్పుకొనే అమెరికా నిఘా సంస్థలు వాటిని పసిగట్టలేకపోయినట్లా లేక, జనం ఎవరూ నమ్మరులే అని తెలిసి కూడా ఉపేక్షించారా, ఒక వేళ గేమర్స్ మీద చర్యలు తీసుకుంటే లేనిపోని రచ్చవుతుందని మూసిపెడతామని చూశారా అన్నది ప్రస్తుతానికి సమాధానం లేని ప్రశ్నలు. ఆలోచించేకొద్దీ గందరగోళంగా ఉంది.

వెల్లడైన వందకు పైగా పత్రాల్లోని అనేక అంశాలను ఖరారు చేసేందుకు ఇటీవలనే అమెరికా జాయింట్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ జనరల్ మార్క్ మిలే, ఇతర ఉన్నతాధికారులకు వాటిని సమర్పించారు. ఇంత త్వరగా అవి బహిర్గతం కావటం అమెరికన్లను ఆందోళనకు గురిచేస్తోంది. టాప్ సీక్రెట్లుగా పరిగణించే పత్రాలకు అంగీకారం, వాటిని పరిశీలించేందుకు అనుమతించే వారి సంఖ్య గురించి చెబుతూ 2019లో పన్నెండు లక్షల మందికి అవకాశం ఉన్నట్లు అమెరికా నేషనల్ ఇంటలిజెన్స్ డైరెక్టర్ కార్యాలయం ఇటీవలనే వెల్లడించింది. అందువలన వారిలో ఎవరైనా వాటిని వెల్లడించాలనుకుంటే ఆ పని చేయవచ్చు. అమెరికా ప్రభుత్వ విధానాలు నచ్చని ఎడ్వర్డ్ స్నోడెన్ ఒక కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నపుడు తనకు అందుబాటులోకి వచ్చిన అనేక అంశాలను బహిర్గతపరిచాడు. టెలికమ్యూనికేషన్ కంపెనీలతో చేతులు కలిపి అమెరికా జాతీయ భద్రతా సంస్థ, ఐదు కళ్ల పేరుతో అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్ గూఢచార సంస్థలతో కలసి జరుపుతున్న నిఘా బండారాన్ని వెల్లడించాడు. అమెరికా అధికారపక్షం డెమోక్రాట్లు, ప్రతిపక్షం(పార్లమెంటు దిగువసభలో మెజారిటీ పార్టీ) రిపబ్లికన్ల మధ్య ఉన్న విబేధాలు కూడా ఈ లీకుల వెనుక ఉండవచ్చన్నది

> పదేండ్ల నాటికి ఇప్పటికీ అమెరికాను ఎదుర్కోవటంలో చైనా, రష్యా సామర్థ్యం పెరిగింది. తాజా పత్రాలు అమెరికా ఎత్తుగడలను కూడా కొంత మేరకు వెల్లడించినందున వచ్చే రోజుల్లో వాటిని పక్కన పెట్టి కొత్త పథకాలు రూపొందించాలంటే నిపుణులకు సమయం పడుతుంది. మిగిలిన దేశాలకూ వ్యవధి దొరుకుతుంది. బలాబలాలను అంచనా వేసుకొనేందుకు వీలుకలుగుతుంది. ఇదొకటైతే అనేక దేశాలు అమెరికా, పశ్చిమ దేశాలతో సంబంధాల గురించి పునరాలోచించుకొనే పరిస్థితిని కూడా కల్పించింది.



మరొక కథనం. నాటోలోని పశ్చిమ దేశాలు కొన్ని అమెరికా వైఖరితో పూర్తిగా ఏకీభవించటం లేదు. అందువలన అవి కూడా దీని వెనుక ఉండే అవకాశం ఉంది. ఉక్రెయిన్ పోరులో పుతిన్ సేనలను ఓడించటం అంత తేలిక కాదని భావిస్తున్న అమెరికా కొంత మంది విధాన నిర్ణేతలు వివాదానికి ముగింపు పలికేందుకు ఈ లీక్ దోహదం చేస్తుందని భావించి ఆ పని చేసి ఉండవచ్చని కూడా చెబుతున్నారు. రష్యా గనుక వీటిని సంపాదించి ఉంటే దానిలో ఉన్న అంశాలను తనకు అనుకూలంగా మలచుకొనేందుకు చూస్తుంది తప్ప బహిరంగపరచదు అన్నది ఒక అభిప్రాయం. కష్టపడి సంపాదించిందాన్ని బహిర్గతం చేస్తే శత్రువు ఎత్తుగడలు మారిపోతాయి.

ఉక్రెయిన్ సంక్షోభాన్ని చర్చల ద్వారా పరిష్కరించేందుకు అమెరికా సుముఖంగా లేదని, అతి పెద్ద ఆటంకం అన్నది ఈ పత్రాల్లో తేటతెల్లమైంది. కీలకమైన గగనతల రక్షణ వ్యవస్థల కొరత, బకుమట్ పట్టణాన్ని పట్టుకోవటంలో పుతిన్ సేనల విజయం వంటి అనేక అంశాలు ఆ పత్రాల్లో ఉన్నాయి. ఈ పత్రాల్లోని సమాచారం కట్టుకథలైనా అది ప్రచారంలోకి తేవటం మానసికంగా ఉక్రెయిన్‌ను దెబ్బతీసేదిగా ఉంది. ఉద్రిక్తతలు పెరిగి మిలిటరీ రంగంలోకి దిగితే డాన్‌బోస్ ప్రాంతాన్ని పుతిన్ సేనలు అదుపులోకి తీసుకుంటాయని అమెరికాకు ముందుగానే తెలుసునని కూడా వెల్లడైంది. ఇప్పటివరకు ఉక్రెయిన్ పోరులో రెండు లక్షల మంది రష్యన్ సేనలు మరణించినట్లు సిఐఎ, అమెరికా, నాటో కూటమి దేశాలన్నీ ఊదరగొట్టాయి. ఈ పత్రాల ప్రకారం పదహారు నుంచి 17,500 మధ్య మరణించి ఉండవచ్చని పేర్కొన్నారు. అదే విధంగా ఎస్-300 గగనతల రక్షణ వ్యవస్థ క్షిపణులు మే రెండవ తేదీ వరకే సరిపోతాయని పేర్కొన్నారు. ఇవన్నీ ఉక్రెయిన్ మిలిటరీ, దానికి మద్దతు ఇస్తున్న తూర్పు ఐరోపా, ఇతర దేశాల నమ్మకాలను దెబ్బతీసేవే. మిత్రదేశాల కంటే తొత్తు దేశాలుగా పేరు మోసిన ఇజ్రాయెల్, దక్షిణ కొరియాల మీద కూడా అమెరికా దొంగ కన్నేసినట్లు దాని రాయబారులు పంపిన నివేదికలు వెల్లడిస్తున్నాయి. న్యాయవ్యవస్థలో నెతన్యాహు ప్రభుత్వం తలపెట్టిన సంస్కరణలను వ్యతిరేకించాల్సిందిగా జనాన్ని అక్కడి గూఢచార సంస్థ మొసాద్ రెచ్చగొట్టినట్లుగా అమెరికా పత్రాల్లో ఉంది. అదే విధంగా మరొక దేశానికి వ్యతిరేకంగా ఇంకాకరికి ఆయుధాల సరఫరా తమ విధానాలకు వ్యతిరేకం అని చెబుతున్నా ఉక్రెయిన్‌కు మూడులక్షల 30వేల ఫిరంగి మందుగుండు సరఫరా చేయాలని దక్షిణ కొరియాను అమెరికా ఒత్తిడి చేసింది. ఫలానా తేదీలోగా జరగాలని కూడా ఆదేశించింది. ఇదంతా కేవలం నలభై రోజుల క్రితం జరిగింది. ఇది దక్షిణ కొరియాను ఇరుకున పెడుతుంది. పక్కనే ఉన్న రష్యా ఈ పరిణామాన్ని తేలికగా తీసుకోదని అక్కడి పాలక పార్టీ భావిస్తున్నది.

గతంలో స్నోడెన్, మానింగ్, వికీలీక్స్ వెల్లడించిన పత్రాలలో ఉన్న సమాచారం ఎక్కువ భాగం పాతదే కానీ అమెరికా దుష్ట పన్నాగాలను లోకానికి వెల్లడించింది. తాజా సమాచారం వర్తమాన అంశాలది కావటం అమెరికాకు ఆందోళన కలిగిస్తోంది. పదేండ్ల నాటికి ఇప్పటికీ అమెరికాను ఎదుర్కోవటంలో చైనా, రష్యా సామర్థ్యం పెరిగింది. తాజా పత్రాలు అమెరికా ఎత్తుగడలను కూడా కొంత మేరకు వెల్లడించినందున వచ్చే రోజుల్లో వాటిని పక్కన పెట్టి కొత్త పథకాలు రూపొందించాలంటే నిపుణులకు సమయం పడుతుంది. మిగిలిన దేశాలకూ వ్యవధి దొరుకుతుంది. బలాబలాలను అంచనా వేసుకొనేందుకు వీలుకలుగుతుంది. ఇదొకటైతే అనేక దేశాలు అమెరికా, పశ్చిమ దేశాలతో సంబంధాల గురించి పునరాలోచించుకొనే పరిస్థితిని కూడా కల్పించింది. తమ గురించి, తమ అంతర్గత వ్యవహారాల్లో ఎలాంటి జోక్యం చేసుకుంటున్నదో అనే అనుమానాలు తలెత్తుతాయి. ఉక్రెయిన్, జెలెనెస్కీ ఏమైనా అమెరికాను ఎక్కువగా ఆందోళన పరుస్తున్నదీ ఈ అంశాలే అని చెప్పవచ్చు. ఇంకెన్ని పత్రాలు బహిర్గతం అవుతాయో చూడాల్సి ఉంది.

సెల్:8331013288



## గైర్హాజరు!

మిత్రో!
ప్రతి గైర్హాజరూ
ఒక సత్యాగ్రహం వంటిదే!

వాగ్దాలన్నీ శుష్క వాగ్దానాలైనప్పుడు
కుర్చీ వేసినా మడత మంచమేసినా
పక్కాగా గైర్హాజరే!

ఈ మట్టిది ఆది నుంచీ
వివక్ష ఏ రూపంలో ఉన్నా
ఎదురు నిల్చి పోరాడే తత్వమే!

బలాన్నో బలగాన్నో చూసి
జడిసే స్వభావం
తెగింపున్న తెలంగాణకు లేదు!

దేశమంతా మోకరిల్లుతున్నా
పిడికిలెత్తుతుంది ఇక్కడే
కుట్రలు భగ్నం చేస్తుందిక్కడే!

విడగొట్టు పడగొట్టు
ఎప్పటికైనా అది వితండ వాదమే
నిర్మించు నిలబెట్టు సకల జన సమ్మతమే!

యుద్ధ మేఘాలు కమ్ముకొస్తుంటే
బెదిరింపుల ఉరుముల
మెరుపులు సహజమే
ఎలుగెత్తిన స్వరం ఎప్పటికీ ఒంటరి కాదు!


ఆచరించే మార్గం సరియైనదైతే
అనుసరించే పాదాలు
కాశీ నుండి కన్యాకుమారి వరకు!

అపాత్ర మిత్ర వాత్సల్యమూ
ఎనిమిదో వ్యసనమే
ఇద్దరిలో ఎవరి చేతులు
కాలినా బద్ధ శతత్వమే!

అమ్మకాలు తెలిసి వారిని నమ్మడం
ఒక చేదు అనభవమే
రాబోయే ఫలితాలు విజ్ఞతకు సంకేతాలే!!

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి
9440233261.

# హష్మి 'రాజకీయ రంగస్థలం'



కె శాంతారావు
9959745723

ప్రజా జీవితాలకు - రాజకీయాలకు మౌలిక సంబంధం ఉన్నదనే విషయం చాలా సందర్భాల్లో విస్మరణకు గురవుతుంది. ముఖ్యంగా కళారంగంలో...

'నాటు నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు వచ్చిందని పొంగిపోవడం లేదని సంగీతదర్శకులు కీరవాణి అంటే, 'అద్భుతం లాంటి నిజం' అని రచయిత చంద్రబోస్ సంబరపడిపోయారు. 'బలంగం', రంగమార్తాండ' వంటి చిత్రాల్లో భావద్వేగాలే ప్రధాన భూమిక పోషించాయనే విషయం తెలిసిందే. అయితే వాటి ప్రాధాన్యతను తక్కువ చేయడంలేదు. కానీ అదే సందర్భంలో భావోద్వేగాలకు - జీవితంలోని సుఖదుఃఖాలకు తెరవెనుక నడిచే రాజకీయాలే కారణభూతమనే విషయాన్ని కాదనలేం. అందుకే లెనిన్ మహాశయుడు అంటాడు... మీరు రాజకీయాల్లో జోక్యం చేసుకోకపోతే రాజకీయాలే మీ జీవితాల్లో చివరకు జోక్యం చేసుకుంటాయని.

రాజకీయాలను - కళారంగాన్ని తన జీవితకాలం పర్యంతం అనుసంధానించిన వాడు కామ్రేడ్ సఫ్దర్ హష్మి. 1954 ఏప్రిల్ 12వ తేదీన జన్మించిన హష్మి, 1989 జనవరి 1న ఢిల్లీకి సమీపాన ఘజియాబాద్ కార్మికవాడల్లో 'హల్లాబోల్' నాటిక ప్రదర్శిస్తుండగా కాంగ్రెస్ కిరాయి గూండాల చేతిలో అమానుషంగా హత్యగావించబడిన విషయం విదితమే. స్వానుభవంతో తాను రూపొందించిన ఆధునిక వీధినాటిక ప్రక్రియను ఆ విధంగా పోరాటాయుధంగా మలచి పీడిత ప్రజలకు అందించాడు. సమకాలీన ప్రజా కళాకారులకు అలా తిరుగులేని మార్గదర్శకుడయ్యాడు.

అక్రమాలు, దోపిడీ, అణచివేత తీవ్రమవుతున్న కొద్దీ ప్రజా ఉద్యమాలు పెల్లుబుకుతూనే ఉంటాయి. ఈ పెల్లుబికే ప్రజా ఉద్యమాల్లో రంగస్థలాన్ని (థియేటర్‌ను) చైతన్యవంతంగా మమేకం చేయడం, అదీ ఓ రాజకీయ కర్తవ్యంగా గుర్తెరిగి దీక్షగా చేయడం సాధారణమైన పనికాదు, ప్రాపంచిక దృక్పథం, కళానైపుణ్యం, స్థానిక ప్రజల సాంస్కృతిక స్థాయి, అన్నింటిని గమనంలోకి తీసుకుని సందర్భోచిత చాకచక్యంతో పనిచేసినప్పుడు మాత్రమే వీధినాటికను శక్తివంతంగా ఉద్యమాల్లో మమేకం చేయగలం. ఇది కత్తిమీద సాములాంటి కష్టసాధ్యమైన పని అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.

హష్మి వీటన్నిటా నిర్మాణాత్మకంగా కృషి చేశాడు గనుకనే అందరికంటే ఓ మెట్టు పైస్థాయిలో ఉన్నాడు. కళకు తప్పనిసరిగా ఓ సామాజిక ప్రయోజనం ఉన్నదని నమ్ముతూ, వీధుల్లో ప్రదర్శించే ప్రతికళను (రంగస్థలంను) ప్రజా కళగా హష్మి భావించేవాడు.

ఎక్కడబడితే అక్కడ, ఎలా బడితే అలా, అలరించే కళలు పుంఖాను పుంఖాలుగా ఉంటాయి. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూనే ఉంటాయి. కానీ వీటిల్లో ఆలోజింపచేసేవి ఎన్ని? కదిలించేవి ఎన్ని? ప్రజలను ఉద్యమబాటన నడిపించేవి ఎన్ని? ఉరకలతో పరుగులెత్తించేవి ఎన్ని? ఇవన్నీ ప్రజా కళాకారులు ఎప్పటికప్పుడు ప్రశ్నించుకోవాల్సిందే. నిత్యవిద్యార్థిలా తమని తాము సరిదిద్దుకోవాల్సిందే.

ఒక పక్క నిరంతరం మారుతున్న రాజకీయాలను అధ్యయనం చేయాలి. మరో పక్క కళారంగంలో వస్తున్న నూతన పోకడల్లో సానుకూలమైన వాటిని అధ్యయనం చేయాలి. ప్రజాకళాకారులు ఈ జోడుగుర్రాల స్వారీ అధ్యయనాన్ని ఆపకుండా నిత్యం కొనసాగించాలని హష్మి నొక్కి చెబుతాడు. ఒకటి ముందుకు పోతే రాజకీయవాదిగాను, మరొకటి ముందుకుపోతే కేవలం కళాకారునిగాను మిగిలిపోయే అవకాశం ఉన్నదని హెచ్చరిస్తాడు. రాజకీయ చైతన్యాన్ని అత్యున్నత చైతన్యంగా హష్మి భావిస్తాడు. తమను ఎవరు ఎలా పాలిస్తున్నారో కచ్చితంగా ప్రజలు తెలుసుకోవాలి. అక్రమాలని ప్రశ్నించాలి. హక్కుల్ని సాధించుకోవాలి. అదీ సమిష్టి ఉద్యమాల ద్వారా, సమరశీల పోరాటాలు ద్వారా. మనప్రజాస్వామ్య జీవన గమనంలోనే ఈ చారిత్రక సత్యం ఇమిడి ఉన్నది. దీనిని విస్మరిస్తే ఎలా..? ప్రజా రాజకీయాలు అంటే ఇవిగాక మరేమిటి?' అని అడుగుతాడు.

'వీధి నాటిక ప్రక్రియ' ఒక వార్తా పత్రికను దృశ్యమాన రూపంలో నడిపించడం వంటిది. సమకాలీన అంశాలమీద, రోజువారీ పరిణామాల మీద, వార్తా పత్రికలకు ఏది మంచి? ఏది చెడు? అన్న వివేచన కలిగించేలా వార్తలు ఇస్తాయో... వీధినాటిక దృశ్యమానరూపంలో ఆపని చేయగలగాలి. వీధినాటికను కేవలం ప్రచారాందోళన సాధనంగా పరిమిత దృష్టితో చూడకూడదు. సాంస్కృతికంగా వెనుకబడి ఉన్న కార్మికులకు కష్టజీవులకు ఆ భర్తీ చేయగల సాధనంగా వీధినాటిక ప్రక్రియను మలచాలి' అని దిశానిర్దేశం చేశాడు హష్మి. అంటే ఆధునిక వీధినాటిక సిద్ధాంత రూపకర్త హష్మీ అని చెప్పక తప్పదు.

1978లో ఆనాటి కార్మికవర్గం సమస్యలపై 'మిషన్' వీధినాటికను తన జనమ్ బృందంచే ప్రదర్శింపజేసాడు హష్మి. అనూహ్య ఆదరణ లభించింది. ఏమిటిది? ఎందుకిలా సాధ్యపడింది? బృందంలోని ప్రతి ఒక్కరిలో అదే మధనం. ఏ హంగులూ లేవు. ఆహార్యం, తెరల ఆర్భాటాలు కానరావు, పట్టపగలు నడిరోడ్డుపై ప్రదర్శన. అప్పుడు అర్థమయింది... విషయం వారిదైతే (ప్రేక్షకులదైతే) ఓ ప్రధాన సమస్యను వారు ఎదుర్కొంటుంటే, దానినే ఇతివృత్తంగా తీసుకుంటే చాలా తేలికగా ఆ కళారూపానికి ఆ ప్రజానీకం ఆకర్షితమవుతుందని. వారి ప్రత్యక్ష అనుభవంలోకి వచ్చింది. 'ఈ ప్రాతిపదికపైనే వీధినాటిక స్వభావాన్ని మనం పసిగట్టాలి. అవసరమైన కొత్త వ్యాకరణం (గ్రామర్) కనిపెట్టాలి' అనే నిర్ణయానికి హష్మి రావడం, ముసాయిదాను రూపొందించి ప్రతిపాదించడం అన్ని వెన్వెంటనే జరిగిపోయాయి. ఈ వీధినాటిక సిద్ధాంత పత్రం చిన్నదే గావచ్చు. కానీ అది భావోద్వేగ పరంగానే కాదు హేతుబద్ధంగా కూడా ఉంటుందని హష్మి సహచరుడు సుధన్వాదేశ్ పాండే తను రచించిన 'హల్లాబోల్' గ్రంథంలో పేర్కొంటాడు.

హష్మి నాటకాలు 'హల్లా బోల్', 'చక్కాజామ్', 'ఔరత్', 'గావ్ సే షెహర్ తక్', 'మత్ బాటో ఇన్‌సాన్ కో' మొదలైనవన్నీ ఇదే వ్యాకరణంతో కష్టజీవుల ఇతివృత్తాలతో సాగుతాయి. పాలకుల రాజకీయ విధానాల కారణాన ఆ జీవితాలు ఎలా ఆటుపోట్లకు లోనవుతున్నాయో తెలుపుతూ, సంఘటితంగా పోరాడి సమస్యను పరిష్కరించుకోవాల్సిన సత్యాన్ని చాటుతాయి.

అయితే ఈ చెప్పే పద్ధతి కేవలం నినాదప్రాయంగా ఉంటే ఆ కళారూపం ఆందోళనారూపంగానే ఆగిపోతుంది. కళాత్మకంగా చెప్పగలిగినప్పుడు మాత్రమే అది ప్రజల్ని కదిలించగలదు. ప్రజల హృదయాలను హత్తుకుని కదిలించేలా రసాత్మకంగా చెప్పగలిగామా లేదా అన్నది ప్రజాకళాకారులకు ఎప్పుడూ పరీక్షే.

ఇక్కడే కళాకారుల ప్రతిభ, కౌశల్యం, నైపుణ్యం తప్పనిసరి. ఇది సాధన ద్వారానే వస్తుందని హష్మికి స్పష్టంగా తెలుసుగనుకనే నిత్యం రాజకీయ అవగాహనతో కూడిన కళాకారుల వర్క్‌షాపుల్లో, శిక్షణా శిబిరాల్లో ఓ బోధకుడిగా మునిగితేలేవాడు. అందుకే హష్మి వీధినాటిక ప్రక్రియ రాజకీయ రంగస్థలంగా (పొలిటికల్ థియేటర్) గణతికెక్కింది. ప్రజా కళాకారులకు ఇది శిరోధార్యం.


# సాంస్కృతిక సేనాని... కార్మిక పోరాట వారధి



గీట్ల ముకుందరెడ్డి
9490098857

దేశ రాజధాని నుదుట చెరగని నెత్తుటితిలకం హష్మి! భావిస్వర బాస్వరాన్ని మండించే సూర్యరశ్మి హష్మి!! వీధినాటికలతో పాలకుల వైఫల్యాల్ని ఎలుగెత్తిచాటిన కళాకారుడు హష్మి. ప్రజాకళలకే జీవితం అంకితం చేసిన నాయకుడు హష్మీ. చివరకు ఆ కళాప్రాంగణంలోనే ప్రభుత్వ కిరాయిగుండాల చేతిలో హత్యకు గురైన చిరస్మరణీ యుడు.

ఆయన గురించి తెలుసుకునే ముందు ఒక్కమాట. పీవీ నరసింహారావు హయాంలో ప్రారంభించబడిన నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాలకు వ్యతిరేకంగా వామపక్ష కార్మిక సంఘాలు నిర్వహించిన మొదటి సార్వత్రిక సమ్మె సందర్భంగా నిర్వహించిన "అప్పొ-అమ్మకమా" వీధి నాటకం తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రదర్శనలు ఇవ్వ బడింది. అందులో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సింగరేణి ప్రాంతంలో ఇచ్చిన ప్రదర్శనల్లో ప్రజానాట్యమండలి కళాకారులు సఫ్దర్ హష్మిని స్మరించు కుంటూ పాడే గీతంలోని చరణం, ఆనాటికలో నటులుగా ఉన్న నాకు, ఉద్యమ సహచరుడైన ముత్యంరావు లాంటి వాళ్లకు హష్మీ గురించి అంతగా తెలియదు. కానీ ఆయన రూపొందించిన వీధి నాటికలతో ప్రభుత్వాలను



ఉక్కిరిబిక్కిరి చేసేవి. ఆయనొక వీధి నాటిక అధునిక రూపకర్త. ప్రజల్లో చైతన్యం నింపిన ఉద్యమకర్త.

హష్మి 1954 ఏప్రిల్ 12న హనీఫ్- క్వామర్ ఆజాద్ హష్మిలకు ఢిల్లీలో జన్మించారు. అక్కడే తన పాఠశాల విద్యను పూర్తి చేశాడు. సెయింట్ స్టీఫెన్స్ కళాశాల నుండి ఆంగ్ల సాహిత్యంలో పట్టభద్రుడయ్యాడు. ఢిల్లీ విశ్వ విద్యా లయం నుండి ఆంగ్లంలో ఎం.ఎ. పూర్తి చేశారు. ఆ సమయంలో హష్మీ ఎస్ఎఫ్ఐ సాంస్కృతిక విభాగంతో సంబంధం ఏర్పరచుకున్నారు. 1977 బీహార్లో దళిత వ్యవసాయ కూలీలను కాల్చిచంపిన భయంకరమైన సంఘటన ఆధారంగా ఈ సంఘం మొదటి వీధి నాటకం "బెల్చి" మొదటి ప్రదర్శన 1978లో జరిగింది. మొత్తం 2500 ప్రదర్శనలు జరిగాయి. 1978లో మెషిన్ వీధి నాటికతో పెద్ద ఎత్తున ప్రజల్లోకి వెళ్లారు. 20 నవంబర్ 1978న రెండు లక్షల మంది కార్మికులతో కూడిన ట్రేడ్ యూనియన్ సమావేశంలో ప్రదర్శించ బడింది. బెల్చి, ది మెషిన్ మధ్య అద్భుతమైన సారూప్యతలు ఉన్నాయి. రెండు నాటకాలు ఒకే సంవత్సరంలో నిర్మించబడ్డాయి. రెండూ వాస్తవ హత్యలపై ఆధారపడి ఉన్నాయి. మిషన్ పారిశ్రామిక శ్రామికవర్గం, బెల్చి గ్రామీణ శ్రామికవర్గం రెండూ నాటక పరంగా కొత్త శైలి నాట కాలు. ఎమర్జెన్సీ స్పందన రెండింటిలోనూ వినిపించింది. రెండూ త్వరగా అనువదించబడ్డాయి. దేశవ్యాప్తంగా ఆడబడ్డాయి. బెల్చి సాహిత్యం సి.జి. కృష్ణస్వామి రాశారు. దళిత కవి సిద్ధలింగయ్య పాటలు రాశారు. మురికివాడల్లో పెద్ద ఎత్తున ప్రదర్శించారు. దాని నటీనటులు కూడా మురికివాడల నుండి తీసుకోబడ్డారు. 1977లో ఎమర్జెన్సీ ముగిసిన తర్వాత చిన్న రైతుల కష్టాలు (గావ్ సే షహర్ తక్), మతాధికారుల ఫాసిజం (హత్యారే, అపరాన్ భైచారే కే), నిరు ద్యోగం (టీన్ కోటి), మహిళలపై హింస (ఔరత్), ద్రవ్యోల్బణం (డిటిసి కి దంధ్లీ)పై నాటకాలు ప్రదర్శించబడ్డాయి. హష్మీ దూరదర్శన్ కోసం అనేక డాక్యుమెంటరీలు, టీవీ సీరియల్ని నిర్మించారు, ఇందులో ఖిల్తి కలియన్ (పూలు మొగ్గలు) గ్రామీణ సాధికారతను పరిశీలించారు. అతను పిల్లల కోసం పుస్తకాలు కూడా రాశారు. భారత ప్రధాని ఇందిరాగాంధీ ఎన్నికలలో రిగ్గింగ్ చేశారని ఆరోపించ బడినప్పుడు "కుర్చీ, కుర్చీ, కుర్చీ" అనే వీధి నాటకాన్ని నిర్మిం చారు. రాజకీయ కార్యకలాపాల కేంద్రంగా ఉన్న న్యూ ఢిల్లీలోని బోట్ క్లబ్ లాన్స్లో ఈ నాటకం వారం రోజుల పాటు ప్రతిరోజు ప్రదర్శించబడింది. ఇది జన నాట్య మంచ్ (జెఎన్‌ఎమ్)కు కీలక మలుపు.

80వ దశకం చివరలో ఢిల్లీ చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మిక ఆందోళనలు, సమ్మెలు పెద్దఎత్తున జరిగాయి. 1941లో ఢిల్లీ జనాభా కేవలం 9లక్షలకు పైగా ఉండేది. అది తర్వాత యాభై ఏండ్లలో పది రెట్లు పెరిగి 1991లో 94లక్షలకు చేరుకుంది. ఈ యాభై ఏండ్లలో, విభజన సమయంలో అత్యధిక సంఖ్యలో ప్రజలు ఢిల్లీ వైపు వచ్చారు. తరువాత సంవత్సరాలలో ఎక్కువ మంది గ్రామీణ వలస కూలీలు చేరారు. క్రమంగా ఢిల్లీ పారిశ్రామిక అభివృద్ధి జరిగింది. 1988 నవంబర్ 22 నుండి 28 వరకు ఘజియాబాద్, ఫరీదాబాద్ పారిశ్రామిక ప్రాంతంలో 13లక్షల మంది కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు చారిత్రాత్మకమైన ఏడురోజుల సమ్మె చేశారు. సమ్మె జయప్రదానికి జన నాట్య మంచ్ నిర్వహించిన "చక్కా జామ్/ హల్లా బోల్" వీధి నాటిక అత్యంత ప్రభావం చూపింది. రచన కార్మికల గుండెను తట్టి లేపింది. నవంబర్ 2 నుండి నవంబర్ 21 వరకు 16 రోజులలో సమ్మె జయప్రదం కోసం 27ప్రదర్శనలు జరిగాయి. ఈ ప్రదర్శనలు కార్మిక నివాసాలు, పారిశ్రామిక ప్రాంతాలలో నిర్వహించారు. 18వేల నుంచి 19వేల మంది కార్మికులు పాల్గొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె జయప్రదం కోసం 6లక్షల 80 వేల కరపత్రాలు, 40 వేల పోస్టర్లు, వెయ్యికి పైగా వీధి సమావేశాలు నిర్వహించబడ్డాయి. కార్మికుల నివాసాలలో ప్రతీ మూలకు ప్రచారం చేరుకుంది. 1989 జనవరి 1న ఘజియాబాద్ జండాపూర్లో "హల్లా బోల్" వీధినాటిక ప్రదర్శిస్తున్నప్పుడు అక్కడి ఇండస్ట్రియల్ ఏరియా పారిశ్రామిక వేత్తల తొత్తులు, కాంగ్రెస్ గుండాలు దాడిచేశారు. జనవరి 2న రామ్‌మనోహర్ లోహియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయారు. సఫ్దర్ హష్మి జీవిత భాగస్వామి, సహనటి అయినా కామ్రేడ్ మలాయశ్రీ జనవరి 4న ఎక్కడైతే సఫ్దర్ హష్మీ, తోటి కళాకారులపై దాడి జరిగి, హల్లా బోల్ వీధి నాటిక నిలిపివేయబడిందో అదే స్థలంలో మిగిలిపోయిన నాటిక భాగాన్ని ప్రదర్శించి యజమానులకు వారి గుండాలకు సవాల్ విసిరారు. కార్మికవర్గానికి మనోధైర్యం కల్పించారు. దేశంలో హష్మీ చేసిన పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణలోనూ ఉద్యమించడం కార్మికవర్గం ముందున్న ఏకైక మార్గం.






**కుటుంబం, ఉద్యోగ బాధ్యతల్లో ఎంత ఒత్తిడి ఉన్నా రాయడం ఆమెకు ఓ ఇష్టమైన వ్యాపకం. చదవడం అనే అలవాటును వ్యసనంగా మార్చుకొని రాయడం పట్ల మక్కువ పెంచుకున్నారు. రాసే ప్రతి అక్షరానికి ఓ ప్రయోజనం ఉండాలని బలంగా కోరుకునే వ్యక్తిత్వం. పైకి ప్రవహించే గోదావరిలా ఎంతో ప్రశాంతంగా కనిపించినా... గుండె నలిగిపోయిన ప్రతి సారి సముద్రం పోటెత్తినట్టు... అక్షరం ఆమెలో ఉప్పొంగుతుంది. అప్పుడు తెల్లని కాగితాలు నల్ల రంగు పులుముకుంటాయి. తెలంగాణ ప్రజల బతుకులు కథలుగా మన ముందు వాలిపోతాయి. ఆమే రచయిత్రి కోట్ల వనజాత. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా పౌరసరఫరాల అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆమె పరిచయం నేటి మానవిలో...**

# రాసే ప్రతి అక్షరానికి ఓ ప్రయోజనం వుండాలి

**బాల్యం పెరిగిన వాతావరణం?**

నల్గొండ జిల్లా, నిడమనూరు మండలం, తుమ్మడం గ్రామం. నాన్న రంగారెడ్డి, అమ్మ లక్ష్మమ్మ. నేను పుట్టింది వ్యవసాయ కుటుంబంలో. అది కూడా పంటలు పండినప్పుడు మధ్య తరగతి, పండనప్పుడు దిగువ మధ్య తరగతి. అలా ఎగుడు దిగుడు ఆర్థిక వ్యవస్థలో పుట్టాను. నలుగురం అక్కచెల్లెళ్ళలో నాకు మాత్రమే చదువుకునే అవకాశం దక్కింది. మా చిన్నమ్మ ఇంట్లో వుండి చదువుకోవడం నాకు దక్కిన సదవకాశం. స్కూలూ కాలేజీ చదువులు దాదాపుగా సూర్యాపేటలోనే సాగింది. ఆ తర్వాత దూర విద్య ద్వారా పి.జి(తెలుగు ఎం.ఎ), పి.జి డిప్లొమా ఇన్ కజ్యూమర్ ఎవేర్‌నెస్ చదివాను. చిన్నప్పటి నుండి ప్రత్యేకంగా సాహిత్యం ఇదంటూ చదవకపోయినా కథల పుస్తకాలూ, వార పత్రికలూ అందుబాటులో వున్న నవలలూ చదివేదాన్ని. చదవడం అనే అలవాటు క్రమంగా వ్యసనంగా మారింది. అభిరుచికి తగినట్టు ఎం.ఎ తెలుగు చదవడం అదనంగా ఆనందాన్చిన విషయం.




**సాహిత్యంతో మీ పరిచయం..?**

చిన్నప్పటి నుండే కథలూ, వారపత్రికలు, దినపత్రికలు చదవడమే సాహిత్యంతో పరిచయానికి తొలి అడుగు. ఎవరైనా అంగీకరించినా అంగీకరించకపోయినా నాకు నచ్చే సాహిత్యం ఎక్కువగా దిన పత్రికల్లో చదివిందే. ఈ రోజుకు కూడా దినపత్రిక గంటసేపు చదువుతాను. వార్తలూ, ఆర్టికల్స్, కాలమ్స్, వ్యాసాలూ, ఉత్తరాలు పెద్ద సాహిత్య సమ్మేళనం కదా దినపత్రికలు. అందుకే దిన పత్రికలు పెద్ద సాహిత్య వారధులు. వార పత్రికల్లో సీరియల్స్ చదవడం, అద్దెకు నవలలు తెచ్చుకొని చదవడం నిజంగా మధురమైన జ్ఞాపకాలు. పూర్తి స్థాయిలో స్వేచ్ఛగా సాహిత్యం చదువుతున్నది మాత్రం గత ఇరవై ఏళ్ళుగా దాదాపుగా ప్రతిరోజూ చదువుతూనే ఉంటాను.

**రాయడానికి స్ఫూర్తి ఏమిటి..?**

రాయడానికి స్ఫూర్తి ప్రత్యక్షంగా కొందరుంటే, పరోక్షంగా మరికొందరున్నారు. ఎనభైల్లో వచ్చిన సాహిత్యంలో మెజారిటీ నవలలది. ఆ నవలలు ఎక్కువగా ఎగువ మధ్య తరగతి కాస్త ఉన్నతంగా చదువుకున్న వారి జీవితాలని ప్రతిభించించేవి. సైన్స్, ఫిక్షన్, ఊహాత్మక సాహిత్యం ఎక్కువగా వచ్చిన కాలంలో నిజంగా మనకన్నా నాలుగు మెట్లు ఆర్థికంగా, ఉన్నతులు విద్యావంతులు మాత్రమే రాస్తారనే అభిప్రాయముండేది. నిజానికి నామిని సుబ్రమణ్యం నాయుడు ఆ భయాన్ని పోగొట్టారని చెప్పాలి. 'నీ జీవితమే ఒక కథ, నీ అనుభవమే అక్షరాల్లో పెడితే సాహిత్యం' అనే ధైర్యాన్ని నాలాంటి చదువరులకు ఇచ్చారనిపిస్తుంది. ఉద్యోగంలో చేరిన తర్వాత కొంత పాతతరం రచయితలను అధ్యయనం చేయడం ద్వారా ఏమి రాయాలనే స్పష్టత వచ్చింది. అవి సురవరం ప్రతాపరెడ్డి కథలే.

**ఇప్పటి వరకు మీరు చేసిన రచనలు..?**

మలిదశ తెలంగాణ ఉద్యమం ఊపందుకున్న ఈ శతాబ్దపు తొలి రోజుల్లోనే ముఖ్యంగా తెలంగాణ భాషకు ప్రాధాన్యమిస్తూ కథలు రాయాలనుకొని నిర్ణయించుకుని తెలంగాణా భాషనూ ఇక్కడి సమస్యలను, తెలంగాణ జీవన విధానాన్ని ముప్పేటగా కథలు రాయాలనుకుని అందులో కొంత సఫలీకృతమవుతూ వచ్చాను. అలా రాసిన మొదటి పన్నెండు కథలను 2014లో 'ఇత్తు' పేరుతో కథా సంకలనం తీసుకొని వచ్చాను. ఆ తర్వాత వివిధ పోటీల్లో గెలుపొందిన కథలతో 'మైదాకు వసంతం' కథా సంపుటిని 2022 తీసుకొచ్చాను. అదే విధంగా భూ సమస్యలూ, మైనింగ్, గ్రామీణ రాజకీయాలు ప్రధానాంశంగా 'ఊరుగాని ఊరు' నవల రాశాను. ఆ నవల 'శ్రీ అంపశయ్య నవీన్' తొలి నవలా పురస్కారం 2022 సంవత్సరానికి గెల్చుకున్నది. త్వరలో మరో కథా సంపుటికి సిద్ధమవుతున్నాను.



**ఓ మహిళగా ఏమైనా సమస్యలు ఎదుర్కొన్నారా..?**

ఆడపిల్ల, యువతి, మహిళ... వివక్ష సార్వజనీనం. పొద్దు పొడిచే ప్రతిచోటా వివక్షకు తావుంది. ఈ దేశం - ఆ దేశం, ఈ ఊరు - ఆ ఊరు, ఆ తెగ - ఈ తెగ, ఈ జాతి - ఆ జాతి అని లేదు. ప్రతి చోటా వివక్షే. మహిళను తోటి మనిషిగా చూడకుండా అవసరాలకు పనికొచ్చే మనిషిగా చూడటం వల్ల ఇంటా బయటా సమస్యలు తప్పవు. అందుకే మహిళాదినోత్సవమంటూ, అమ్మల దినోత్సవాలనుకుంటూ ఎవరూ నెత్తిన పెట్టుకోవాల్సిన పనిలేదు. తోటి మనిషి దినోత్సవం జరుపుకుంటే బాగుంటుందని నా అభిప్రాయం.

**సమాజంపై సాహిత్యం ఎలాంటి ప్రభావం చూపిస్తుందనుకుంటున్నారు?**

సమాజంపై కొద్దోగొప్పో ప్రభావం చూపించే సాహిత్య ప్రక్రియల్లో మొదటిది పాట. ఆ తర్వాత స్థానం నాటకానిది. అలాగే సినిమా కూడా. ఆ తర్వాతే కవిత్వం కథా, నవలా ఇత్యాదులు. అయితే సాహిత్యం దగ్గరకు వచ్చే సరికి దాన్ని చదివి ప్రభావితమయ్యే వాళ్ళకే పరిమితం. అక్షరజ్ఞానం నిర్బంధం, కాని మనలాంటి దేశాల్లో ఇంట్లో ఒక్క పుస్తకమైనా లేకుండా జీవితాలు గడిచిపోతుంటాయి. అలాంటప్పుడు పుస్తక సాహిత్య ప్రభావం అందరి మీదా ఉంటుందనలేం. ప్రతి ఇంట్లో చదువరులూ, ప్రతి ఇంట్లో సాహిత్యం, దాని వల్ల వచ్చే ప్రభావాలు ఒక కలగా మిగిలిపోతాయేమో అనే భయం నాలో వుంది.

**కుటుంబ సహకారం ఎలా ఉంది..?**

నా జీవిత భాగస్వామి కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి. ప్రముఖ కవి, కాళోజీ పురస్కార గ్రహీత. అందుకే నాకు చదువుకూ, రాసుకోవడానికి అభ్యంతరాలుండవు. పైగా రాస్తానన్నది రాయకపోతే ఆయనే నన్ను తొందర పెట్టైనా రాయిస్తారు. కాబట్టి నాకు కుటుంబ సహకారం పూర్తిగా వున్నట్టు.

**ఉద్యోగం, కుటుంబం, సాహిత్యం సమన్వయం ఏలా సాధ్యం?**

పని ఒత్తిడి అధికంగా వుండే ప్రభుత్వ ఉద్యోగంలో వున్నా కుటుంబానికీ సాహిత్యానికీ ప్రాధాన్యం కల్పించుకోవలసిందే. కొన్ని సార్లు చదవాలనుకున్నంత చదవలేకపోవచ్చు. రాయాలనుకున్నంత రాయలేకపోవచ్చు. సమయాభావం వల్ల అయినా దేని ప్రాధాన్యం దానికి ఇవ్వాల్సిందే. ఉద్యోగం భుక్తి కోసం, కుటుంబ బంధం, సాహిత్యం ఇష్టమైన వ్యాపకం. సాధ్యమైనంత వరకు అన్నింటినీ ఎంజాయ్ చేస్తూ పని చెయ్యాల్సిందే.

**ఓ రచయిత్రిగా మీ కర్తవ్యం..?**

మనం రాసిన ప్రతి అక్షరానికి ఒక ప్రయోజనం వుండాలి. అయితే సాహిత్యం ఈరోజు అక్షరాలా పుస్తకాల్లోంచి సోషల్ మీడియాలోకి ఎగబాకింది. దాంతో ఎక్కువ సందర్భాల్లో అక్షరం దుర్వినియోగం అవుతుంది. కించపరచుకోడానికి, తిట్టుకోవడానికి చాలా మంది అక్షరాన్ని ఆయుధం చేసుకుంటున్నారు. దీనిలో మార్పు రావాలి. ఆరోగ్యకరమైన సాహిత్యం సృష్టించబడాలి. అందులో నేను కూడా భాగస్వామిని కావాలి.

**మీ భవిష్యత్ ప్రణాళిక, అందుకున్న పురస్కారాలు..?**

2012లో నోముల కథా పురస్కారం బహుముఖ కథకు, 2019 అల్లాడి సుబ్బు సాహిత్య పురస్కారం, 2022లోనే అంపశయ్య నవీన్ తొలి నవలా పురస్కారం అందుకున్నాను. ఇక భవిష్యత్ ప్రణాళిక అంటూ ప్రత్యేకంగా ఏమీ లేవు. వీలైనంత ఎక్కువ చదవాలి. రాయాలనిపించినపుడు రాయాలి.

**- సలీమ**



**ఎంచుకున్న వృత్తిలో ఉన్నతంగా ఎదగాలంటే వృత్తికి సంబంధించిన నైపుణ్యాలతో పాటు కొన్ని లక్షణాలు అలవరచుకోవాలి అంటున్నారు నిపుణులు అవేమిటో తెలుసుకుందాం...**

# ఉన్నంతగా ఎదగాలంటే..?

మన కలలు, లక్ష్యాలను సాధించడంలో ఎప్పుడూ రాజీ పడకూడదు. అనుకున్నది సాధించేంత వరకూ పట్టుదలగా ప్రయత్నిస్తూ ఉండాలి. ఒకవేళ అలా జరగకపోతే తర్వాత ఏం చేయాలన్న దానిపై ప్లాన్ బి కూడా సిద్ధం చేసుకోవాలి. ప్రణాళిక వేసుకునేటప్పుడే దీన్నీ ఆలోచించుకోవాలి.

❄ మన అంతిమ లక్ష్యం కొత్త నైపుణ్యాలు నేర్చుకోవటమే. ఒకేసారి ఎదగాలని ఎప్పుడూ అనుకోవద్దు. డబ్బు సంపాదించటమే ప్రధాన ధ్యేయం కాకుండా ఉద్యోగంలో ఎదుగుదల మీద దృష్టి సారించాలి. అలానే సవాళ్ల ఎదుర్కోవడంలో, కొత్తవి ప్రయత్నించడంలోనూ ఎప్పుడూ వెనకడుగు వేయకూడదు. ఈ ప్రయత్నంలో అపజయాలు ఎదురైనప్పటికీ అది నేర్చుకోవడంలో భాగం అనుకోవాలి. గతంలో ఎదురైన అపజయాల్ని తలుచుకుని భవిష్యత్తులో రిస్క్ తీసుకోడానికి భయపడకూడదు. అలా చేస్తే ఉన్నచోటే ఆగిపోవాల్సి వస్తుంది.

❄ వృత్తి లేదా వ్యక్తిగత జీవితంలో మార్పు సహజం. ఏ విషయం లోనైనా మార్పు అవసరమైతే దాన్ని సాదరంగా ఆహ్వానించండి. ఉద్యోగం, ప్రాజెక్టు ఇలా ఏదైనా సరే పూర్తి శ్రద్ధతో కష్టపడి పనిచేస్తే ప్రయాణం సాఫీగా సాగుతుంది. జట్టులో అందరితో కలిసి పనిచేసినా, కొంతవరకు మాత్రమే వాళ్లపై ఆధారపడండి. అంతేకానీ గుడ్డిగా ఎదుటి వాళ్లను నమ్మొద్దు. చొరవతో మనమే పనులు పూర్తయ్యేలా చూసుకోవాలి. అప్పుడు వృత్తి జీవితంలో ఉన్నతంగా ఎదగగలం.

# వ్యాయామం తర్వాత...



**వ్యాయామంలో బోలెడు కెలొరీలు కరిగిపోతాయి. ఒళ్లంతా అలసిపోతుంది. అందుకే పూర్తయ్యాక కాస్త నీరసంగా అనిపిస్తుంది. ఒక్కోసారి వెంటనే మరో పని చేయాలనీ అనిపించదు. తక్షణ శక్తి కావాలా? వీటిని తాగేయండి.**

**చాక్లెట్ మిల్క్:** చాలామంది అమ్మాయిల చీట్ డేలో ఇది తప్పనిసరి. అలాంటిది కష్టపడి కెలొరీలు తగ్గించుకున్నాక దీన్ని తాగమంటారేంటి అంటారా? వ్యాయామం తర్వాత దీన్ని తీసుకుంటే తక్షణ శక్తి ఖాయమంటోంది ఓ అధ్యయనం. అదనంగా దీనిలోని కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్ ఎముకల ఆరోగ్యానికీ సాయపడతాయి.

**స్మూతీలు:** పండ్లు, కూరగాయలతో చేసిన స్మూతీల్లో పోషకాలు పుష్కలం. శక్తి త్వరగా పుంజుకునేలా చేస్తాయివి. వాటికి కాస్త నట్ బటర్‌నీ జోడించుకుంటే ఎముకలకూ దృఢత్వం.

**గ్రీన్ టీ:** ఉదయం నిద్ర లేవగానే దీన్ని తీసుకునేవారు చాలామందే! కానీ వ్యాయామం తర్వాత తీసుకొని చూడండి. దీనిలో అధిక మోతాదులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఇన్‌ఫ్లమేషన్‌ని దరిచేరనీయవు. కొద్ది మొత్తంలో ఉండే కెఫిన్ సహజంగానే శక్తినిస్తుంది.

**కొబ్బరినీళ్లు:** వ్యాయామ సమయంలో చెమట రూపంలో నీరంతా బయటకు పోతుంది. డీహైడ్రేషన్‌ను తప్పించడంలో వీటిలోని ఎలక్ట్రోలైట్స్ సాయపడతాయి. కెలొరీలు తక్కువ, శరీరానికి తోడ్పడే పొటాషియం, మెగ్నీషియం వంటి మినరల్స్ ఎక్కువ. శక్తిని కూడగడుతూనే బోలెడు ఆరోగ్య ప్రయోజనాలూ అందిస్తాయి.

# పూలే స్ఫూర్తితో మనువాదంపై పోరు

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకంగా పోరాటం చేశారని చెప్పారు. సమాజ మార్పు కోసం కృషి చేశారని వివరించారు. నాడు దేశంలో కులాలు, మతాలు, మూఢ నమ్మకాలు విపరీతంగా ఉన్నాయని, స్త్రీలకు స్వేచ్ఛ లేదని, సమానత్వం లేదని గుర్తు చేశారు. ఈ దురాచారాలకు మూలమైన మనువాదం, వేదాలను పూలే అధ్యయనం చేశారని, బ్రాహ్మణ ఆధిపత్యాన్ని ప్రశ్నించారని అన్నారు. అందరికీ చదువు ఉండాలని, స్త్రీలకు సమాన హక్కులుండాలని ఉద్యమించారని చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లయినా ఇప్పటికీ దేశంలో అలాంటి పరిస్థితులే ఉన్నాయని అన్నారు. ప్రధాని మోడీని విమర్శిస్తే టీసీలను, దేశాన్ని విమర్శించినట్టుగా ప్రచారం చేస్తున్నారని చెప్పారు. అదానీ అక్రమాలను ప్రశ్నిస్తే దేశాన్ని ప్రశ్నించినట్టుగా బీజేపీ నాయకులు అంటున్నారని అన్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలం, మనువాదం ప్రకారం మోడీ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఈ మనుస్మృతిని ఆనాడే అంబేద్కర్ తగులబెట్టారని గుర్తు చేశారు. సంఘ్‌పరివార్ శక్తులు తెలివిగా మనువాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని చెప్పారు. గాంధీని చంపిన గాడ్సేను దేశభక్తునిగా ప్రచారం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీరామనవమి రోజు గాడ్సే చిత్రపటాన్ని ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రదర్శించడం సిగ్గుచేటని విమర్శించారు. మనువాదం, ఆర్ఎస్ఎస్-బీజేపీ సిద్ధాంతంపై లోతైన అధ్యయనం చేయాలని, సమాజ మార్పు కోసం బలమైన ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. చాడ మాట్లాడుతూ దేశంలో నిచ్చెనమెట్ల కులవ్యవస్థ ఉందన్నారు. ఆధునిక ప్రపంచంలోనూ గడ్డు పరిస్థితులను ప్రజలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. మనిషిని మనిషిగా చూడని పరిస్థితులున్నాయని వివరించారు. అణగారిన వర్గాల పట్ల ఇప్పటికీ వివక్ష కొనసాగుతున్నదని అన్నారు. 150 ఏండ్ల కింద సామాజిక న్యాయం కోసం పూలే పనిచేశారని గుర్తు చేశారు. 1873లో సత్యశోధక్ సమాజాన్ని ఏర్పాటు చేశారని, బడుగు, బలహీనవర్గాలు, మహిళల అభ్యున్నతి కోసం పాటుపడ్డారని వివరించారు. భారత్‌లో ఇంకా సామాజిక న్యాయం రాలేదన్నారు. ఆజాదీ కా అమృత మహోత్సవాలు జరుగుతున్నా అణచివేత, వివక్ష పోలేదని చెప్పారు. ఈ నేపథ్యంలో సామాజిక న్యాయం సాధించడమే లక్ష్యంగా ఐక్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజంలో విషబీజాలను నాటాలని చూస్తున్న ఆర్ఎస్ఎస్, బీజేపీ విధానాలను, హిందూత్వ ఎజెండాను తిప్పికొట్టాలని కోరారు. పూలే ఆశయాల సాధన కోసం కృషి చేయాలన్నారు. ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ సామాజిక న్యాయానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నదని చెప్పారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ బాలమల్లేష్, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంవి రమణ అధ్యక్షత వహించగా, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్ నాయకులను వేదికపైకి ఆహ్వానించారు. తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్ వందన సమర్పణ చేశారు.

# గోమూత్రం హానికరం

**న్యూఢిల్లీ :** దేశంలో గోమూత్రంపై అశాస్త్రీయమైన ప్రకటనలు చేసే బీజేపీ, హిందూత్వ సంస్థల మాటలు తప్పని రుజువయ్యాయి. గోమూత్రంలో 14 రకాల హానికర బాక్టీరియా ఉన్నట్టు తాజా అధ్యయనంలో తేలింది. అలాగే, ఈ ఆవు మూత్రం మనుషులక పనికిరాదని స్పష్టం చేసింది. యూపీలోని బరేలీలో గల ఇండియన్ వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐవీఆర్ఐ) పరిశోధనలో ఇది తేలింది. దేశంలోని ప్రధానమైన జంతు పరిశోధక సంస్థ అయిన ఐవీఆర్ఐ అప్పుడే తీసుకొచ్చిన ఆవు మూత్రాన్ని పరిశోధించింది. అందులో హానికరమైన బాక్టీరియా కలిగి ఉండొచ్చని తెలిపింది. దీనిని నేరుగా వినియోగించడానికి సరిపోదని స్పష్టం చేసింది. కడుపునొప్పిని కలిగించే ఎస్చెరిచియా కోలితో పాటు కనీసం 14 రకాల హానికరమైన బాక్టీరియాను ఆవు మూత్రం కలిగి ఉంటుందని తేలింది. ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన భోజ్‌రాజ్ సింగ్ నేతృత్వంలో ముగ్గురు పీహెచ్‌డీ విద్యార్థులతో ఈ అధ్యయనం జరిగింది. ఈ పరిశోధనను ఆన్‌లైన్ రీసెర్చ్ వెబ్‌సైట్ రీసెర్చ్‌గేట్‌లో ప్రచురించారు.

# అంతా అదానీ కోసమే..

(మొదటిపేజీ తరువాయి)

ఎండబెడుతున్నారు.. విశాఖ స్టీల్ ప్లాంట్ పొట్టగొడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం చర్యలు... తెలుగు రాష్ట్రాలకు చావు దెబ్బలాంటివని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంత్రులు సత్యవతి రాథోడ్, పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు తదితరులతో కలిసి కేటీఆర్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. బయ్యారంలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు, విశాఖ స్టీల్ ప్లాంటుకు గనుల కేటాయింపు తదితర విషయాల్లో మోడీ సర్కారు అనుసరిస్తున్న విధానాలను ఆయన ఈ సందర్భంగా తప్పుబట్టారు. రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీని నిర్మించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుంచి కోరుతున్నా... కేంద్రం పట్టించుకోవటం లేదని తెలిపారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి కేసీఆర్ అనేకసార్లు కేంద్రానికి లేఖలు రాశారనీ, ఆనాటి గనుల శాఖ మంత్రిగా తాను ప్రధానికి వినతిపత్రం సమర్పించానని ఆయన గుర్తు చేశారు. బయ్యారంలో దొరికే ముడి ఖనిజం నాణ్యత రీత్యా అక్కడ కర్మాగారం స్థాపించటం సాధ్యం కాదంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పటం శోచనీయమన్నారు. అలాంటప్పుడు పక్కనే ఉన్న ఛత్తీస్‌ఘడ్‌లోని బైలడిల గనుల నుంచి ముడి ఇనుమును సరఫరా చేయటం ద్వారా ఇటు బయ్యారంలో ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేయొచ్చు.. అటు విశాఖ స్టీల్ ప్లాంటును కాపాడుకోవచ్చని తెలిపారు. కానీ ఈ పని చేస్తే బైలడిలలో సమీకృత ముడి ఇనుప ఖనిజ పరిశ్రమ(ఇంటిగ్రేటెడ్ ఐరన్ ఓర్ కంపెనీ)ను నెలకొల్పిన అదానీకి నష్టమని... అందువల్లే ప్రధాని మోడీ దాని గురించి మాట్లాడటం లేదని విమర్శించారు. అక్కడి ఇనుప ఖనిజం గనులను అదానీకి కట్టబెట్టటమే దీనికి కారణమని చెప్పారు. బైలడిల నుంచి 180 కిలోమీటర్ల దూరంలో ఉన్న బయ్యారానికి, 600 కిలోమీటర్ల దూరంలో ఉన్న విశాఖకు ఖనిజం సరఫరా చేయటం సాధ్యం కాదని చెప్పిన కేంద్రం...అక్కడి నుంచి 1,800 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుజరాత్‌లోని ముంద్రాకు మాత్రం ఐరన్ ఓర్‌ను సరఫరా చేస్తోందని విమర్శించారు. ఈ రకంగా లాభాలను తన దోస్తులకు దోచి పెడుతున్న మోడీ.. నష్టాలను మాత్రం జాతికి అంకితం చేస్తున్నారని కేటీఆర్ ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. ఇందుకు సంబంధించి తన వద్ద పూర్తి ఆధారాలున్నాయని ఆయన తెలిపారు. ఒకవేళ తాను చెప్పింది తప్పయితే తనపై పరువు నష్టం దావా వేసుకోవచ్చంటూ బీజేపీ నేతలకు ఆయన సవాల్ విసిరారు.



విశాఖ స్టీల్ ప్లాంట్ గురించి మాట్లాడుతున్న తమపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తున్న ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు అసలు విషయ పరిజ్ఞానం లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ రకంగా ప్రస్తుతం దేశాన్ని అదానీ, అజ్ఞానులు (బీజేపీ నేతలు) కలిసి నాశనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవటంలో భాగంగా అక్కడి బిడ్డింగ్ ప్రక్రియలో తమ ప్రభుత్వం పాల్గొంటుందని తెలిపారు. ఈ క్రమంలో సాధ్యాసాధ్యాలను, వాస్తవాలను పరిశీలించేందుకు రాష్ట్ర అధికారులు విశాఖకు వెళ్లారని వివరించారు. వారిచ్చే నివేదిక ఆధారంగా తగు నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవటమనేది తమ ప్రభుత్వ విధానమని తెలిపారు. వైజాగ్ స్టీల్ ఫ్యాక్టరీకి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైఖరి గురించి ప్రశ్నించగా... 'దానిపై ఎలాంటి ఆసక్తి లేదు.. ఇక్కడ ఏపీ ప్రభుత్వం కాదు, కేంద్రం ఏం చేస్తున్నదనేదే ముఖ్యం...' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. నిజాం చక్కెర కర్మాగారాన్ని పునరుద్ధరించేందుకు, సిర్పూర్ పేపర్ మిల్లును తెరిపించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన వివరించారు.

# నిబంధనలకు విరుద్ధంగా భూ కేటాయింపు

(మొదటిపేజీ తరువాయి)

యశోద సంస్థకు భూముల కట్టబెట్టడం వెనుక జరిగిన కుట్రను బయటపెట్టారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలు అంజన్‌కుమార్‌యాదవ్, మల్లు రవి, జగదీశ్వర్‌రావు, చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి రేవంత్ విలేకర్లతో మాట్లాడారు. హైటెక్ సిటీ సమీపంలో రూ.800 కోట్ల విలువైన భూమిని కేవలం రూ. 100 కోట్లకే యశోద ఆస్పత్రి యాజమాన్యాకి కేటాయించినట్లు ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో 2010లో వైద్య ఆరోగ్య రంగంలో పరిశోధనలు, మౌలిక సదుపాయాల కల్పన కోసం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అమెరికాకు చెందిన అలగ్జాండ్రియా అనే కంపెనీకి శేరిలింగంపల్లి మండలం, ఖానాపూర్ గ్రామం సర్వే నెంబర్ 41/14లో ఐదు ఎకరాల స్థలాన్ని, ఎకరా రూ.10 కోట్ల చొప్పున ధర నిర్ణయించి కేటాయిస్తూ సేల్ డీడ్ చేసుకుందని గుర్తు చేశారు. జీవో నెంబర్ 1484, లోకాయుక్త అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని అక్కడ ఎకర ధర రూ. 10 కోట్లు కాదు...రూ.12 కోట్లు ఉందని నిర్ధారణ కావడంతో ఈ మేరకు ఆ సర్వే నెంబర్‌లో స్థలం పొందిన అలగ్జాండ్రియాతో పాటు మారుతి సుజుకీ కంపెనీలకు 5.6.2012న హెచ్ఎండీఏ లేఖ రాసిందన్నారు. సదరు సర్వే నెంబర్‌లో ఎకర రూ.12 కోట్లు ధర పలుకుతున్నందున ముందుగా చెల్లించిన మొత్తానికి అదనంగా... ఎకరానికి రూ.2 కోట్లు చెల్లించాలని ఆ లేఖలో పేర్కొందని గుర్తు చేశారు. ఈ లేఖపై స్పందించిన మారుతి సుజుకీ తనకు కేటాయించి రెండు ఎకరాల స్థలానికి అదనంగా చెల్లించాల్సిన రూ.4 కోట్లు చెల్లించిందని తెలిపారు. అలగ్జాండ్రియా మాత్రం ఈ అంశంపై కోర్టుకు వెళ్లిందని చెప్పారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఖానామెట్ గ్రామంలో సర్వే నెంబర్ 41/14లో ఉన్న భూమిపై కల్వకుంట్ల మాఫియా కన్నుపడిందని ఆరోపించారు. అప్పటికే అలగ్జాండ్రియాకు కేటాయించిన భూమి ధర వివాదం కోర్టులో ఉండటంతో దానిని సాకుగా చూపి అలగ్జాండ్రియాను బెదిరించి 2016లో అలగ్జాండ్రియా కంపెనీలోకి కల్వకుంట్ల జగన్నాథరావు, గోరుకంటి రవీందర్‌రావు, గోరుకంటి దేవేందర్ రావు డైరెక్టర్లుగా చొరబడ్డారని వివరించారు. జగన్నాథరావుకు కల్వకుంట్ల అనే ఇంటి పేరు తప్ప ఎటువంటి అర్హత లేదని ఎద్దేవా చేశారు. ఆ విధంగా అలగ్జాండ్రియా అనే కంపెనీ కల్వకుంట్ల మాఫియా సొంతమైందని చెప్పారు. ఆ తర్వాత కోర్టులో ఉద్దేశపూర్వకంగానే కేసు ఓడిపోయి తన మాఫియా సభ్యులుగా ఉన్న డైరెక్టర్లకు రూ.500 కోట్ల విలువైన భూమిని దారాదత్తం చేసిందన్నారు. ఈ కారణంగా ప్రభుత్వ ఖజానాకు అదనంగా రావాల్సిన రూ.10 కోట్లు రాలేదనీ, రూ.500 కోట్ల అత్యంత విలువైన ప్రభుత్వ భూమి వారికి దక్కిందన్నారు. అర్హత లేకపోయినా వారికి కట్టబెట్టిన భూమిని వెనక్కి తీసుకునే హక్కు ప్రభుత్వానికి ఉంటుందన్నారు. వాస్తవానికి హైటెక్ సిటీ సమీపంలో ఉన్న ఈ భూమి ధర 2017లో గజానికి రూ. రెండు లక్షలకు తక్కువ లేదన్నారు. యశోద గ్రూప్ గజం రూ.37,611కు కొనుగోలు చేసిందన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధర ఎకరాకు రూ.33.70 కోట్లు ఉందని తెలిపారు. ఈ భూదోపిడీలో అలగ్జాండ్రియాలో రూ.500 కోట్లు, యశోద గ్రూప్‌కు రూ.300 కోట్ల విలువైన భూములను కేవలం రూ 100 కోట్లకే కట్టబెట్టిందన్నారు. నిరుద్యోగ కుటుంబానికో లక్ష రూపాయలు సాయం చేయాలని కేసీఆర్ ఎందుకు ఆలోచించలేదన్నారు. ఆ భూములను అమ్మితే రూ.2500 కోట్లు వస్తాయనీ, ఆ సొమ్ముతో నిరుద్యోగులను ఆదుకోవచ్చు అని తెలిపారు. అత్యంత కీలకమైన లిక్కర్ కుంభకోణంలో ఉన్న వ్యక్తులకు కేటాయించిన భూముల వివరాలను, వారి బంధాన్ని బుధవారం బయటపెడతానని వెల్లడించారు. తాను ప్రభుత్వంపై చేసిన ఆరోపణలు తప్పని నిరూపించాలని కేటీఆర్‌కు సవాల్ విసిరారు.

# ప్రజాస్వామ్య మూల స్తంభాలపై దాడి

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తావించారు. . నిరుద్యోగం, ధరల పెరుగుదల, సామాజిక అంశాలు, అదానీ కుంభకోణం, బడ్జెట్ వంటి అంశాలపై చర్చను మరుగునపడేసేందుకు, ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాలను అడ్డుకోవడం దారుణమని ఆమె మండిపడ్డారు. కీలక సమస్యలు, సున్నిత అంశాలను వదిలివేయడం లేదా ఘాటైన పద ప్రయోగాలతో ఆ అంశాల నుండి పక్కకు తప్పుకోవడం మోడీ ప్రకటనలు ప్రస్ఫుటం చేస్తాయని సోనియా మండిపడ్డారు.

ప్రతిపక్షాలు సమైక్యంగా ప్రభుత్వంపై పోరాడుతుండటంతో వాటిని ఎదుర్కొనేందుకు కేంద్రం అసాధారణ చర్యలను ఆశ్రయిస్తూ.. ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని దుయ్యబట్టారు. లోక్‌సభ ఎంపీగా రాహుల్ గాంధీపై అనర్హత వేటుతో పాటు ఆయన ప్రసంగంలోని కొంత భాగాన్ని పార్లమెంట్ రికార్డుల నుంచి తొలగించడాన్ని సోనియా ప్రస్తావించారు.

పార్లమెంట్‌లో ఎలాంటి చర్చా చేపట్టకుండా రూ. 45 లక్షల కోట్ల బడ్జెట్‌ను ఆమోదించడానికి రాహుల్ అంశాన్ని లేవనెత్తారని దుయ్యబట్టారు. ఆర్థిక బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టినపుడు ప్రధాని మోడీ మీడియా కవరేజీతో తన నియోజకవర్గంలో ప్రాజెక్టుల ప్రారంభోత్సవంలో బిజీగా ఉన్నారని అన్నారు. తన బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ నిరుద్యోగం, ద్రవ్యోల్బణం గురించి ప్రస్తావించలేదని మండిపడ్డారు. అంటే దేశంలో 'సమస్యలు లేనట్లే' నా అని ప్రశ్నించారు.

కేంద్ర దర్యాప్తు సంస్థలను మోడీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని, ఈడీ, సీబీఐ కేసుల్లో 95 శాతానికి పైగా ప్రతిపక్ష నేతలపైనే బనాయించారని సోనియా గాంధీ మండిపడ్డారు. అయితే బీజేపీలో చేరిన వారిపై కేసులు మాత్రం ఆవిరవుతున్నాయని ఆరోపించారు. జర్నలిస్టులు,కార్యకర్తలు, ప్రముఖ హక్కుల సంస్థలపై జాతీయ భద్రతా చట్టాలను ప్రయోగిస్తోందని మండిపడ్డారు. అలాగే కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు రిటైర్డ్ జడ్జీలపై చేసిన వ్యాఖ్యలను కూడా తప్పుపట్టారు. న్యాయవ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీసే వ్యవస్థాగత ప్రయత్నమని అన్నారు. ప్రజలను తప్పు దారి పట్టించడానికి, విద్వేషాలను రెచ్చగొట్టడానికి మరియు సేవచేస్తున్న న్యాయమూర్తులను భయపెట్టడానికి ఉద్దేశపూర్వకంగా ఈ వ్యాఖ్యలు చేశారని ధ్వజమెత్తారు. "రాజకీయజోక్యం, బీజేపీ కార్పొరేట్ స్నేహితుల ఆర్థిక బలం" కారణంగా మీడియా తన స్వేచ్ఛలో రాజీపడాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ఎస్‌లు విద్వేషాలను రెచ్చగొడుతూ, హింసకు పాల్పడుతున్నా, ప్రధాని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రధాని ఒక్కసారి కూడా శాంతి సామరస్యాల కోసం పిలుపునివ్వలేదని ధ్వజమెత్తారు. మతపరమైన పండుగలను ఉత్సాహంగా, వేడుకగా జరుపుకోవడానికి బదులుగా ఇతరులను భయపెట్టేందుకు, వేధించేందుకు వినియోగిస్తున్నారని దుయ్యబట్టారు. పండుగల్లో ఆనందానికి బదులుగా మతం, ఆహారం, కులం, లింగం, భాషల ఆధారంగా వివక్షకు గురవుతున్నారని విమర్శించారు. 2024లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయని, దీంతో రాబోయే కొద్ది నెలలు మన ప్రజాస్వామ్యానికి కీలకమైన పరీక్ష కానుందని అన్నారు. మోడీ ప్రభుత్వం పలుకీలక రాష్ట్రాల్లో అధికారాన్ని, ఎన్నికలను దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు భావసారూప్యత ఉన్న పార్టీలన్నింటితోనూ కాంగ్రెస్ చేతులు కలుపుతోందని గతంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చేసిన ప్రకటనను సోనియాగాంధీ పునరుద్ఘాటించారు.

# వర్షాకాల సమావేశాల్లో సమాచార రక్షణ బిల్లు

(మొదటిపేజీ తరువాయి)

జూన్ 16న పదవీవిరమణ చేస్తున్నందున కొత్త బెంచ్ ఏర్పాటు కోసం ఈ విషయాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్‌కు నివేదించనున్నట్లు తెలిపింది. వినియోగదారులు చేసుకున్న కాల్స్, పంపిన ఫొటోలు, వీడియోలు, పత్రాలను మార్పిడి చేసుకునేందుకు ఉద్దేశించి వాట్సప్, దాని మాతృసంస్థ ఫేస్‌బుక్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని సవాలు చేస్తూ ఇద్దరు విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం విచారిస్తోంది. ఈ ఒప్పందం తమ వ్యక్తిగత గోప్యతకు, వాక్ స్వాతంత్ర్యానికి భంగకరమని పిటిషనర్లు వాదించారు.

# సర్వం సిద్ధం

- మరో రెండు రోజుల్లో అక్కడక్కడా ప్రారంభంకానున్న ధాన్యం సేకరణ కేంద్రాలు
- ఉమ్మడి జిల్లాలో దిగుబడి అంచనా 17.97లక్షల మెట్రిక్‌టన్నులు
- విత్తనోత్పత్తి, ప్రయివేటు వ్యక్తులు కొనగా మిగిలిన 60శాతం సేకరించేందుకు సిద్ధం
- 1331 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సర్వంసిద్ధం
- ఎంఎస్‌పీ ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2060.. సాధారణ రకానికి రూ.2040
- సీఎంఆర్ పెండింగ్‌ఉన్న బిల్లులకు కేటాయింపులకు నో!
- పాత రెండు సీజన్ల సీఎంఆర్ వందశాతం ఇవ్వని మిల్లులే..
- ఈనెలాఖరు వరకు కోటా పూర్తి చేస్తే కొత్తగా కేటాయింపులు

| జిల్లా | సాగు విస్తీర్ణం (ఎకరాల్లో) | దిగుబడి అంచనా (మెట్రిక్‌టన్నుల్లో) | కొనుగోలు కేంద్రాలు |
|---|---|---|---|
| కరీంనగర్ | 2,46,000 | 4.52లక్షల మె.ట | 353 |
| జగిత్యాల | 2,95,100 | 5.30లక్షల మె.ట | 419 |
| పెద్దపల్లి | 1,99,451 | 4.75లక్షల మె.ట | 300 |
| రాజన్నసిరిసిల్ల | 1,70,000 | 3.40లక్షల మె.ట | 259 |
| మొత్తం | 9,10,641 | 17.97లక్షల మె.ట | 1331 |



ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఈ 2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మరో రెండు రోజుల్లో వరికోతలు సాగుతున్న గ్రామాల్లో ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ సెంటర్లను ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేసింది. సాగునీటి వసతి, భూగర్భజలాలు సమృద్ధిగా ఉండటంతో ఎన్నడూ లేనివిధంగా ఈయాసంగిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9.10లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఈ మేరకు దిగుబడి కూడా 17.97లక్షల మెట్రిక్‌టన్నుల మేర ఉంటుందని అధికారులు అంచనా వేశారు.అయితే కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలో అదనంగా మరో 2లక్షల మెట్రిక్‌టన్నుల మేర విత్తనోత్పత్తి, ఇతర ప్రయివేటు వ్యాపారులు, మిల్లర్లు నేరుగా కొనే అవకాశాలు ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఏదేమైనా రానున్న రోజుల్లో ఒక సీజన్‌లోనే 20లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం పండించే జిల్లాల జాబితాలోకి ఉమ్మడి కరీంనగర్ చేరనుంది.

*నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి*

ప్రసుత్తం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 17.97లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరించే లక్ష్యంగా 1331 కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించబోతోంది. రెండు రోజుల్లో కోతలు ప్రారంభమైన గ్రామాల్లో ధాన్యం సేకరణ కేంద్రాలను ఓపెన్ చేస్తున్నారు. ఈసారి కూడా క్వింటా వరి ధాన్యం 'ఏ' గ్రేడ్ రకానికి రూ.2060, సాధారణ రకానికి రూ.2040 చెల్లించనున్నట్టు ప్రభుత్వం తెలిపింది.

జిల్లాల వారీగా పరిశీలిస్తే కరీంనగర్ జిల్లాలో 4.52మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుబడి అంచనావేసి 353 కేంద్రాలు, జగిత్యాల జిల్లాలో 5.30లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరణ అంచనాతో 419 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నారు. పెద్దపల్లిలో కూడా 4.75లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా 300 సేకరణ కేంద్రాలు, రాజన్నసిరిసిల్ల జిల్లాలో 3.40లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుబడి అంచనాతో 259 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఈ క్రమంలో మొత్తం దిగుబడిలో కొంత మేర విత్తనోత్పత్తి కింద, ప్రయివేటు వ్యాపారులే నేరుగా కొనుగోలు చేయనున్నారు. ఇది సుమారు 30శాతం నుంచి 40శాతం మేర ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కరీంనగర్ జిల్లాలో పరిశీలిస్తే 2,73,112 ఎకరాల్లో వరి సాగవగా హెక్టార్‌కు 5683 మెట్రిక్‌టన్నుల ధాన్యం వస్తుందనిఅంచనాగట్టారు. ఈ లెక్కన 6లక్షలా 20వేలా 885 మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుబడి అంచనాలో మిల్లర్లు, ట్రేడర్లు, ప్రయివేటు వ్యాపారులు సహా విత్తనోత్పత్తి కింద ప్రయివేటు కంపెనీలకు పోయే ధాన్యం లక్షా 68వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం ఉంటుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మిగిలిన 4.52లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యంసేకరణ లక్ష్యంగా కరీంనగర్‌లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నారు.

### రెండేండ్లుగా వందశాతం సీఎంఆర్ ఇవ్వని మిల్లులు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2021-22 వానాకాలం సీజన్‌కు సంబంధించి ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) బియ్యమే సుమారు 10లక్షల క్వింటాళ్ల వరకు ఉన్నాయి. ధాన్యం కేటాయించిన మిల్లుల్లో నాలుగు జిల్లాల పరిధిలోనూ సగం కూడా వందశాతం తిరిగి సీఎంఆర్ ఇవ్వలేదు. కరీంనగర్ జిల్లాలో పరిశీలిస్తే 2021-22 వానాకాలం సీజన్‌కు సంబంధించి మిల్లులు 86.65శాతం ధాన్యమే తిరిగి ఇచ్చారు. ఇందులో మొత్తం 183 మిల్లులుకు ధాన్యం కేటాయిస్తే వందశాతం సీఎంఆర్ పూర్తి చేసింది 117 మిల్లులే. 2021-22 యాసంగి సీజన్‌లోనూ మిల్లులు 81.55శాతం సీఎంఆర్ పూర్తి చేశాయి. మొత్తం 178 మిల్లులకు ధాన్యం కేటాయిస్తే వందశాతం ఎఫ్‌సీఐకి బియ్యం అప్పగించింది 70 మిల్లులు మాత్రమే. మిగిలిన 108 మిల్లుల్లో 38వేలా519క్వింటాళ్ల బియ్యం రావాల్సి ఉంది. ఈ సారి యాసంగి ధాన్యంకేటాయింపుల్లో వందశాతం సీఎంఆర్ ఇచ్చిన మిల్లులకే ప్రాధాన్యత ఉంటుందని అధికారులు తెలిపారు. 2021-2022యాసంగి సీజన్ వరకూ వందశాతం సీఎంఆర్ అప్పగించాలని ఈనెలాఖరు వరకు గడువు విధించారు. ఆలోపు వందశాతం బియ్యం తిరిగి ఇచ్చిన మిల్లులకే కొత్తగా ధాన్యం కేటాయించనున్నారు. ఈ నిర్ణయంలో భాగంగా మిగిలిన ధాన్యం బహిరంగమార్కెట్‌లో ఎంఎస్పీ ధరకు అమ్ముకునేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

## 14న ఎంఐఎం దావతే ఇఫ్తార్ విజయవంతం చేయండి

### ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్



మాట్లాడుతున్న ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్

**నవతెలంగాణ-కరీంనగర్:** ఈనెల 14న నగరంలోని అశోక్ నగర్ ఎస్ఎస్ గార్డెన్ లో కార్పొరేటర్లు, ఎంఐఎం నగర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన దావతే ఇఫ్తార్ కార్యక్రమ సన్నాహక ఏర్పాట్లను ఎంఐఎం నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఎంఐఎం కార్పొరేటర్లు, నాయకులు ఎస్ఎస్ గార్డెన్ చేరుకొని ఏర్పాట్లపై మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ.. కార్యక్రమానికి నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ దావతే ఇఫ్తార్లో ఉపవాస దీక్షలు పాటించే ప్రతి ఒక్కరికి ఆహ్వానం ఉందన్నారు. అనంతరం ఫంక్షన్ హాల్లో మగ్రిబ్ నమాజ్ చేసుకునేలా ఏర్పాటు చేశామని, అనంతరం భోజనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అఖిల్ ఫిరోజ్, కార్పొరేటర్ షర్ఫుద్దీన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 'యశోద'లో అరుదైన చికిత్స

### ముందజంపల్లి యువతికి ఎంటెరిక్ జ్వరం

### హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స అందించిన వైద్యులు



మాట్లాడుతున్న యశోద ఆస్పత్రి వైద్యులు డాక్టర్ మోహన్ కృష్ణ

**నవతెలంగాణ-కరీంనగర్:** కరీంనగర్ జిల్లా ముంజంపల్లి గ్రామానికి చెందిన యువతికి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రి వైద్యులు అరుదైన చికిత్స అందించారు. కరీంనగర్ పట్టణంలోని యశోద ఆస్పత్రిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో (ప్రముఖ న్యూరోలాజిస్ట్) డాక్టర్ జే.మోహన్‌కృష్ణ మాట్లాడుతూ.. ముంజంపల్లి గ్రామానికి చెందిన అలేఖ్య(19) విరోచానాలు, వాంతులతో బాధపడుతూ స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంది. అయినా వ్యాధి నయం కాకపోవడంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ వైద్యులు అన్ని పరీక్షలు నిర్వహించి ఎంటెరిక్ జ్వరం సోకినట్టు గుర్తించారు. అంతేకాకుండా ఆమెకు మూత్ర పిండాలు సరిగా పనిచేయడం లేదని, తదుపరి తనకు కుడి వైపు పక్షవాతం వచ్చినట్టు మానసిక స్థితి సరిగా లేనట్టు గుర్తించినట్టు డాక్టర్ మోహన్‌కృష్ణ తెలిపారు. జరిపిన పరీక్షలో కుడి వైపు పక్షవాతం, చిరాకుతో మాట్లాడడం, ఆదేశాలను పాటించడం లేకపోయిందన్నారు. ఎం.ఆర్.ఐ. మెదడు, ఎడమ ప్యారిటల్ లోబులో మెదడు ఎడమ దిగ బాగంలో రక్తం గడ్డకట్టడాన్ని చూపించిందన్నారు. వెన్నుముక ద్రవంలో తెల్ల రక్త కణాలను పెంచిందని వెల్లడించారు. పెట్ సిటి ఎడమ సగం లేదా మస్తిష్క అర్థ గోలంలో విస్తరించిన హైపర్ మెటబాలిజం చూపించిదని, ఆమె బహుళ క్రమ శిక్షణ నిపుణుల బృందంతో పరీక్షించినట్టు తెలిపారు. బహుళ టైపాయిడ్, లెప్టోస్పిరా వల్ల వచ్చిన పెరాలిసిస్గా నిర్ధారణ అయిందన్నారు. ఆమె ఇంజక్ట్ చేయగల ఆంటి బయాటిక్స్ తదుపరి ఓరల్ యాంటి బయాటిక్స్, సపోర్టివ్ తెరఫీ ద్వారా చికిత్స పొందిందని, ఆమె చేతులు, కాళ్ల కదలిక క్రమంగా మెరుగు పడిందని తెలిపారు. డిశ్చార్జి సమయంలో ఆమె నిరంతరం మాట్లాడే సామర్థ్యాన్ని కలిగి ఉందన్నారు. ఇది తరువాతి సందర్శనలో మెరుగు పడినట్టు తెలిపారు. ఇది స్ట్రోకు వ్యవస్థతో కూడిన ఎంటెరిక్ జ్వరం అని అరుదుగా వస్తుందని తెలిపారు. ఇప్పుడు యువతి పూర్తిగా కోలుకున్నట్టు చెప్పారు. యువతి మాట్లాడుతూ.. యశోద అందించిన చికిత్సతో త్వరగా కోలుకున్నట్టు తెలిపింది. ఎప్పటిలాగే కళాశాలకు వెళ్తునట్టు పేర్కొంది. తనకు చికిత్స అందించిన వైద్యులకు, న్యూరోలాజిస్ట్ మోహన్ కృష్ణకు, యశోధ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

## పది పరీక్షలు ప్రశాంతం



సంతోషంగా బయటికి వెళ్తున్న విద్యార్థులు

**నవతెలంగాణ-హుజురాబాద్:** మండలంలోని 5 పరీక్ష కేంద్రాల్లో ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు ముగిసినట్లు మండల విద్యాధికారి కేతిరి వెంకట నర్సింహా రెడ్డి తెలిపారు. హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 200 రెగ్యులర్ విద్యార్థులకు 199 హాజరవగా ఒకరు గైర్హజరయ్యారు. 13 మంది ప్రైవేట్ (వన్స్ ఫెయిల్డ్) విద్యార్థుల్లో తెలుగు పరీక్షకి ఒకరు, హిందీ, ఆంగ్లం, సాంఘిక పరీక్షలకు ఒక్కరు, గణిత పరీక్షకి ఎనిమిది, సైన్స్ పరీక్షకి ముగ్గురు హాజరయినట్లు చెప్పారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 178 మందికి 178, న్యూ శాతవాహనలో 163 విద్యార్థులకు 163 మంది, మాంటిసోరిలో 158 కి 156, చెల్పూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 200కి 199 మంది హాజరయ్యారని తెలిపారు.

## ఉపాధి కూలీలకు సన్మానం



ఎంపీపీ, సర్పంచులను సన్మానిస్తున్న ఉపాధి కూలీలు

**నవతెలంగాణ-తిమ్మాపూర్:** తిమ్మాపూర్ మండలానికి జాతీయ స్థాయిలో అవార్డు రావడానికి కృషి చేసిన ఎంపీపీ కేతిరెడ్డి వనిత దేవేందర్ రెడ్డిను, మహాత్మా నగర్ గ్రామ సర్పంచ్ జక్కని శ్రీవాణి రవీందర్ ను ఉపాధి హామీ కూలీలు మంగళవారం శాలువాతో ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు మండలానికి వచ్చేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, పంచాయతీ ప్రణీత్, ఉపాధి కూలీలు ఉన్నారు.

## 'వాగేశ్వరి'లో విదేశీ విద్య, ఉద్యోగాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న కంపెనీ సీఈవో

**నవతెలంగాణ-తిమ్మాపూర్:** మండలంలోని రామకృష్ణ కాలనీలో గల వాగేశ్వరి ఫార్మసీ కళాశాలలో కేఎస్ఎస్ కెరీర్ కోచింగ్, ఓవర్సీస్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో విదేశీ విద్య, ఉపాధి అవకాశాలపై ఫార్మసీ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో ముఖేష్ బన్సాల్, రాజ చిన్న, మహేష్ హాజరై మాట్లాడారు. విదేశాలలో ఉన్నత విద్యా కోర్సులు, విదేశాలకు వెళ్లడానికి అవసరమైన వివిధ పరీక్షల గురించి విద్యార్థులకు సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధాన కార్యదర్శి డాక్టర్ గంద్ర శ్రీనివాస్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి డాక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి,డైరెక్టర్లు వినోద్,ప్రకాష్ రెడ్డి,అధ్యాపకులు పాల్గొన్నారు.

## వివేకానందలో ముగిసిన శిక్షణ కార్యక్రమం



శిక్షకులను సన్మానిస్తున్న విద్యార్థులు

**నవతెలంగాణ-కరీంనగర్:** జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో ఆప్టిట్యూడ్ అండ్ రీజనింగ్ పై రెండు రోజుల పాటు జరిగిన శిక్షణ కార్యక్రమం ముగిసిందని ట్రైనింగ్, ప్లేస్మెంట్ ఆఫీసర్ (టీపిఓ) మహమ్మద్ అబ్దుల్ సలీం తెలిపారు. టాస్క్ శిక్షకుడు నిషాంత్ కుమార్ కోడింగ్, డీకోడింగ్, డైరెక్షన్, క్యాలెండర్, నంబర్ సిరీస్, ఏవరేజెస్, సెట్స్ అండ్ ఇండిసేస్ అనే అంశాలపై అవగాహన కల్పిస్తూ, సులభమైన పద్ధతిలో సమస్యను పరిష్కరించే విధంగా విద్యార్థులకు మెళకువలను నేర్పారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆప్టిట్యూడ్ అండ్ రీజనింగ్‌లో పట్టు సాధించాలంటే ప్రశ్నల సాధన ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీఓ బండి సంపత్ కుమార్, ఏవో బండి శ్రవణ్ కుమార్, బి.రామేశ్వరరావు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం



**నవతెలంగాణ-కథలాపూర్:** కథలాపూర్ నూతన ఏఎంసీ చైర్మన్ గుండారపు సౌజన్య గంగాధర్‌ను రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు కనపర్తి సత్యనారాయణ మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కథలాపూర్ మండల విశ్వబ్రాహ్మణ అధ్యక్షులు శంభోజి శ్రీనివాస్, కథలాపూర్ మాజీ ఎంపీపీ నాంపల్లి లింబాద్రి, కోరుట్ల నియోజకవర్గం ఇంచార్జి పలాస శేఖర్, స్వర్ణకార సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మండలోజీ శ్రీనివాస్, మాజీ కాంగ్రెస్ నాయకులు గడ్డం కిరణ్, దూలూరు గ్రామ సర్పంచ్ లక్ష్మీ నరసయ్య, డైరెక్టర్ మేడిపల్లి రాజారెడ్డి, వార్డు సభ్యులు గడ్డం అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత రత్న అవార్డు గ్రహీతలను సన్మానించిన ఎమ్మెల్యే



సన్మానిస్తున్న ఎమ్మెల్యే రసమయి

**నవతెలంగాణ-తిమ్మాపూర్:** ఈనెల 5వ తేదీన హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో దళిత రత్న అవార్డు పొందిన మొగిలిపాలెం గ్రామానికి చెందిన ఎల్కపెల్లి కుమార్, కరీంనగర్ మండలానికి చెందిన గాలిపెల్లి వెంకన్న, పర్లపల్లి గ్రామానికి చెందిన తాటి పెల్లి బాబును మంగళవారం మహాత్మా నగర్ గ్రామంలో గల నియోజకవర్గ కార్యాలయంలో మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

## ఆస్పత్రి అనుమతి రద్దు చేయాలి

### కార్పొరేటర్ మెండి శ్రీలత



**నవతెలంగాణ-కరీంనగర్:** నగరంలోని 44వ డివిజన్ పరిధిలో మంచిర్యాల చౌరస్తా వద్ద సివిల్ హాస్పిటల్ గేట్ ఎదుట సెట్ బ్యాక్ లేకుండా నెలకొల్పిన ప్రయివేటు ఆస్పత్రి అనుమతి రద్దు చేయాలని, నిత్యం కృత్రిమంగా ట్రాఫిక్ కొరత సృష్టిస్తున్న భవన యజమానిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సెట్ బ్యాక్ లేకుండా నడిరోడ్డు మీద హాస్పిటల్ కు పర్మిషన్ ఇచ్చారని, రోడ్డుపై జనరేటర్, చౌరస్తాలో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టర్, పోలీసు కమిషనర్, మున్సిపల్ కమిషనర్, డీఎంహెచ్‌వో లకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని, లేకపోతే స్థానికులను కలుపుకొని ధర్నాలు చేస్తామని హెచ్చరించారు.

## రవాణా సంక్షేమ బోర్డు ఏర్పాటుపై ప్రకటన చేయాలి

### డ్రైవర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

### పబ్లిక్, ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి



**నవతెలంగాణ-కరీంనగర్:** రవాణా సంక్షేమ బోర్డు ఏర్పాటుపై ప్రభుత్వం ప్రకటన చేయాలని, డ్రైవర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని పబ్లిక్, ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి అన్నారు. కరీంనగర్ లోని కోతిరాంపూర్ ముకుందలాల్ మిశ్రా భవన్ సీఐటీయూ కార్యాలయంలో కరీంనగర్ జిల్లా పబ్లిక్, ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పున్నం రవి మాట్లాడుతూ..రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డుని వెంటనే ఏర్పాటు చేయాలని, డ్రైవర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం మోటార్ వెహికల్ యాక్ట్ 2019ని తెచ్చి అగ్రిగేటర్స్ పేరుతో రవాణా రంగాన్ని మల్టీ నేషనల్ కంపెనీస్ కి అప్పగించే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. సింగిల్ ఓనర్ కం డ్రైవర్స్ గా ఉండే వారు తట్టుకోలేని విధంగా భారాలు వేసి వేధిస్తున్నారని విమర్శించారు. గ్రీన్ టాక్సీ, టోల్ గేట్లు ధరలు, పెట్రోల్ డీజిల్, గ్యాస్ ధరలు పెంచుతూ ఆదాయాలను కొల్లగొడుతున్నారని, ఈ భారాలకు వ్యతిరేకంగా డ్రైవర్స్ పోరాడాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగాన్ని ఆదాయ వనరుగా చూస్తూ భారాలు వేయడం, స్పెషల్ డ్రైవ్స్ పేరుతో ఛాలన్ వేయడానికి చూపిస్తున్న శ్రద్ధ వారి జీవితాల్లో వెలుగులు నింపే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు పుల్లెల మల్లయ్య, దుర్శేటి శశి కుమార్, తాడిచెర్ల తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షులు పులిపాక ప్రసాద్, ఎండీ ఆరిఫ్, వీరగోని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మహనీయులు జ్యోతిరావు భా పూలే ఆశయాలను కొనసాగిద్దాం

### సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వాసుదేవ రెడ్డి, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేదారి



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వాసుదేవ రెడ్డి

**నవతెలంగాణ-కరీంనగర్:** మహనీయులు జ్యోతిరావు భాపూలే ఆశయాలను కొనసాగిద్దామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వాసుదేవ రెడ్డి, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేదారి అన్నారు. మంగళవారం నగరంలోని స్థానిక బైపాస్ రోడ్డు వద్ద సీపీఐ(ఎం), సీపీఐ వామపక్షాల ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతి రావుబా పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహనీయులు జ్యోతిబాపూలే ఆనాటి కాలంలోనే మహిళల విద్యకు ప్రాధాన్యత ఇచ్చారని, అంటరానితనం, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడని, గొప్ప సంఘసంస్కర్త అని కొనియాడారు. మహిళలకు చదువుకునే హక్కు, ఓటు హక్కు, సమానత్వం కోసం పోరాడిన ఉన్నతమైన వ్యక్తి జ్యోతిబా పూలే అని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. భారతదేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజ్యాంగం, కార్మిక హక్కులు ప్రమాదంలో పడ్డాయని, భారత రాజ్యాంగానికి తూట్లు పొడిచి కులాల మధ్య, మతాల మధ్య చిచ్చుపెడుతూ, మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుందని అన్నారు. బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మహాత్మా జ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం), సీపీఐ నగర కార్యదర్శులు గుడికందుల సత్యం, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు ఎడ్ల రమేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భోయిని అశోక్, నగర సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు, సీపీఐ(ఎం), సీపీఐ నాయకులు పుల్లెల మల్లయ్య, బుచ్చన్న యాదవ్, కాల్వ సురేష్ యాదవ్, హేమంత్, జెవీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక విప్లవకారుడు పూలే

### సీఐటీయూ ఘన నివాళి



**నవతెలంగాణ-కరీంనగర్:** కరీంనగర్‌లోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మహాత్మా జ్యోతి భాపులే జయంతి వేడుకలు ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ మాట్లాడుతూ.. సమాజం సృష్టించిన అనేక అవరోధాల్ని, అడ్డంకుల్ని దాటుకుంటూ పోరాటాలు కొనసాగించిన జ్యోతి రావ్ పూలే, సావిత్రి బాయ్ పూలే, అంబేద్కర్, పెరియార్ లాంటి సామాజిక విప్లవకారులు చేసిన పోరాటాల నుంచి మనం స్ఫూర్తి పొందాల్సింది, నేర్చుకోవాల్సింది చాలా ఉందన్నారు. రాబోయే రోజుల్లో సీఐటీయూ శ్రేణులు, అభిమానులు జ్యోతి భాపులే ఆశయాలు కార్మిక వర్గంలో తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు మిల్కూరి వాసుదేవ రెడ్డి, జీఎంపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాల్వ సురేష్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రవి, నగర కన్వీనర్ పుల్లెల మల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు పులిపాక ప్రసాద్, విరగొని శ్రీనివాస్, నాయకులు శశి కుమార్, అరిఫ్, మల్లేశం, తాట్ల తిరుపతి, విజయేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రవీంద్రభారతిలో పూలే జయంతి వేడుకలు

**నవతెలంగాణ-కరీంనగర్:** మహాత్మా జ్యోతిభాపూలే ఆశయాలను ఆచరణాత్మకంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. 197వ జయంతి వేడుకలను హైదరాబాద్ రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంత్రి గంగుల కమలాకర్ అధ్యక్షతన నిర్వహించిన జయంతి వేడుకల కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి శ్రీనివాస్ గౌడ్, శాసనమండలి డిప్యూటీ ఛైర్మెన్ బండాప్రకాష్, బీసీ కమిషన్ ఛైర్మెన్ వకుళాభరణం క్రుష్ణమోహన్ రావు, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, బీసీ సంఘాల నేతలు, పూలే అభిమానులు పెద్దఎత్తున పాల్గొని మహాత్మా జ్యోతిభాపూలేకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. సూర్య చంద్రులున్నంత వరకూ మహాత్మా జ్యోతిభాపూలే, సావిత్రీబాయి పూలేల స్ఫూర్తి వెల్లివిరుస్తుందన్నారు. ఆ గొప్పవ్యక్తుల ఆశయ సాధనలో ప్రతి ఒక్కరు కలిసి రావాలన్నారు. బాబాసాహెబ్ విగ్రహం మాదిరే మహాత్మా జ్యోతిభాపూలే విగ్రహ ఏర్పాటుకు మంత్రులందరం కలిసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీ గణన లేకుండా, మంత్రిత్వ శాఖ ఇవ్వకుండా, రిజర్వేషన్లు అమలు చేయకుండా ఉన్న బీజేపీపై ఉమ్మడిగా పోరాటం చేయాలన్నారు. శాసన మండలి డిప్యూటీ ఛైర్మెన్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. పూలే కలగన్న కులరహిత సమాజం దిశగా బీసీలంతా కలిసికట్టుగా పని చేయాలన్నారు. బీసీ కమిషన్ ఛైర్మెన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావ్, బీసీ కమిషన్ సభ్యుడు కిషోర్ గౌడ్, ఉపేంద్ర మాట్లాడుతూ.. మహాత్మా పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ ఛైర్మెన్ బండా ప్రకాష్, ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీసీ కమిషన్ ఛైర్మెన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావ్, సభ్యులు ఉపేంద్ర, కిషోర్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పూలే జయంతి కమిటీ ఛైర్మెన్లు, వైస్ ఛైర్మెన్లు, కన్వీనర్లు, కో కన్వీనర్లు, బీసీ సంఘాల నేతలు, అభిమానులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలు



విగ్రహానికి పూలమాల వేస్తున్న వినోద్ కుమార్

**నవతెలంగాణ-కరీంనగర్:** మహాత్మా జ్యోతిబాపూలే ఆశయ సాధనకు యువత కృషి చేయాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. మహత్మ జ్యోతిబాపూలే 197వ జయంతిని పురస్కరించుకొని మంగళ వారం శాతవాహన విశ్వవిద్యాలయం చౌరస్తా వద్ద మహత్మ జ్యోతిబాపూలే విగ్రహనికి పూలమాలలు వేసి జోహర్లనర్పించారు. అనంతరం వినోద్ కుమార్ మాట్లాడుతూ.. సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘసేవకుడిగా సేవలందించిన మహాత్మా జ్యోతీబాపూలే గురించి నేటి తరం యువత తెలుసుకోవడం మాత్రమే కాదు, ఆయన ఆశయాలను ఆకలింపు చేసుకోవాల్సిన అవసరం కూడా ఎంతైన ఉందన్నారు. కలెక్టర్ ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ..బడుగు, బలహీన వర్గాలకు అందించిన సేవలను గుర్తించి, మహనీయుల జయంతి వేడుకలను అధికారికంగా ఘనంగా నిర్వహించే ఎకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ సునీల్ రావు, జిల్లా పరిషత్ చైర్మన్ కనుమల్ల విజయ, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ బండ శ్రీనివాస్, పోలిస్ కమిషనర్ సుబ్బారాయుడు, శాతవాహన విశ్వవిద్యాయం వైస్ చాన్సలర్ మల్లేషం , సుడా చైర్మెన్ జీవీ రామకష్ణారావు, గ్రంథాలయ చైర్మెన్ పోన్నం అనిల్ కుమార్, డిప్యూటి మెయర్ చల్లస్వరూపారాణి, అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్, కార్పొరేటర్ బాగ్యలక్ష్మీ మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**మేయర్ సునీల్ రావు ఆధ్వర్యంలో...**



అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన, మహిళోద్ధారణకు మహత్మ జ్యోతి బాపూలే కృషి చేశారని నగర మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థలో జ్యోతిబా పూలే జయంతి వేడుకలను మేయర్ సునీల్ రావు, కమిషనర్ సేవా ఇస్లావత్‌తో పాటు పలువురు కార్పోరేటర్లు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నగరంలోని కోతిరాంపూర్, శాతవాహన యూనివర్సిటీ వద్ద ఉన్న పూలే విగ్రహాలకు మేయర్, కమిషనర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించి, వారు చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు కంసాల శ్రీనివాస్, గంట కళ్యాణీ శ్రీనివాస్, అదనపు కమిషనర్ స్వరూప రాణీ, డిప్యూటీ కమిషనర్ త్రియంభ కేశ్వర్, ఎస్ఈ నాగమల్లేశ్వర్ రావు, ఈఈ కిష్టయ్య, డీఈ ఓం ప్రకాష్, సానిటేషన్ సూపర్ వైజర్ రాజమనోహార్, ఆర్వో ఆంజనేయులు, వెటర్నరీ అధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

**చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో ...**



విగ్రహానికి పూలమాల వేస్తున్న చల్ల హరిశంకర్

మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. శాతవాహన యూనివర్సిటీ ఎదుట పూలే విగ్రహానికి బీఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

**క్రితిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో...**



కరీంనగర్ పట్టణంలోని క్రితిక్ ఫౌండేషన్ జిల్లా కమిటీ ఇన్‌చార్జి మహేశ్వరి ఆధ్వర్యంలో మహత్మ జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య నాయకులు రవికుమార్, పలు స్వచ్ఛంద సేవ నాయకులు ఉదయ్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘు, బాలకృష్ణ, పోత్తూరు శేఖర్, సాయి, మణికంఠ, రుచిత తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా గ్రంథాలయంలో...**

మహాత్మా జ్యోతి రావు పూలే 197వ జయంతి సందర్భంగా జిల్లా గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ పూలమాల వేశారు. వివిధ ఉద్యోగాల కోసం సంసిద్ధం అవుతున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## విద్యుత్ కంచెను ఏర్పాటు చేసిన ఏఈ విశ్వతేజ

**నవతెలంగాణ కథనానికి స్పందన**

**నవతెలంగాణ-మేడిపల్లి:**
మండలంలోని కాచారం గ్రామంలో కాచారం నుండి రంగాపూర్ వెళ్ళ మార్గమధ్యలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రిడ్జి పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. 'నవ తెలంగాణ' దినపత్రిలో ప్రమాదపు అంచున విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అనే శీర్షికతో కథనం ప్రచురణ కాగా... విద్యుత్ ఏఈ విశ్వతేజ వెంటనే స్పందించారు. గ్రామ సర్పంచ్ సురేష్, ఉప సర్పంచ్ సాయి కృష్ణారావ్ ఆధ్వర్యంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెను ఏర్పాటు చేశారు. సమస్యను వెలుగులోకి తీసుకొచ్చిన నవతెలంగాణ సిబ్బంది, స్పందించి పరిష్కరించిన అధికారుల తీరుపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.


నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె

# మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

**నవతెలంగాణ-కరీంనగర్ క్రైం:**
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్‌లో జరిగిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. 120 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలను నిర్వహించగా 4 వేలకు పైగా మంది యువతీ యువకులు హాజరయ్యారు. ప్రణాళిక సంఘ ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు పోలీస్ శాఖ జాబ్ మేళాను నిర్వహించడం ఆహ్వానించదగిన పరిణామమన్నారు. ట్రాన్స్ జెండర్లకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం అభినందనీయమని కొనియాడారు. జిల్లా కలెక్టర్ ఆర్వి కర్ణన్ మాట్లాడుతూ ఉద్యోగ అవకాశాలకోసం నిరుద్యోగ యువత వారధి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. యువతను సన్మార్గంలో పయనింపజేసేందుకు మరిన్ని కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సీపీ ఎల్. సుబ్బరాయుడు తెలిపారు.

**10మంది టాన్స్ జెండర్లకు ఉద్యోగ అవకాశం:**
ఈ జాబ్ మేళాలో 10మంది ట్రాన్స్ జెండర్లకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు. అమెజాన్ కంపెనీలో నెలకు 30వేల రూపాయల వేతనంతో వారు ఉద్యోగ అవకాశాలను పొందారు. ఉద్యోగాలు పొందిన ట్రాన్స్ జెండర్లకు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బి.వినోద్ కుమార్ నియామక పత్రాలను అందజేశారు.


మేళాకు హాజరైన నిరుద్యోగులు

**సీపీఆర్ విధానంపై శిక్షణ:**
జాబ్ మేళా సందర్భంగా స్థానిక రెనే ఆసుపత్రి నిర్వాహకులు సిపిఆర్ విధానంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు బంగారి స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు ఎస్. శ్రీనివాస్ (శాంతిభద్రతలు), జి చంద్రమోహన్ (పరిపాలన), ఏసిపిలు తుల శ్రీనివాసరావు, సి.ప్రతాప్ తో పాటు పలువురు పోలీసు అధికారులు, వైద్యులు, వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉద్యోగం చేస్తావా.. సస్పండ్ ఐతవా

**వీణవంక ఏవోపై ఎమ్మెల్సీ ఆగ్రహం**


ఏవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విప్ కౌశిక్ రెడ్డి

**నవతెలంగాణ-వీణవంక:** రోజు ఆఫీస్‌కు వస్తున్నారా.. లేదా.. ఉద్యోగం చేస్తావా.. సస్పెండ్ ఐతవా అంటూ వీణవంక ఏవో గణేష్‌పై ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో నూతన బోరు వేసేందుకు నిర్ణయం తీసుకోగా.. దాన్ని ప్రారంభించేందుకు విప్ కౌశిక్ రెడ్డి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్దకు వచ్చాడు. రైతు వేదిక మొత్తం అపరిశుభ్రంగా ఉండడంతో దాన్ని పరిశీలించిన ఆయన ఏవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు రోజూ ఆఫీస్‌కు వస్తే ఇలా ఎందుకు ఉంటుందని ప్రశ్నించారు. ఇటీవల కురిసిన అకాల వర్షం, వడగండ్ల వానకు నష్టపోయిన పలువురు రైతులు అధికారులు సర్వే చేయలేదని కౌశిక్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే పూర్తి స్థాయిలో చేయాలని, నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం అందేలా చూడాలని ఏవో గణేష్‌ను ఆదేశించారు.

## టీ సేవ్ లోగో ఆవిష్కరణ

**నవతెలంగాణ-మానకొండూర్:**
వైఎస్సార్ టిపి ఆధ్వర్యంలో రూపొందించిన టి సేవ్ లోగోను ఆ పార్టీ మానకొండూర్ నియోజక వర్గ ఇంచార్జి దుబ్బ నీరజ పార్టీ నాయకులతో కలిసి మంగళ వారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .. సీఎం కేసీఆర్ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటూ అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీలతో వారి జీవితాలు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కల్పించాలని, సీఆర్ విశాల్ కమిటీ ప్రకారం ఒక లక్ష 91 ఉద్యోగాలు భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. పేపర్ లీకేజీ నిందుతలను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు మండల అధ్యక్షులు గోపు మహిపాల్ రెడ్డి, ఇల్లంతకుంట మండల అధ్యక్షురాలు మచ్చ ప్రేమలత, భాగ్యలక్ష్మి, సాగర్, ఉట్ల బాపురెడ్డి నారాయణ, శ్రావణ్, శ్రీనివాస్, సంపత్, రాజు పాల్గొన్నారు.


లోగో అవిష్కరిస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

**నవతెలంగాణ-మానకొండూర్:**
మండలంలోని చెంజర్ల సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో నేడు మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని చెంజర్ల ఏఈ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్లో మరమ్మతులు చేపట్టనున్నడంతో ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని.. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## గంజాయి అక్రమ రవాణా నిందితునిపై పీడీ యాక్ట్ అమలు

**నవతెలంగాణ-కరీంనగర్ క్రైం:**
కొత్తపల్లి మండలం రేకుర్తి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ షేక్ ఉస్మాన్ పై కరీంనగర్ పోలీసులు పీడీ యాక్ట్ అమలు చేశారు. షేక్ ఉస్మాన్ కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో యువకులకు, అమాయకులకు మత్తు పదార్థమైన నిషేధిత గంజాయి అమ్మటం, ప్రమాదకరమైన కార్యకలాపాలు చేస్తూ యువత, అమాయకుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు నిందితునికి నిర్బంద ఉత్తర్వులు అందజేసి, చెర్లపల్లి సెంట్రల్ జైలుకు పంపారు. పీడీ యాక్ట్ అమలు చేయడంలో కీలకపాత్ర పోషించిన కరీంనగర్ రూరల్ సీఐ పి. విగ్యాన్ రావు, పి.డి.సెల్ ఇంచార్జి టి. పండరీలను పోలీస్ కమిషనర్ అభినందించారు.



## గొర్రెల పంపిణీపై అవగాహన సదస్సు విజయవంతం చేయాలి

**అఖిల భారత యాదవ మహాసభ మండల అధ్యక్షుడు తిరుపతి**


కరపత్రం ఆవిష్కరిస్తున్న తిరుపతి

**నవతెలంగాణ-పెగడపల్లి:** పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా రెండవ విడత గొర్రెల పంపిణీ పథకంపై బుధవారం నిర్వహిస్తున్న అవగాహన సదస్సును విజయవంతం చేయాలని అఖిల భారత యాదవ మహాసభ మండల అధ్యక్షుడు ఆదినవేని తిరుపతి అన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలో గొర్రెల పంపిణీ పథకం అవగాహన సదస్సు కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాల యాదవ కురుమ సోదరులు, గొర్రెల పెంపకం దారులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నేతుట్ల రాజేష్ యాదవ్, పాశం తిరుపతి యాదవ్ , పలుమారు విజయ్ యాదవ్, పశువైద్య అధికారి విక్రమ్ పాల్గొన్నారు.

## వ్యవసాయ పరికరాల అద్దె కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**నవతెలంగాణ-జగిత్యాల: :**
సారంగాపూర్ మండల కేంద్రంలో రైతు వేదిక వద్ద సెర్ప్ ఆధ్వర్యంలో వ్యవసాయ పరికరాల అద్దె కేంద్రాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ దావా వసంత సురేష్, సర్పంచ్, మండల పార్టీ అధ్యక్షులు గుర్రాల రాజేందర్ రెడ్డి, జడ్పీటీసీ మనోహర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నరసింహా రెడ్డి, వైస్ ఎంపీపీ సురేందర్, ఎంపీటీసీల ఫోరం సుధాకర్ రావు, మాజీ సర్పంచ్ నారాయణ రావు, మాజీ ఎంపీటీసీ నరసింహా రెడ్డి, నాయకులు ప్రేమానందం, లక్ష్మారెడ్డి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ముంతాజ్ బేగం, ఏపీఎం రాజు, సీఏలు, వీవోలు, మహిళలు పాల్గొన్నారు.

## స్టాటిస్టిక్స్‌లో అంతర్జాతీయ పురస్కార గ్రహీత సీఆర్ రావుకు అభినందన సభ

**నవతెలంగాణ-జగిత్యాల:**
ప్రపంచ ప్రఖ్యాత గణాంక శాస్త్ర నిపుణుడయిన సీఆర్ రావుకు నోబెల్ బహుమతితో సమానమైన అంతర్జాతీయ స్టాటిస్టిక్స్ ఫౌండేషన్ వారు అత్యున్నత పురస్కారాన్ని ప్రకటించిన సందర్భంగా నలంద డిగ్రీ కళాశాల స్టాటిస్టిక్స్, డాటా సైన్స్ విభాగం విద్యార్థులు ప్రత్యేక అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేష్ మాట్లాడుతూ... స్టాటిస్టిక్స్ సబ్జెక్టును చదువుతున్న విద్యార్థులంతా ఉన్నత భవిష్యత్తును పొందాలని సూచించారు. 102 సంవత్సరాల వయస్సులో కూడా విజ్ఞాన ఆర్జన చేస్తూ విజ్ఞానాన్ని పంచుతున్న సీఆర్ రావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.సురేష్, మ్యాథమెటిక్స్ డిపార్ట్మెంట్ హెడ్ మల్లికార్జున్, స్టాటిస్టిక్స్ లెక్చరర్ ప్రేమ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముంపు చెరువు, కుంటల్లో చేపలు పట్టనిస్తలేరు

- ముంపు ప్రాంతమైన డ్యాంలో 18 ఎకరాలు కొన్నాం
- ముంపు ప్రాంతాలను కబ్జా చేసి పంటలు పండిస్తున్న అక్రమదారులపై ఎస్ఆర్ ఎస్పీ అధికారులు చర్యలు తీసుకోవాలి
- మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షులు గట్టు నాగయ్య



**నవతెలంగాణ-గన్నేరువరం:**
హన్మాజిపల్లి శివారులోని ముంపు ప్రాంతమైన మానేరు డ్యాంలో 2014 నుంచి బరుకోని కుంట, సంగెం చెరువు, పులు సోని కుంటలతో 80 మత్స్య కార్మిక కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షులు గట్టు నాగయ్య మంగళవారం అన్నారు. ఇన్ని రోజులు డ్యాంలో నిండుగా నీరు ఉన్నాయని...ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఈ కుంటలు, చెరువుల భూములు తేలాయని తెలిపారు. తేలిన భూముల్లో తీగ కట్టడానికి వెళ్లిన సంఘ సభ్యులతో గొడవలకు దిగి చేపలు పట్టవద్దని పిప్పళ్ళ కనకయ్య, అతని కుమారులు పిప్పల ఆశయ్య, పిప్పల్ల ఊశయ్య గొడవలకు దిగుతున్నారని.. మా చెరువులో అక్రమంగా చేపలు పట్టడానికి వచ్చారని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ చెరువు, కుంటల పక్కకు సాగు చేసి పంటలు పండించుకుంటున్నారు. 18 ఎకరాలు కొన్నాయని, ఇందులో ఎవరు చేపలు పట్టవద్దని గొడవలకు దిగుతున్న కనుకయ్య, అతని కుమారులపై చట్టరీత్యా చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని ఎస్సై, తహసీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సంఘం ఉపాధ్యక్షులు శ్రీశైలం, శ్రీనివాస్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలగాన్ని చూసి బిత్తరపోతున్న బీఆర్ఎస్ నాయకులు

- ఎమ్మెల్యే, పోలీసుల ఒత్తిళ్లకు భయపడం
- ఎన్ని అడ్డంకులు సృష్టించిన సభ పెట్టి తీరుతాం..
- డీసీసీ అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ

**నవతెలంగాణ-గన్నేరువరం:**
మండలానికి చెందిన 300 మంది యువత కాంగ్రెస్‌లోకి వస్తుండడం జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని డీసీసీ అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. అందుకే బుధవారం మండల కేంద్రంలో జరిగే కాంగ్రెస్ సభకు పర్మిషన్ ఇవ్వడం లేదని తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీకి ఒక న్యాయం.. ప్రతి పక్షాలకు ఒక న్యాయం ఉంటుందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ బలగాన్ని చూసి బీఆర్ఎస్ నాయకులు బిత్తర పోతున్నారని ఎద్దేవా చేశారు. పోలీసులు ఎన్ని అడ్డంకులు సృష్టించిన సభ పెట్టి తీరుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ అనంత రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కొమ్మర రవీందర్ రెడ్డి, మండల అధ్యక్షులు ముస్కు ఉపేందర్ రెడ్డి, మార్గం మల్లేశం, మల్లారెడ్డి, గంప మహేష్, కొలుపుల రవీందర్, మాతంగి అనిల్, దేశరాజు అనిల్, యువకులు పాల్గొన్నారు.

## 115 ఏండ్ల వృద్ధురాలు మృతి

**వృద్ధురాలికి 6గురు కూతుళ్లు,1 కొడుకు, 50 మంది మనుమలు, మనుమరాళ్లు**

**నవతెలంగాణ-గన్నేరువరం:**
కాసింపేట గ్రామానికి చెందిన పద్మశాలి కులస్తురాలు గుర్రం నరసమ్మ (115) మృతి చెందింది. మంగళవారం మధ్యాహ్నం మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న స్థానిక సర్పంచ్ గంప మల్లేశ్వరి-వెంకన్న, ఎంపీటీసీ ఎలేటి స్వప్న చంద్రారెడ్డి, ఉప సర్పంచ్ బద్దం సంపత్ రెడ్డి, గ్రామ పెద్దలు, పాలకవర్గ సభ్యులు వృద్ధురాలి మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.


మృతురాలు గుర్రం నర్సమ్మ

## 'పాడి' చేతుల మీదుగా బోరువెల్ ప్రారంభం


బోరును ప్రారంభిస్తున్న విప్ కౌశిక్ రెడ్డి

**నవతెలంగాణ-వీణవంక:**
మండలంలోని రైతు వేదిక వద్ద ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో వేయనున్న బోర్ వెల్‌ను ప్రభుత్వ విప్ పాడి కౌశిక్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రైతులకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వర్తించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతి రెడ్డి, రైతు బంధు సమితి మండల కన్వీనర్ నరహరి తిరుపతి రెడ్డి, వైస్ ఎంపీపీ రాయిశెట్టి లత, రైతుబంధు సమితి గ్రామ కన్వీనర్ రాయిశెట్టి శ్రీనివాస్, సర్పంచ్ నీల కుమారస్వామి, నాయకులు పున్నం చందర్, ఓరెం మధు పాల్గొన్నారు.

## కొత్తపల్లిలో పిల్లల పెరుగుదల పర్యవేక్షణ డే

**మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు**


గరిమా అగర్వాల్‌తో మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు

**నవతెలంగాణ-కొత్తపల్లి:**
ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కరీంనగర్ అర్బన్ ఆధ్వర్యంలో మండలంలోని కొత్తపల్లి సెక్టార్, కొత్తపల్లి మున్సిపల్ పరిధిలో అన్ని కొత్తపల్లి అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతి మంగళవారం నిర్వహించే పిల్లల పెరుగుదల పర్యవేక్షణ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ హాజరై మాట్లాడుతూ... గర్భిణులు, బాలింతలు, పిల్లల బరువులు, ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. ఆరోగ్య సూత్రాల గురించిన హెల్త్ డైరీ ఆప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. డీఎంహెచ్‌వో సాజిదా మాట్లాడుతూ.. గర్భిణులు స్వచ్ఛందంగా ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కట్ల వేణుమాధవ్, కౌన్సిలర్లు వాసాల రమేష్, మానుపాటి వేణుగోపాల్, గున్నాల విజయ రమేష్, గందు రాంబాబు, చింతల సత్యనారాయణ రెడ్డి, నాయకులు రమేష్, ఎస్‌కే బాబా, స్వర్గం నరసయ్య, వేముల శేఖర్, జేరిపోతుల శ్రీకాంత్, ఎమ్మార్వో వెంకట్ రెడ్డి, హెల్త్ ఆఫసర్ వంశీ, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్ కొత్తపల్లి పట్టణంలోని దోబీ ఘాట్, నర్సరీలు, వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ను, మెడికల్ కాలేజీ నిర్మాణం పనులను పరిశీలించారు.

## కంటి వెలుగు శిబిరాన్ని తనిఖీ చేసిన ఆర్డీవో వినోద్

**నవతెలంగాణ-మేడిపల్లి:**
మేడిపెల్లి మండలంలోని కొండాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆర్డీవో వినోద్ కుమార్ సందర్శించారు. గ్రామంలో 96 శాతం ప్రజలు పాల్గొనడంతో వైద్యురాలు వనజను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అభిలాష్, వార్డు సభ్యులు, హెల్త్ సిబ్బంది పద్మలత, సత్యవతి, ఊర్మిల, రాధా, వీఓఏలు సత్యం రావు, మమత, త్రివేణి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


కంటి వెలుగు శిబిరాన్ని తనిఖీ చేసిన ఆర్డిఓ వినోద్ కుమార్

## ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం

**మెట్‌పల్లి సీఐ లక్ష్మీ నారాయణ**

**నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం:**
ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని మెట్‌పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం లోని కోజన్ కొత్తూరు గ్రామంలో గ్రామ సర్పంచ్. గ్రామ అభివృద్ధి కమిటీ వారి సహకారంతో గ్రామంలో ఆరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెట్పల్లి సిఐ కె లక్ష్మీనారాయణ వచ్చి సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో నేర పరిశోధనలో సీసీ కెమెరాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని అన్నారు. గ్రామంలో మరిన్ని సీసీ కెమెరాలు.. అలాగే మండలంలో మిగతా గ్రామాల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీఐ సూచించారు. కార్యక్రమం అనంతరం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి సహకరించిన గ్రామ సర్పంచ్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులను సీఐ అభినందించడంతో పాటు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఉమాసాగర్ ఏఎస్ఐ రాములు, కానిస్టేబుల్ సాదు నాయక్ పాల్గొన్నారు.


సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న సీఐ

## సమన్వయంతో పని చేసి సభ సక్సెస్‌కు దోహదపడాలి

**అధికారులకు ఎమ్మెల్యే సుంకె దిశా నిర్దేశం**


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

**నవతెలంగాణ-గంగాధర :** బీఆర్ఎస్ నేతలు, ప్రజా ప్రతినిధులతో అధికారులు సమన్వయంతో పని చేసి అంబేద్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో జరిగే భారీ బహిరంగ సభ సక్సెస్‌కు దోహదపడాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గంగాధర మండలం బూర్గుపల్లి గ్రామంలోని తన నివాస కార్యాలయంలో మంగళవారం చొప్పదండి నియోజక వర్గంలోని చొప్పదండి, గంగాధర, రామడుగు, బోయినపల్లి, కొడిమ్యాల, మల్యాల మండలాల్లోని సీఐలు, ఎస్సైలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో ఏర్పాటు చేసి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో ఏప్రిల్ 14న నిర్వహించే భారీ బహిరంగ సభకు సక్సెస్‌కు అధికారికంగా తీసుకోవల్సిన జాగ్రత్తలు, పనులు, ఏర్పాట్లను చూడాలని సూచించారు. 14న ఉదయం 6 గంటలకు ప్రతి గ్రామంలో పెట్టిన బస్సుల్లో ప్రజలు, పార్టీ శ్రేణులు హైదరాబాద్ తరలివెళ్లేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, సీఐలు రవీందర్, రమణమూర్తి, ఆరు మండలాల ఎస్సైలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## అధికారులకు ఆహ్వానం

**నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం:** ఈనెల 12న ఇబ్రహీంపట్నం మండలంలోని తిమ్మాపూర్ తండాలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కోసం అధికారులను అంబేద్కర్ కమిటీ సభ్యులు మంగళ వారం కార్యాలయాలకు వెళ్లి ఆహ్వానించారు. అధికారులతో పాటు ఎమ్మెల్యే తనయుడు కల్వకుంట్ల సంజయ్ ని కూడా ఆహ్వానించారు. మండలంలో ఎస్ఐ ఉమాసాగర్. ఎంపీఓ కృపాకర్ ఎంపీడీవో ప్రభుతో పాటు పలువురు అధికారులకు అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు రావాలని ఆహ్వానించారు. ఆహ్వానించిన వారిలో ఉప సర్పంచ్ బట్టు శేఖర్, నాయకులు తలారి ఆనంద్, విజయ్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కమిటీ సభ్యులు

## ముగిసిన 'పది' పరీక్షలు

**నవతెలంగాణ-జగిత్యాల :**
జగిత్యాల జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. మంగళవారం సాంఘిక శాస్త్రం పరీక్ష ఉండగా.. 68 రెగ్యులర్ పరీక్ష కేంద్రాల్లో మొత్తం 11175 విద్యార్థులకు గాను 11153 విద్యార్థులు హాజరయ్యారు. 22 మంది విద్యార్థులు గైర్హాజయ్యారు. రెగ్యులర్ విద్యార్థుల హాజరు 99.80 శాతం, సప్లమెంటరీ విద్యార్థులకు సంబంధించిన పరీక్ష కేంద్రాల్లో 07 విద్యార్థులకు గాను 03 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరి హాజరు 42.85 శాతం ఉంది. రాష్ట్ర పరిశీలకులు 4 పరీక్షా కేంద్రాలను, జిల్లా విద్యాధికారి 03 పరీక్షా కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ 15 పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

## సెర్ప్ కార్యక్రమాల్లో జిల్లాను ముందంజలో ఉంచాలి

**జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కుందారపు లక్ష్మీనారాయణ**

**నవతెలంగాణ-జగిత్యాల :**
సెర్ప్ కార్యక్రమాల్లో జగిత్యాల జిల్లాని ముందంజలో ఉంచాలని జిల్లా గ్రామీణాభివద్ధి శాఖ అధికారి కుందారపు లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో సెర్ప్ ఏపీఎంలు, సీసీలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన బ్యాంక్ లింకేజీ పూర్తి చేసే విధంగా కృషి చేయాలని, లక్పతి దిది ఆప్ లో సభ్యుల వివరాలు 100 శాతం పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ప్రాజెక్టు సంచాలకులు ఎస్.సుదీర్,డి.పి.యం.లు మల్లేశం, మాణిక్ రెడ్డి, వనజ, అన్ని మండలాల ఏపియం లు,డి.యం.జి.లు,సి.సి.లు, సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**నవతెలంగాణ-శంకరపట్నం:**
మండల పరిధిలోని రాజాపూర్ గ్రామంలో మంగళవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆవిష్కరించారు. అనంతరం ఎరడపల్లి, అర్కండ్ల, ధర్మారం, మొలంగూర్, కేశవపట్నం, తాడికల్, అంబాల్ పూర్, ఇప్పలపల్లి గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, శాదిముభారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ధర్మారం, రాజపూర్, కేశవపట్నం గ్రామాల్లో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కేశవపట్నం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న అరుంధతి కళ్యాణ మండపం నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపీపీ పులికోట రమేష్, గద్దపాక సహకార సంఘం చైర్మన్ గుర్రాల తిరుపతి రెడ్డి, చౌడమల్ల వీరస్వామి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట మహిపాల్, రాజాపూర్ గ్రామ సర్పంచ్ పిన్ రెడ్డి వసంత-నరసింహా రెడ్డి, ఎంపీటీసీ మాతంగి లక్ష్మి-లక్ష్మయ్య, సర్పంచ్ దాసరపు భద్రయ్య, కొండ్ర రాజయ్య, ముదిరాజు సంఘం జిల్లా నాయకురాలు పల్లె స్వరూప, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

## మృతుడి కుటుంబానికి సుద్దాల పరామర్శ

**నవతెలంగాణ-గంగాధర :** గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో ఇటీవల మరణించిన బీజేపీ సీనియర్ కార్యకర్త ద్యావ అంజయ్య కుటుంబ సభ్యులను మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, దళిత సంఘాల రాష్ట్ర నాయకుడు మ్యాక లక్ష్మణ్ పరామర్శించారు. అంజయ్య మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్న నాయకులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వీరి వెంట బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రవన్‌కుమార్, మండలాధ్యక్షుడు కోల అశోక్, నాయకులు తూము నారాయణ, ప్రశాంత్, మధు, బల్వార్ సింగ్, మహసోమర్, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




సిరిసిల్ల : మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్ అధికారులు ప్రజాప్రతినిధులు



గోదావరిఖని : నివాళి అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

# మహాత్మా జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

**నవతెలంగాణ - సిరిసిల్ల**

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషిచేసిన సామాజిక దార్శనికుడు జ్యోతిరావు పూలే అని.. ఆయన జీవితం మనందరికీ స్పూర్తి దాయకం అని సిరిసిల్ల జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. మంగళవారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను సిరిసిల్ల పట్టణంలోని కలెక్టరేట్‌లో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, రాష్ట్ర పవర్‌లూం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్‌తో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, వారి విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది పూలే అంటూ వారి సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, జిల్లా బిసి అభివృద్ధి అధికారి మోహన్‌రావు, జిల్లా రవాణా అధికారి కొండల్‌రావు, జిల్లా కార్మిక అధికారి రఫీ, డీపీఆర్‌ఓ మామిండ్ల దశరథం, బిసి సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ - పెద్దపల్లి**

చదువుతోనే జీవితంలో మార్పు సాధ్యమని విద్య ప్రాముఖ్యతను చాటిచెప్పిన మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే అని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మ జ్యోతిబా పూలే 197వ జయంతి వేడుకల్లో పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు వి.లక్ష్మీనారాయణ, కుమార్ దీపక్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి, జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, జడ్పీటీసిలు కందుల సంధ్యారాణి, లక్ష్మణ్, గంట రాములు, బిఎస్‌పి పెద్దపల్లి ఇన్‌చార్జి దాసరి ఉష, జిల్లా టిజీఓ అధ్యక్షుడు, రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ తూము రవీందర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ - ముస్తాబాద్**

మండల వ్యాప్తంగా జ్యోతిబా పూలేకు ఘనంగా నివాళ్లర్పించారు. ఎంపీపీ శరత్‌రావు, జడ్పిటిసి నరసయ్య, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గోపాల్‌రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ - ఇల్లంతకుంట**

మండలంలోని ముస్కానిపేట గ్రామములో మహాత్మా జ్యోతిరావు పూలె విగ్రహానికి, రామోజీపేట ప్రభుత్వ పాఠశాలలో పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు బెంద్రం తిరుపతి, పర్శరాములు, నర్సయ్య, హన్మంతు, సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రామగిరి : పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

**నవతెలంగాణ - రామగిరి**

రామగిరి మండల కేంద్రంలోని మార్కెట్ చౌరస్తాలో రామగిరి వైస్‌ఎంపీపీ కాపురబోయిన శ్రీదేవి బాస్కర్ ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ పూదరి సత్యనారాయణగౌడ్, జడ్పీటీసీ మ్యాదరబోయిన శారదకుమార్ యాదవ్,ఎ ంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ధర్ముల రాజసంపత్, కోఆప్షన్ సభ్యుడు ఎండి ఇబ్రహీం, సర్పంచ్‌లు అల్లం పద్మ, పల్లె ప్రతిమ, బుర్ర పద్మ, ఏఎంసీ డైరెక్టర్ మైదం స్వప్న, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ రామగిరి మండల ఓబీసీ సెల్ అధ్యక్షుడు బండారి సదానందం ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఎంపిటిసి కొప్పుల గణపతి, నాయకులు కండే పోషం, దాసరి శివ, గొర్రె నరేష్ యాదవ్, అంగూరి రమేష్, ఎరుకల బాబురావు పాల్గొన్నారు.


గోదావరిఖని : కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే


ముస్తాబాద్ : నివాళ్లర్పిస్తున్న ఎంపీపీ


మంథనిలో..

**నవతెలంగాణ - తంగళ్ళపల్లి**

తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని తాడూరు చౌరస్తాలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాల వైస్ చైర్మన్ దుబ్బాక రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ పడగల మానస, నాయకులు పాల్గొని ఘనంగా నివాళ్లర్పించారు. బిఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజన్న, ప్రజాప్రతినిధులు, నాయకులు బండి దేవదాస్, పోచయ్య, ఎంపిటిసి బైరినేని రాము, అంకరపు రవీందర్, అసరి బాలరాజు యాదవ్, దుబ్బాక శ్రీనివాస్, మిరాల శ్రీనివాస్ యాదవ్, కందుకూరి రామాగౌడ్, మునిగల రాజు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో పూలే చిత్రపటానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

**నవతెలంగాణ - జూలపల్లి**

జూలపల్లి మండలంలోని బాలరాజుపల్లి గ్రామంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దారబోయిన నరసింహం యాదవ్, వైస్ ఎంపీపీ మొగురం రమేష్, సర్పంచ్ కుంటూరి రాజయ్య, ఉపసర్పంచ్ అడువాల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం పాత బస్టాండ్‌లో బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జ్యోతిబా పూలే చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, బిసి సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధికార ప్రతినిధి బండారి బాల్‌రెడ్డి, బిసి సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు కంచర్ల రాజు, బిసి సంఘం ప్రతినిధులు శ్రీనివాస్‌గౌడ్, మీసం రాజం, తదితరులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ - మంథని**

మంథని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఏఐసీసీ కార్యదర్శి, ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని, ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త వారి ఆశయ సాధనకు పాటు పడాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పట్టణంలో మహాత్మ జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా బీజేపీ, బీఆర్‌ఎస్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు చిలువేరి సతీష్, నాంపల్లి రమేష్, బీసీ సంఘం నాయకులు పెండ్యాల రామ్ కుమార్, ప్రవీణ్ కుమార్, వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, కౌన్సిలర్ కాయితి సమ్మయ్య, భీముని వెంకటస్వామి, నక్క శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మంథనిలోని జ్యోతిబా పూలే విగ్రహానికి నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, ఎంపీపీ కొండ శంకర్, జడ్పిటిసి తగరం సుమలత, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, రైతు బంధు సమితి అధ్యక్షుడు ఆకుల కిరణ్, నాయకులు ఎగోలపు శంకర్‌గౌడ్, తగరం శంకర్ లాల్, బత్తుల సత్యనారాయణ, బడికల శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్లు నక్క శంకర్, గుండ పాపారావు, కాయితీ సమ్మయ్య కుర్ర లింగయ్య, బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ముత్తారం : నివాళి అర్పిస్తున్న డిప్యూటీ తహశీల్దార్

**నవతెలంగాణ - ఓదెల**

ఓదెల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమేష్, కొలనూరులో పెద్దపల్లి జిల్లా మార్కెట్ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య యాదవ్ మహాత్మ జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ రేణుకదేవి, అంబేద్కర్ యువజన సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మాటూరి రత్నం, నాయకుడు అంబాల కుమార్, బీఎస్‌పీ మండల అధ్యక్షుడు సాతురి అనిల్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ - ముత్తారం**

మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో మహాత్మ జ్యోతి రావు పూలే చిత్రపటానికి డిప్యూటీ తహశీల్దార్ ఉదయ్ కుమార్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపిఎస్‌ఓ సంధ్య, మండల సర్వేయర్ లలిత, జూనియర్ అసిస్టెంట్ మదన్, విఆర్‌ఎలు పాల్గొన్నారు.

**నవతెలంగాణ - గోదావరిఖని**

బడుగు, బలహీన వర్గాల సమన్యాయానికి, హక్కుల సాధనకై నిరంతరం పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని, వారి పోరాటాలను ఆదర్శంగా తీసుకొని ప్రజలు వారి హక్కుల సాధనకై ముందుకు సాగాలని ఐద్వా, సిఐటియు, డివైఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని గోదావరిఖనిలోని పవర్ హౌస్ కాలనీలో భూ పోరాటం కేంద్రం దగ్గర నాయకులు, ప్రజలు ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా పెద్దపల్లి జిల్లా కార్యదర్శి మహేశ్వరి, సిఐటియు జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాగర్ మాట్లాడుతూ ప్రజలలో కుల, మత లింగ వివక్షత ఉండకుండా అందరికీ సమన్యాయం, సమాన హక్కులు ఉండాలని పోరాటం చేసిన గొప్ప వ్యక్తి జ్యోతిరావు పూలే అన్నారు. వారు ప్రజల హక్కుల కోసం పోరాటమే కాకుండా ప్రజలందరూ కూడా విద్యావంతులు కావాలని విద్య ద్వారానే అందరికీ సమాన హక్కులు సాధించుకోగలమని ఆయన సతీమణి సావిత్రిబాయి పూలేను చదివించి వారి ద్వారా ఎంతో మంది మహిళలకి చదువుచెప్పించారని అన్నారు. వారి స్పూర్తితో ఈ భూ పోరాట కేంద్రం ముందుకు సాగుతూ ఇల్లు సాధించే వరకు వెనక్కి తగ్గబోవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు లావణ్య, డివైఎఫ్ఐ ఈస్ట్ ఏరియా కమిటీ నాయకులు శివకుమార్, నాయకులు పీర్ మహమ్మద్, షైమద, శ్రీనివాస్, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

సిఐటియూ ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో రెండో డివిజన్ ఇందిరమ్మ కాలనీ భూ పోరాట కేంద్రం వద్ద జ్యోతిరావు పూలే చిత్రపటానికి సిఐటియు జిల్లా కోశాధికారి ఎం.రామాచారి, ఏరియా కమిటీ కన్వీనర్ గిట్ల లక్ష్మారెడ్డి పూలమాలవేసి వారు నివాళి అర్పించారు. నాయకులు తోట రవీందర్, రమణ, ఎం.దేవేంద్ర, భాగ్య సురేష్, సుజాత, స్వప్న, ఆర్.మనోహర్, కరుణ, తదితరులున్నారు.

**నవతెలంగాణ-గోదావరిఖని**

గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించి నివాళ్లర్పించారు. మహనీయుల జయంతుత్సవాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ హాజరయ్యారు. స్థానిక రాజేష్ థియేటర్ సమీపంలోని పూలే విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఏసిపి గిరి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, రాష్ట్ర నాయకురాలు మూల విజయరెడ్డి, టిబిజికెఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగార్ల మల్లయ్య, మధ్యప్రదేశ్ ప్రభుత్వ కార్యదర్శి పరికిపండ్ల నరహరి, కార్పొరేటర్లు కలువల శిరీష-సంజీవ్, మంచికట్ల దయాకర్, కో ఆప్షన్ వంగ శ్రీనివాస్ గౌడ్, మహనీయుల జయంత్యుత్సవాల కమిటీ నాయకులు బొంకూరి మధు, మాదాసు రామ్మూర్తి, మైస రాజేష్, కొంకటి లక్ష్మణ్, వడ్డెపల్లి శంకర్, కాంపెల్లి సతీష్, అందె సదానందంతోపాటు బిఆర్‌ఎస్, టిబిజికెఎస్ నాయకులు పాల్గొన్నారు. అలాగే బీఆర్‌ఎస్, బీజేపీ, తదితర పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించి నివాళ్లర్పించారు.


ఇల్లంతకుంట : పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు


తంగళ్ళపల్లి మండల కేంద్రంలో..


జూలపల్లి మండలంలో..


ఎల్లారెడ్డిపేటలో..


ఓదెలలో..

**నవతెలంగాణ - వేములవాడ**

వేములవాడ పట్టణంలోని సీఐటీయూ డివిజన్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఎం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు నాగరాజు, ఎల్లారెడ్డి, అశోక్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. అర్బన్ మండలంలోని రుద్రవరంలో సర్పంచ్ ఊరడీ రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ బి.రాజగోపాల్ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## వేములవాడ ప్రెస్‌క్లబ్ (ఐజేయూ) కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

**నవతెలంగాణ - వేములవాడ** : ఇండియన్ జర్నలిస్టు యూనియన్(ఐజేయూ) వేములవాడ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పుట్టపాక లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా తాళ్లపెల్లి ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా నూగూరి మహేష్, సహాయ కార్యదర్శిగా దూలం సంపత్, క్యాషియర్‌గా మద్దిరాల నరేష్, కార్యవర్గ సభ్యులుగా మ్యాన శ్రీనివాస్, హబీబ్ పాషా, ఊశ్లేందుల మల్లేశం, తాటికొండ పవన్, నామాల శ్రీనివాస్, రేగుల సాయిబాబా, గుడిసె కిషన్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు రేగుల దేవేందర్, కోళ్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ తన ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపాడు. అనంతరం ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని హోమ్ టౌన్ రెస్టారెంట్ నిర్వాహకుడు మొట్టల మహేష్ శాలువలతో ఘనంగా సన్మానించారు.

## రైతులు అభివృద్ధికి కృషి

**నవతెలంగాణ - కొనరావుపేట** : రైతుల అభివృద్ధికి కృషి చేస్తానని వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ మిర్యాల ప్రభాకర్‌రావు అన్నారు. మండలంలోని సుద్దాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తన జీవితమంతా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం, రైతుల కోసం కృషి చేశానన్నారు. కొంత మంది మామిడిపల్లి ఎంపీటీసీగా వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రెండు పదవుల్లో కొనసాగుతున్నారని ఆరోపిస్తున్నారన్నారు. రెండు పదవుల్లో కొనసాగినా ప్రజా శ్రేయస్సు కోసమే కృషి చేస్తూ ఎలాంటి గౌరవ వేతనం తీసుకోవడం లేదన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకుడు జీవన్, తదితరులు ఉన్నారు.

## రెవెన్యూ ఉద్యోగులకు యూనిఫాంలు పంపిణీ

**నవతెలంగాణ - పెద్దపల్లి** : జిల్లాలోని రెవెన్యూ శాఖలో పని చేస్తున్న నాల్గవ తరగతి ఉద్యోగులకు, డ్రైవర్‌లకు పెద్దపల్లి కలెక్టర్ డాక్టర్ ఎస్.సంగీత సత్యనారాయణ యూనిఫాంలను మంగళవారం అందజేశారు. అదనపు కలెక్టర్‌లు వి.లక్ష్మీనారాయణ, కుమార్ దీపక్, కలెక్టరేట్ పరిపాలన అధికారి కే.వై.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## మిడ్ మానేరులో గుర్తు తెలియని శవం లభ్యం

**నవతెలంగాణ - బోయినిపల్లి** : బోయినిపల్లి మండలంలోని కొదురుపాక మిడ్ మానేరులో మంగళవారం గుర్తు తెలియని మగ మనిషి మృతదేహం కనిపించింది. సమాచారాం తెలుసుకున్న ఎస్సై మహేందర్ సంఘటన స్థలానికి చేరుకుని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## 'ఆరోగ్య మహిళా' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ శ్వేతా మహంతి


మహిళలతో మాట్లాడుతున్న ఆరోగ్య శాఖ కమిషనర్

**నవతెలంగాణ - తంగళ్ళపల్లి**

మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్య మహిళా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ శ్వేతా మహంతి అన్నారు. తంగళ్ళపల్లి మండలం నేరెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళలను వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెండు వారాల్లో వచ్చిన మహిళలకు చేసిన పరీక్షల రిపోర్టులను పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. వీఐఏ పరీక్షలను సాధ్యమైనంత ఎక్కువ మందికి చేయాలన్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళలందరూ ఆరోగ్యంగా ఉండాలని లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఒబేసిటీ, రక్త, మూత్ర పరీక్షలు, క్యాన్సర్, న్యూట్రిషన్ మొదలైన పరీక్షలను స్థానిక ఆసుపత్రిలో చేసి రోగనిర్ధారణ అనంతరం నివారణ కోసం మందులు ఇవ్వడంతో పాటు అవసరం ఉన్నవారికి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులకు రిఫర్ చేయనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలోని నిరుపేదలు వైద్య పరీక్షలు చేయించుకోలేని స్థితిలో ఉన్న మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్‌మోహన్, జిల్లా ఉప వైద్యాధికారి రజిత, జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ మురళీధర్‌రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## అంధత్వ నివారణే లక్ష్యంగా కంటి వెలుగు

### రామగుండం కోరుకంటి చందర్


శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**నవతెలంగాణ - గోదావరిఖని** : తెలంగాణ రాష్ట్రంలో దృష్టి లోపాలను నివారించి, అంధత్వ నివారణే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమం చేపట్టారని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. మంగళవారం రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 34వ డివిజన్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. ఆయన వెంట కార్పొరేటర్ జంజర్ల మౌనిక, జెవి రాజు, దొంత శ్రీనివాస్, వైద్యురాలు నర్మదా, నాయకులు దోమ్మేటి వాసు తదితరులున్నారు.

## సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారుల దాడి

**నవతెలంగాణ - మంథని** : మంథని మండలం ధర్మారం గ్రామంలో శివారులో నాటుసారా స్థావరాలపై మంగళవారం ఎక్సైజ్ సీఐ గురవయ్య, ఎస్సై సాయిరామ్ ఆధ్వర్యంలో సిబ్బంది మెరుపు దాడులు చేశారు. పిడుగు సమ్మయ్య వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. 4 లీటర్ల నాటు సారా, 100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారని సిఐ తెలిపారు. సిబ్బంది రాజేందర్, శ్రీనివాస్, సతీష్, నిరంజన్ పాల్గొన్నారు.

## రాజన్నను దర్శించుకున్న కేంద్ర, రాష్ట్ర ఆడిట్ అధికారులు

**నవతెలంగాణ - వేములవాడ** : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని మంగళవారం కేంద్ర ఆడిట్ ప్రిన్సిపాల్ డైరెక్టర్ అనింద్య దాస్ గుప్తాతో పాటు రాష్ట్ర ఆడిట్ జనరల్ సుధా రాజన్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు వారికి ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందించారు. వారి వెంట ప్రోటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, అల్లి శంకర్, విటీడీఏ ఎస్టేట్ అధికారి సత్యనారాయణ ఉన్నారు.

## వివేక్‌ని పరామర్శించిన సీపీఐ నాయకులు


పరామర్శిస్తున్న నాయకులు

**నవతెలంగాణ - గోదావరిఖని క్రైం** : గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటీవల విద్యుత్ ప్రమాదంలో గాయపడిన వివేక్ అనే ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని మంగళవారం గోదావరి ఖనిలోని ప్రైవేటు ఆసుపత్రిలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి మద్దెల దినేష్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు తోడుపునూరి రమేష్ కుమార్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను, ప్రిన్సిపాల్‌ను, వైద్యాధికారులను డిమాండ్ చేశారు.

## సింగరేణి కార్మికుల మంచినీటి సమస్య పరిష్కారానికి ప్రజాప్రతినిధులు స్పందించాలి

### ఎస్‌సీఈయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి


చర్చిస్తున్న సిఐటియు నాయకులు

**నవతెలంగాణ - గోదావరిఖని**

సింగరేణి కార్మికుల మంచినీటి సమస్య పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు స్పందించాలని సిఐటియు సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. గోదావరి మురుగునీరు కార్మిక కుటుంబాలకు సప్లై అవుతున్న సమస్య పరిష్కారం కోసం అధికారులతో సిఐటియు బృందం మంగళవారం చర్చించింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి మాట్లాడుతూ సింగరేణి అధికారులారా, స్థానిక ప్రజాప్రతినిధులారా స్పందించండని, మంచినీటి సమస్య పరిష్కరించండి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని డిమాండ్‌చేశారు. కార్మికుల కుటుంబాల ఆరోగ్యాలతో ఆటలాడుతున్నారని, గత వారం రోజుల నుంచి వస్తున్న ఈ మురుగునీరు తాగిన కుటుంబ సభ్యులు డయేరియా వ్యాధితో హాస్పిటల్‌పాలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సింగరేణి అధికారులు తక్షణమే ఫిల్టర్ బెడ్ లను పునరుద్ధరించి ఫిల్టర్ రేషన్ వాటర్ అందించాలని కార్మిక కుటుంబాల ఆరోగ్యాలు కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్జి-1 కార్యదర్శి మెండే శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి జెల్లా గజేంద్ర, సానం రవి, ఉపాధ్యక్షులు ఆసరి మహేష్, ఆరెపల్లి రాజమౌళి, సిహెచ్ వేణుగోపాల్ రెడ్డి, దాసరి సురేష్, నంది నారాయణ, అన్నం శ్రీనివాస్, మామిడి మల్లయ్య, రామ్ నరసయ్య, ఆకుల రవి, దశరథ రెడ్డి, కుమార్ తదితరులున్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



**నవతెలంగాణ - ముత్తారం**

ముత్తారం మండలం అడవీ శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన మెట్టు ఓదెమ్మకు లక్ష రూపాయల, ఓడ్నాల మానసకు 39వేల రూపాయల, ఎడ్ల ఓదెమ్మకు 28వేల రూపాయల, నిమ్మతి నాగరాజుకు 25వేల రూపాయల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ ముత్తారం మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ఆకోజు అశోక్, బైరి రాజు యాదవ్, నాయకులు లక్కం ప్రభాకర్, నిమ్మతి రవి, మారుపాక ప్రకాష్, ఎడ్ల మొగిలి, తదితరులున్నారు.

## హరిపురంలో కంటి వెలుగు ప్రారంభం


ప్రారంభిస్తున్న సర్పంచ్

**నవతెలంగాణ - ముత్తారం** : ముత్తారం మండలంలోని హరిపురం గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని మంగళవారం సర్పంచ్ సంపత్‌రావు, ఎంపిటిసి బియ్యాని శ్యామలసదానందం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ వేణుమాధవ్, డాక్టర్ కుమార్, వైద్య సిబ్బంది ఉన్నారు.

## పూలే ఆశయాలను కొనసాగిస్తాం

### ఎస్‌సీఈయూ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి



నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

**నవతెలంగాణ - గోదావరిఖని :** సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ ఆర్జీ-1 బ్రాంచి కమిటీ ఆధ్వర్యంలో కార్యదర్శి మెండె శ్రీనివాస్ అధ్యక్షతన మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి హాజరై మాట్లాడారు. మహాత్మా జ్యోతిరావు పూలే పోరాటాలను ఆదర్శంగా తీసుకొని కార్మికుల, ప్రజల హక్కుల సాధనకై ముందుకు సాగాలని అన్నారు. గోదావరిఖనిలోని మెయిన్ చౌరస్తా శ్రామిక భవన్ ముందు సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్జీ-1 అధ్యక్ష కార్యదర్శులు మేదరి సారయ్య, మెండె శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఆరెపల్లి రాజమౌళి, సానం రవి, వంగల రాములు, అన్నం శ్రీనివాస్, నంది నారాయణ, సిహెచ్ లక్ష్మణ్, బి ప్రవీణ్, మామిడి మల్లయ్య, లావణ్య, కొంటు సాగర్, ఫైమద, పీర్ మహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక క్షేత్రంలో సాగు పాఠాలు..

- కరువు జిల్లాలో విభిన్న పంటలతో సస్యశ్యామలం
- మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో ఎడ్యుకేషన్ హబ్‌గా సిరిసిల్ల
- వ్యవసాయ కళాశాలకు నూతన ప్రాంగణం
- తంగళ్లపల్లి మండలం జిల్లెలలో 30ఎకరాల్లో భవనాలు
- రూ.70 కోట్లతో అత్యాధునిక వసతుల కల్పన
- నేడు ప్రారంభోత్సవం


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కళాశాల

**నవతెలంగాణ - తంగళ్ళపల్లి**

కార్మిక, ధార్మిక క్షేత్రం రాజన్నసిరిసిల్ల జిల్లాలో వ్యవసాయ విద్యను విస్తరించాలని 2017-18లో కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా తంగళ్లపల్లి మండలం జిల్లెలలో 30ఎకరాల్లో రూ.70 కోట్లతో అత్యాధునిక వసతులతో భవనాలను నిర్మించారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం తర్వాత రాష్ట్రంలో ఇది రెండోది. ప్రస్తుతం కళాశాల, వసతిగృహాలు తుది మెరుగులు దిద్దుకొని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా అన్ని హంగులతో ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. వ్యవసాయ కళాశాల భవనాన్ని 16 ఎకరాల్లో జీప్లస్ టూ పద్ధతిలో నిర్మించారు. ఇందులో దిగువన పరిపాలన విభాగం ఉంటుంది. మిగతా రెండం తస్తులను నాలుగు బ్లాకులుగా చేశారు.

ఇందులో నాలుగు సంవత్సరాల విద్యార్థులకు వేర్వేరుగా తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబులున్నాయి.



భవనం చుట్టూ పచ్చదనం ఉట్టిపడేలా చెట్లు పెంచుతున్నారు. 360 మంది విద్యార్థిని, విద్యార్థులకు వేర్వేరుగా వసతి గృహాలున్నాయి.

ఇప్పటికే విద్యార్థులు క్షేత్రస్థాయి పరిశోధనల కోసం 18 ఎకరాల్లో వివిధ పంటల సాగు చేశారు. ఎరువుల తయారీకి ప్రత్యేకంగా వర్మికంపోస్టు యూనిట్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం క్షేత్ర ప్రయోగాలన్నీ ఇక్కడే జరుగుతున్నాయి.

### జల సంరక్షణ.. మురుగు శుద్ధి

కళాశాల ఆవరణలోని ఎకరంలో నీటి కుంటను నిర్మించారు. వర్షాలకు భవనాలపైన నుంచి వచ్చే నీటిని ఈ కుంటలోకి మళ్లిస్తున్నారు. దీంతో పరిసరాల్లోని భూగర్భ జలసంరక్షణకు ఇది ఉపయోగపడుతుంది. వసతి



గృహాలు, కళాశాల అవసరాల కోసం ఏర్పాటు చేసిన బోరుబావుల్లో నీటిమట్టం నిలకడగా ఉంటున్నాయి. కళాశాల, వసతి గృహాల నుంచి వచ్చే మురుగు నీటిని శుద్ధిచేసేందుకు ప్రత్యేకంగా ఎస్టీపీని నిర్మించారు. కళాశాల ప్రారంభమైతే ఎస్టీపీ నిర్వహణకు ప్రత్యేకంగా ఒకరిని నియమిస్తారు. దీని ద్వారా తయారైన ఎరువును పంటలకు ఉపయోగించేలా ప్రణాళికలు చేస్తున్నారు.

ఇబ్బందులు తొలిగేలా

కళాశాల మంజూరు తర్వాత స్థానికంగా భవనాలు లేక సర్దాపూర్‌లోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో వసతి, తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడి పాలిటెక్నిక్ కళాశాలను సిద్దిపేట సమీపంలోని ఉద్యా కళాశాలలోకి మార్చారు. అడ్మిషన్లు తరగతులు అక్కడే జరుగుతున్నాయి. కరోనాతో గతేడాది కౌన్సిలింగ్లో ప్రవేశాలు రద్దుచేశారు. ఈ ఏడాది కౌన్సిలింగ్ పూర్తయితే 120 మంది విద్యార్థులు చేరుతారు. ప్రస్తుతం మూడో సంవత్సరం విద్యార్థులు 123 మంది క్షేత్ర అధ్యయనంలో ఉన్నారు. కళాశాలలో ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది. మొత్తం 36 మంది పూర్తిస్థాయిలో ఉన్నారు.

మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో సిరిసిల్ల ఎడ్యుకేషన్ హబ్‌గా మారింది. రాష్ట్రంలోనే తొలి కేజీ టు పీజీ క్యాంపస్, గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, వ్యవసాయ పాలిటెక్నిక్, వ్యవసాయ కళాశాల, జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల, మెడికల్, నర్సింగ్ కళాశాలలు, రాష్ట్రంలోనే తొలి ఫైన్ ఆర్ట్స్ కళాశాల, ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ కూడా అందుబాటులోకి వచ్చాయి. ఒకప్పుడు విద్యారంగంలో అనేక సమస్యలతో కొట్టుమిట్టాడిన సిరిసిల్ల మంత్రి కేటీఆర్ చొరవతో ప్రత్యేక జిల్లా సిద్ధించాక విద్యారంగంలో రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచింది. సకల సౌకర్యాలతో కూడిన ప్రాథమిక విద్య నుంచి డిగ్రీ వరకు, ఉపాధినిచ్చే వత్తి విద్యలోనూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు భరోసా నిస్తూ సిరిసిల్లను ఎడ్యుకేషన్ హబ్ తీర్చిదిద్దారు.



### ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ అనురాగ్ జయంతి



ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులో నిర్మించిన వ్యవసాయ కళాశాల ప్రారంభానికి సిద్ధమైంది. ఈ కళాశాల భవనాన్ని బుధవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డితో కలిసి మంత్రి కే.తారకరామారావు ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్ క్షేత్ర స్థాయిలో ప్రారంభోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను, హెలిప్యాడ్, సభాస్థలిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వారివెంట అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఎన్.ఖీమ్యా నాయక్, ఆర్డీఓ టి.శ్రీనివాస్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి, జిల్లా వ్యవసాయ అధికారి రణధీర్‌రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, డిసిఓ బుద్ద నాయుడు, ఎంపీపీ పడిగెల మానస, సర్పంచ్ మాట్ల మధు, ఎంపీటీసీ వెంకట్రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని కేంద్రం అధికారికంగా నిర్వహించాలి

### బీసీలను మోసగించిన బీజేపీ

### సీపీఐ(ఎం) సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మూషం రమేష్


నివాళులర్పిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

**నవతెలంగాణ - సిరిసిల్ల**

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సీపీఐ(ఎం) రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలో పార్టీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మూషం రమేష్ మాట్లాడుతూ బ్రాహ్మణ ఆధిపత్య కులాలు పెత్తనం చెలాయిస్తున్న కాలంలో దళిత, బహుజన, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం పూలే అనేక సామాజిక ఉద్యమాలు చేశారన్నారు. మహిళలకు చదువుకునే హక్కును, బాల్య వివాహాల రద్దు, వితంతులకు పునర్ వివాహం చేసుకొని హక్కుల సాధించిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయాల సాధన కోసం నేటి యువత నడుంబిగించి ముందుకు సాగవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మళ్లీ మనువాద సిద్ధాంతాన్ని తీసుకొచ్చి దళిత, బహుజన, బీసీలకు అన్యాయం చేయాలని చూస్తుందని విమర్శించారు. అందులో భాగంగానే బీసీ ప్రధాని అని చెప్పుకునే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశంలో 52శాతం ఉన్న బీసీలకు రూ.45లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్‌లో కేవలం 4000 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాని ఒక శాతం ఉన్న కోటీశ్వరులకు రూ.14లక్షల కోట్ల రాయితీని కేటాయించడం చూస్తుంటే బీజేపీ బీసీలకు ఎంత అన్యాయం చేస్తుందో అర్థమవుతుందన్నారు. కేవలం ఓటు బ్యాంకు కోసమే బీసీ కుల గణన చేపడుతామని చెప్తూ కాలయాపన చేస్తున్నారని, ఇప్పటివరకు చేసింది శూన్యం అన్నారు. జాతీయ ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించి బీసీలకు పని లేకుండా చేసారన్నారు. బీజేపీ అనుసరిస్తున్న దళిత, బహుజన, బీసీ వర్గాల వ్యతిరేక విధానాలపై జ్యోతిరావు పూలే స్ఫూర్తితో రాబోయే కాలంలో సామాజిక ఉద్యమాలు నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు అన్నల్దాస్ గణేష్, సూరం పద్మ, నక్క దేవదాస్, రమేష్ చంద్ర, ఒగ్గు గణేష్, బెజిగం సురేష్, గడ్డం రాజశేఖర్, సందుపట్ల పోచమల్లు, సందుపట్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## మంథని పట్టణ సుందరీకరణపై ప్రత్యేక దృష్టి

### పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్- బుల్లెట్ బండిపై విస్తృత పర్యటన


పట్టణంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్

**నవతెలంగాణ - మంథని**

జిల్లాలోనే మంథని పట్టణాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తూ పట్టణ సుందరీకరణపై ప్రత్యేక దృష్టిసారించినట్లు పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ తెలిపారు. మంగళవారం ఉదయం బుల్లెట్ బండిపై పట్టణంలో విస్తృతంగా పర్యటించి పరిశీలించారు. మున్సిపల్ పరిధిలోని రావుల చెరువు కట్ట, తమ్మిచెరువు కట్ట, బొక్కలవాగు కట్ట సుందరీకరణలో భాగంగా జరుగుతున్న సీసీ రోడ్లు, వాకింగ్ ట్రాక్, లైటింగ్ పనులతో పాటు రజకవాడ నుంచి రావులచెరువుకట్ట ప్రాంతంలోని శివకిరణ్ గార్డెన్ వరకు రహదారి నిర్మాణం పనులను ఆయన పరిశీలించారు. అలాగే బస్టాండ్ ఎదురుగా ఉన్న దుకాణ సముదాయ భవనం పైఅంతస్తు నిర్మాణం కోసం పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రపురిగా పేరుగాంచిన మంథనిలో ప్రజలకు ఆహ్లాదం పంచేలా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. మంథనిని మరో కోనసీమ తరహాలో అభివృద్ధి చేయాలనే ఆకాంక్షతో ఉన్నామని వివరించారు. పర్యటనలో బాగంగా ఆయా వాడల్లోని ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సుమారు రెండు గంటల పాటు బుల్లెట్ బండిపై మంథని పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఆయన వెంట స్థానిక వార్డు కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

## ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి సభను విజయవంతం చేయండి

**నవతెలంగాణ - మంథని :** భారతరత్న, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 132వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 14న ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు సంయుక్తంగా మంథనిలోని గాంధీ చౌక్‌లో నిర్వహించే జయంతి సభను మంథని ప్రాంత ప్రజలు విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ పిలుపునిచ్చింది. మంగళవారం మంథని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి నాయకులు మాట్లాడారు. గత సంప్రదాయానికి భిన్నంగా అంబేద్కర్ అన్ని వర్గాలకు చెందిన నేతగా భావించి అందరిని భాగస్వామ్యులుగా చేయాలని భావించి జయంతి ఉత్సవ కమిటీలో అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చినట్టు చెప్పారు. ఈమారు ఘనంగా జయంతి ఉత్సవాలను పలు ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు అన్నీ కలిసి మంథనిలోని గాంధీ చౌక్ లో 14న ఉదయం 10 గంటలకు సభ నిర్వహిస్తున్నామని అన్నారు. సభను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మంథని అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ - 2023 చైర్మన్ ఇనుముల సతీష్, కమిటీ కన్వీనర్లు సెగ్గెం రాజేష్, పోతరవేణి క్రాంతి, బూడిద గణేష్, బూడిద తిరుపతి, ఆర్ల సందీప్, మంథని లింగయ్య, విరుగురాల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## అనాథ పిల్లలలకు ఆర్థిక సాయం



**నవతెలంగాణ - ఇల్లంతకుంట :** గతంలో గుండెపోటుతో తండ్రి, కరీంనగర్‌లో ప్రమాదవశాత్తు తల్లి మరణించగా అనాథలైన పిల్లలకు వంతడుపుల గ్రామస్తులు 80వేల రూపాయల నగదును అందించారు. రహీంఖాన్‌పేట ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న బండ రజిత ఇటీవల క్రితం కరీంనగర్‌లో రోడ్డు ప్రమాదంలో మరణించింది. వారి పిల్లలను ఓదార్చి నగదు అందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహశీల్దార్ బాల్‌రెడ్డి, అన్నాడి నవీన్‌రెడ్డి, దుర్మాట్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## లబ్దిదారులకు అకౌంట్‌లో డబ్బులు జమ చేయాలని వినతి

**నవతెలంగాణ - ఓదెల :** రెండోవిడత గొర్రెల పంపిణీ పథకం డబ్బులు నేరుగా లబ్దిదారుల అకౌంట్‌లో జమచేయాలని ఓదెల తహసీల్దార్ రమేష్‌కు మంగళవారం యాదవ హక్కుల సమితి అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. గతంలో పంపిణీ చేసిన గొర్రెలు నాణ్యత లేకపోవడంతో లబ్దిదారులు నష్టపోయారన్నారు. ఇప్పుడైనా అకౌంట్‌లో డబ్బులు జమ చేస్తే వారికి అనుకూలంగా ఉన్న లోకల్ గొర్రెలను తీసుకొని జీవనోపాధి పొందుతారన్నారు. కార్యక్రమంలో సామ లింగమూర్తి, మల్లయ్య, సంపత్, మల్లేష్, ఓదేలు, అనిల్ ఉన్నారు.

## హామీలకు కట్టుబడి ఉండే పార్టీ కాంగ్రెస్

### ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

**నవతెలంగాణ - మంథని :** ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండే పార్టీ కాంగ్రెస్ అని.. పార్టీలో సమిష్టి నిర్ణయంతోనే టికెట్ల నిర్ణయం ఉంటుందని ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం మంథని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ పెద్ద మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. పేద, బడుగు బలహీన, మైనారిటీ వర్గాల అభివృద్ధికి దోహదపడేలా కాంగ్రెస్ పార్టీ కృషి చేసిందన్నారు. స్క్రీనింగ్ కమిటీలో స్థానికంగా వచ్చే అభిప్రాయాలను తీసుకొని ఆ తర్వాత సెంట్రల్ ఎలక్షన్ కమిటీ నిర్ణయం ఉంటుందని, ప్రస్తుతం ఢిల్లీలో ఆ సమావేశాలు నడుస్తున్నాయన్నారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సెక్రటరీగా ఒక ప్రాంత పర్యవేక్షకుడిగా కొనసాగుతున్నానన్నారు.

## బస్టాండులో వాటర్ కూలర్ ప్రారంభం

**నవతెలంగాణ - మంథని :** మంథని బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల తాగునీటి కోసం వేసవి నేపథ్యంలో వాటర్ కూలర్‌ను డిపో మేనేజర్ తర్ల శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. సీతారామ శివసదన్ సమస్త నిర్వాహకులు మినరల్ వాటర్‌ను సరఫరా చేయనున్నారు. కంట్రోలర్ కేఆర్‌రెడ్డి, పిబి.స్వామి, శ్రీనివాస్, కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు భవిష్యత్‌పై దృష్టి సారించాలి

### ముత్తారం ఎస్‌ఐ బేతి రాములు

**నవతెలంగాణ - ముత్తారం :** విద్యార్థులు బంగారు భవిష్యత్‌పై దృష్టి సారించాలని, ఇందుకు కష్టపడి చదవాలని ముత్తారం ఎస్‌ఐ బేతి రాములు సూచించారు. పదోతరగతి పరీక్షలు పూర్తయిన సందర్భంగా ముత్తారం మండలంలోని విద్యార్థులతో దరియాపూర్ మోడల్ పాఠశాల పరీక్ష కేంద్రంలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి పలు అంశాలపై అవగాహన కల్పించి సూచనలు చేశారు.

## ఏసీబీ వలలో పెద్దపల్లి సబ్ రిజిస్టర్

**నవతెలంగాణ - పెద్దపల్లి**

అవినీతి నిరోధక శాఖ అధికారులకు సబ్ రిజిస్టర్ శాఖలోని అవినీతి అధికారి చిక్కారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో డాక్యుమెంట్ల కోసం పూదరి శ్రీనివాస్ నుండి 60వేల రూపాయలు తీసుకుంటుండగా పెద్దపల్లి సబ్ రిజిస్టర్ దేవనగిరి నిర్మల, అటెండర్ శ్రీనివాసును ఏసీబీ డీఎస్పి భద్ర ఆధ్వర్యంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గతంలో సైతం డాక్యుమెంట్ల కోసం నగదు తీసుకొని మరోసారి డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను సంప్రదించారు. దీంతో ఏసీబీ అధికారులు పట్టుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

## 14న మంచిర్యాలలో జై సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలి

### ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు



**నవతెలంగాణ - మంథని**

మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 14న మధ్యాహ్నం 3గంటలకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖార్గే హాజరయ్యే జై సత్యాగ్రహ దీక్ష బహిరంగ సభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం మంథని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. భారతీయ జనతా పార్టీ రాజ్యాంగ వ్యవస్థలను ఉపయోగించుకొని ప్రతిపక్షాలు లేకుండా చేస్తున్న అనేక అంశాల పట్ల, రాజ్యాంగాన్ని, రాజ్యాంగంలో ఉన్న ప్రతి ఒక్క అంశాన్ని కాపాడడానికే జై సత్యాగ్రహ దీక్ష కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమానికి పీసీసీ, సీఎల్పీ, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు హాజరుకానున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు రాజ్యాంగాన్ని కాపాడాలని ఆలోచన చేస్తున్న ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఫిల్టర్ బెడ్‌ను తనిఖీ చేసిన సింగరేణి ఆర్జీ-1 జిఎం

**నవతెలంగాణ - గోదావరిఖని :** సింగరేణి ఆర్జీ-1లోని కార్మిక కాలనీలకు సరఫరా అవుతున్న నీటి విషయంపై ఏరియా జిఎం చింతల శ్రీనివాస్, అధికారుల బృందంతో కలిసి గంగానగర్ వద్ద ఉన్న ఒకటిన్నర మిలియన్ గ్యాలన్‌ల సామర్థం గల ఫిల్టర్ బెడ్‌ను మంగళవారం తనిఖీ చేశారు. ప్రస్తుతం మేడిగడ్డ బ్యారేజీ నిర్మించిన తర్వాత 24 గంటలు/365 రోజులు గోదావరి లో నీరు నిల్వ ఉండటం మూలంగా, నీటి ప్రవాహం లేక పోవటం వలన నీటిని ఫిల్టర్ చేసినప్పటికీ నీటి రంగు మారి వస్తుందని జిఎం తెలిపారు. త్వరలో ఫిల్టర్ బెడ్‌లను పూర్తి స్థాయిలో శుభ్రం చేసి కాలనీలకు సురక్షిత నీరు సరఫరా చేస్తామని తెలిపారు. 17ఎంఎల్‌డి నీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణ పనులు, సుందిళ్ల పంప్‌హౌస్, జీడికె 2వ ఇంక్లయిన్ రోడ్డు, నాశాల డైవర్షన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూజిఎం ఎం.రామ్ మోహన్, డిజిఎం సివిల్ నవీన్, డిజిఎం పర్సనల్ సిహెచ్ లక్ష్మి నారాయణ, ఏజీఎం ఐఈడి ఆంజనేయులు, ఎన్విరాన్ మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, సివిల్ ఇంజనీరు వెంకటేశ్వర్‌రావు, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి తదితరులున్నారు.

## 48వ డివిజన్‌లో కంటి వెలుగు ప్రారంభం

**నవతెలంగాణ - గోదావరిఖని :** రామగుండం కార్పొరేషన్ 48వ డివిజన్‌లో కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం కార్పొరేటర్ పొన్నం విద్యలక్ష్మణ్‌గౌడ్ ప్రారంభించారు. డివిజన్ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ తానిపర్తి విజయలక్ష్మిగోపాల్‌రావు, డాక్టర్ మణికేశ్వర్‌రెడ్డి, డాక్టర్ సరళ, సిఓ అనిత, తదితరులున్నారు.

## గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

**నవతెలంగాణ-ముత్తారం :** ఈ నెల 13న పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్‌లో నిర్వహించే గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం ద్వితీయ వార్షికోత్సవానికి జయప్రదం చేయాలని గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం మండల ప్రధాన కార్యదర్శి చెల్కల యుగేందర్ యాదవ్ కోరారు. ముత్తారం మండల కేంద్రంలో గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు చెనవేన కుమార్ యాదవ్, ఏగుర్ల కుమార్ యాదవ్, ఏగుర్ల రాజు యాదవ్, చెనవేన సంతోష్ యాదవ్ పాల్గొన్నారు.

# పూలే, అంబేద్కర్ స్ఫూర్తితో ముందడుగు వేయాలి

### పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

### గుంజపడుగులో మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్

**నవతెలంగాణ - మంథని :** అట్టడుగు వర్గాలకు అక్షరజ్ఞానం అందించి విశ్వానికి వెలుగులు అందించిన జ్యోతిరావు పూలే, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కల్పించి గౌరవించేలా రాజ్యాంగం, రిజర్వేషన్‌లు అందించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో సబ్బండ వర్గాలు ముందడుగు వేయాలని పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ పిలుపునిచ్చారు. మంథని మండలం గుంజపడుగు గ్రామంలో పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జ్యోతిరావు పూలే, బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణిరాకేష్, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజలతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆనాడు పూలే, అంబేద్కర్ మన భవిష్యత్ తరాల కోసం గొప్పగా ఆలోచన చేశారన్నారు. వారి త్యాగాల ఫలితంగానే ఈనాడు అనేక ఫలాలు పొందుతున్నామని చెప్పారు. మహనీయుల చరిత్ర తెలుసుకోకపోవడం మూలంగానే అనేక అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని, మనవర్గాల్లోనే మనస్పర్థలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 40ఏండ్ల చరిత్రలో ఏ కార్యకర్తను కుర్చీ ఎక్కించారా అని, ఎమ్మెల్యే సొంత గ్రామమైన ధన్వాడలోని ప్రభుత్వ పాఠశాలకు నాలుగు కుర్చీలు వేయించారా, నలుగురికి సాయం చేశారా చెప్పాలని ప్రశ్నించారు. అంతకు ముందు గుంజపడుగు బస్టాండ్ నుంచి డప్పు చప్పుళ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యులపై పూలవర్షం కురిపించి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. పుట్ట దంపతులను విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యులతో పాటు పలువురు ఘనంగా సన్మానించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## సెంటినరీ కాలనీ తై బజార్ వేలం

**నవతెలంగాణ - రామగిరి :** రామగిరి మండల కేంద్రంలోని పన్నూర్ గ్రామ పంచాయతీ పరిధి సెంటినరీ కాలనీ తై బాజార్ 2023-24 సంవత్సరానికి వేలం స్థానిక సర్పంచ్ అల్లం పద్మతిరుపతి అధ్యక్షతన ఎంపీఓ కాటం భాస్కర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన రూ.3లక్షలా 56వేలా 30కి సాగ నాగరాజు 3లక్షలా 87వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి చిందం మహేష్, కార్యదర్శి ఆకాష్,కారోబార్ పెరుమాండ్ల అభి పాల్గొన్నారు.

## కంఫర్ట్ గ్రామర్ స్కూల్లో ఫైలేరియా పరీక్షలు

**నవతెలంగాణ - రామగిరి :** కమాన్‌పూర్ మండల కేంద్రంలోని కంఫర్ట్ గ్రామర్ స్కూల్లో ట్రాన్స్‌మిషన్ అసెస్మెంట్ సర్వే-3లో భాగంగా ఒకటవ తరగతి అండ్ రెండవ తరగతి విద్యార్థులకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఫైలేరియా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఆర్నకొండ వినయ్ కుమార్ మాట్లాడారు. పరీక్షలలో అందరికీ నెగిటీవ్ వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో డబ్ల్యూహెచ్వో అధికారి డాక్టర్ శిరీష, సిహెచ్‌ఓ ఉమామహేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## లబ్దిదారులకు చెక్కులు పంపిణీ

**నవతెలంగాణ - మంథని :** మంథని నియోజకవర్గ పరిధిలోని కమాన్‌పూర్, మంథని, ముత్తారం, రామగిరి, పాలకుర్తి, మలహర్‌రావు, కాటారం, మహాముత్తారం, మహాదేవపూర్ మండలాలకు చెందిన లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. 118 మందికి రూ.80లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, రూ.19లక్షల విలువచేసే కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సెగ్గం రాజేష్, శశి భూషణ్ కాచే, అజీమ్ ఖాన్, ఇనుముల సతీష్, గోటికారి కిషన్‌జి, మంథని సత్యం, మద్దెల రాజయ్య, వేల్పుల రాజయ్య, మంథని రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ ఎప్పుడో..


కనగర్తిలో ఆవిష్కరించని విగ్రహాలు

**నవతెలంగాణ - కొనరావుపేట :** మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేసి వాటిని ఆవిష్కరించడం మర్చిపోయారు. మండలంలోని కనగర్తి గ్రామంలో ఆరు సంవత్సరాల క్రితం చాకలి ఐలమ్మ, అల్లూరి సీతారామరాజు విగ్రహాలను కుల సంఘాల వారు, యువకులు గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద నిర్మించారు. ఇప్పటివరకు ఆ విగ్రహాలను ఆవిష్కరించలేదు. వెంటనే విగ్రహాలను ఆవిష్కరించాలని గ్రామస్తులు, యువకులు కోరుతున్నారు.

## కస్తూర్బా పాఠశాలలో డీఈఓ తనిఖీ

**నవతెలంగాణ - బోయినిపల్లి :** మండలంలోని కస్తూర్బా విద్యాలయాన్ని సిరిసిల్ల జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలో అన్ని రికార్డులు సరైన విధంగా నిర్వహించాలని ఆదేశించారు. భోజనం శుభ్రంగా తయారు చేసి రుచికరంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. తరగతి గదులలో విద్యార్థులతో మాట్లాడారు. సామాజిక విద్యావేత్త జ్యోతిబా పూలే జయంతి కార్యక్రమంలో మాట్లాడారు. మండల విద్యాధికారి శ్రీనివాస్ దీక్షిత్, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ పద్మ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గంభీరావుపేట ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక



**నవతెలంగాణ - గంభీరావుపేట :** గంభీరావుపేట ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాపగారి యాదగిరిగౌడ్, ఉపాధ్యక్షులుగా రమేష్, మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా రవీందర్, కార్యదర్శులుగా శ్రీకాంత్, శంకర్, సంయుక్త కార్యదర్శి నరేష్‌చారి, సంతోషాచారి, కోశాధికారి శేఖర్‌రెడ్డి ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా ఎర్ర శ్రీనివాస్, అబ్దుల్ రహీం, ముఖ్య సలహాదారులుగా రామస్వామి, సదాతు ఎన్నికయ్యారు. అనంతరం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలను అప్పగించినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ జర్నలిస్టుల సమస్యలకు నిరంతరం పోరాటానికి తన వంతు కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో విలేకరులు మహేష్, బ్రహ్మాచారి పాల్గొన్నారు.

## అనంతపల్లిలో కంటి వెలుగు ప్రారంభం



**నవతెలంగాణ - చందుర్తి :** మండలంలోని అనంతపల్లి గ్రామంలో మంగళవారం రెండో విడత కంటి వెలుగు ను జెడ్పిటిసి నాగం కుమార్ ప్రారంభించారు.ఇట్టి కంటి వెలుగు పరీక్ష కేంద్రాన్ని ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేవేంద్ర, నాయకులు బైరగొని రమేష్ కంటి వైద్యులు అనిల్ ఉన్నారు.

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మీడియా హక్కుల వేలంతో బీసీసీఐ దక్కించుకున్న సొమ్ము రూ.48390 కోట్లు. టీమ్ ఇండియా స్వదేశంలో ఆడే ప్రతి మ్యాచ్‌కు మీడియా హక్కుల రూపంలో రూ.100 కోట్లకు పైగానే భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆర్జిస్తోంది. గత పదేండ్లలో బీసీసీఐ ఆదాయం జెట్ స్పీడ్‌తో పెరిగింది. అయినా, క్రికెట్‌కు చూసేందుకు స్టేడియాలకు వచ్చే ప్రేక్షకులకు కల్పించే సదుపాయాలు మాత్రం అత్యంత దారుణంగా ఉన్నాయి. 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ ముంగిట స్టేడియాల్లో మౌళిక సౌకర్యాల కల్పనపై బీసీసీఐ దృష్టి సారించనుంది!.



# స్టేడియాలకు కొత్త రూపు!

- సౌకర్యాల కల్పనకు రూ.500 కోట్లు
- ఉప్పల్ సహా ఐదు స్టేడియాల ఆధునీకరణ
- మాస్టర్‌ప్లాన్ రూపొందించిన బీసీసీఐ

నవతెలంగాణ-న్యూఢిల్లీ

ఈ ఏడాది ఆరంభంలో న్యూజిలాండ్ జట్టు భారత పర్యటనకు వచ్చింది. హైదరాబాద్‌లో భారత్, న్యూజిలాండ్ వైట్‌బాల్ పోరు. ఆ మ్యాచ్‌కు బీసీసీఐ ఓ ప్రత్యేక బృందాన్ని ఉప్పల్ స్టేడియానికి పంపించింది. స్టేడియానికి వచ్చిన ప్రేక్షకులతో సర్వే నిర్వహించిన ఆ బృందం.. ఉప్పల్ మైదానంలో సదుపాయాలు ఎలా ఉన్నాయి? సాధారణ స్టాండ్స్‌లో టాయిలెట్లు పరిశుభ్రంగా ఉంచుతున్నారా? సీటింగ్ సౌకర్యం ఎలా ఉంది? అంటూ ప్రశ్నలు సంధించింది. ప్రేక్షకుల అభిప్రాయాలను సేకరించటంతో పాటు స్టేడియంలో నలువైపులా తిరిగిన ఆ బృందం ఫోటోలను తీసుకుంది. ఇదే తరహాలో న్యూఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలోనూ కనిపించింది. భారత్, ఆస్ట్రేలియా మ్యాచ్ సందర్భంగా కోట్ల మైదానంలో ఏకంగా అభిమానులు టాయిలెట్ల నిర్వహణపై బోర్డుకు సోషల్ మీడియా వేదికగా ఫిర్యాదు చేశారు. క్రికెట్ మ్యాచుల నిర్వహణ, మీడియా హక్కులు, విలువైన స్పాన్సర్‌షిప్‌లతో రూ. వేల కోట్లు ఆర్జిస్తున్న భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ).. దేశవ్యాప్తంగా పలు స్టేడియాల్లో సౌకర్యాల కల్పనకు నడుం బిగించనుంది. 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌ను దృష్టిలో ఉంచుకుని, మెగా ఈవెంట్‌లో అభిమానులకు మెరుగైన సౌకర్యాలు, సదుపాయాలు కల్పించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం బీసీసీఐ ఇప్పటికే మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేసింది.

**ఉప్పల్‌కు రూ.117.17 కోట్లు :** దేశవ్యాప్తంగా ఐదు స్టేడియాలను ఆధునీకరించేందుకు బీసీసీఐ ప్రణాళికలు తయారు చేసింది. అందులో హైదరాబాద్ సహా న్యూఢిల్లీ, కోల్‌కత, మొహాలి, ముంబయి స్టేడియాలు ఉన్నాయి. ఈ ఐదు స్టేడియాల్లో మౌళిక వసతుల కల్పనకు బీసీసీఐ ఏకంగా రూ.500 కోట్లు వెచ్చించనుంది. ఢిల్లీ కోట్ల మైదానం డిజైన్ పరంగా సమస్యలు ఎదుర్కొంటుంది. ఈ స్టేడియాన్ని పూర్తిగా మార్చివేసేందుకు భారీగా నిధులు అవసరం. ప్రస్తుతానికి ఆ స్టేడియంలో అవసరమైన మార్పుల కోసం రూ.100 కోట్లు కేటాయించనున్నారు. ఇక హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం ఆధునీకరణ పనులకు రూ.117.17 కోట్లు ఖర్చు చేయనున్నారు. కోల్‌కతలోని ఈడెన్‌గార్డెన్స్ స్టేడియం కోసం రూ.127.47 కోట్లు, మొహాలిలోని పిసిఎ స్టేడియానికి రూ.79.46 కోట్లు, ముంబయిలోని వాంఖడె మైదానానికి రూ.78.82 కోట్లతో ఆధునీకరణ పనులు చేయనున్నారు. రూ.500 కోట్ల నిధులతో చేసే సౌకర్యాల కల్పన పనులను స్వయంగా బీసీసీఐ పర్యవేక్షించే అవకాశం ఉంది. రాష్ట్ర సంఘాల నుంచి కాంట్రాక్టులు ఇవ్వకుండా నేరుగా ఒప్పందాలు చేసుకునేందుకు బోర్డు ఆలోచిస్తోంది. ఇందులో కొన్ని స్టేడియాల్లో పైకప్పు పనులు సైతం పెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా రూపొందించిన అంచనాల్లో పైకప్పు నిర్మాణ వ్యయం పరిగణనలోకి తీసుకోలేదు. ఒకవేళ పైకప్పు పనులనూ కలుపుకుంటే.. స్టేడియాల ఆధునీకరణకు మరిన్ని నిధులు అవసరం అవుతాయి.



**12 వేదికల్లో ప్రపంచకప్! :** 2023 ఐసీసీ వరల్డ్‌కప్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వనున్న సంగతి తెలిసిందే. చివరగా 2011 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌కు ఆతిథ్యం ఇచ్చిన భారత్.. మళ్లీ ఇప్పుడే మెగా ఈవెంట్‌కు సిద్ధమవుతోంది. ఈ ఏడాది అక్టోబర్-నవంబర్‌లో జరుగనున్న ప్రతిష్టాత్మక టోర్నీలో 48 మ్యాచులకు ఆతిథ్యం ఇచ్చేందుకు బీసీసీఐ 12 స్టేడియాలను ఎంపిక చేసింది. వన్డే వరల్డ్‌కప్ 46 రోజుల పాటు సాగనుంది. బెంగళూర్, చెన్నై, ఢిల్లీ, ధర్మశాల, గువహటి, హైదరాబాద్, కోల్‌కత, లక్నో, ఇండోర్, రాజ్‌కోట్, ముంబయి, అహ్మదాబాద్ ఆ జాబితాలో ఉన్నాయి. ప్రపంచకప్ ఫైనల్‌కు అహ్మదాబాద్‌లోని అతిపెద్ద స్టేడియం వేదికగా నిలువనుంది!. ఎంపిక చేసిన ప్రతి స్టేడియంలో 3-4 ప్రపంచకప్ మ్యాచులు జరిగే అవకాశం ఉంది. ప్రపంచకప్‌ను ప్రత్యక్షంగా చూసేందుకు వచ్చిన అభిమానుల అనుభూతిని మరింత మెరుగు పర్చేందుకు బీసీసీఐ స్టేడియాలకు సరికొత్త రూపు తీసుకురానుంది.



# అక్షర్ మెరిసె

- వార్నర్ అర్థ సెంచరీ
- ఢిల్లీ క్యాపిటల్స్ 172/10

**ఢిల్లీ :** అక్షర్ పటేల్ (54, 25 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) అదరగొట్టాడు. ముంబయి ఇండియన్స్ బౌలర్లపై విరుచుకుపడ్డ క్యాపిటల్స్ ఆల్‌రౌండర్ 22 బంతుల్లోనే అర్థ సెంచరీ నమోదు చేశాడు. అక్షర్ పటేల్ మెరుపు ఇన్నింగ్స్‌కు తోడు కెప్టెన్ డెవిడ్ వార్నర్ (51, 47 బంతుల్లో 6 ఫోర్లు) అర్ధ శతకం బాదటంతో తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ 19.4 ఓవర్లలో 172 పరుగులకు ఆలౌటైంది. ముంబయి ఇండియన్స్ బౌలర్లలో పియూశ్ చావ్లా (3/22), బెహెన్‌డార్ఫ్ (3/23) మూడు వికెట్లతో విజృంభించారు.

ఢిల్లీ క్యాపిటల్స్‌కు టాప్ ఆర్డర్ మంచి ఆరంభం అందించింది. పృథ్వీ షా (15), మనీశ్ పాండే (26) జతగా ఓపెనర్ డెవిడ్ వార్నర్ 8.3 ఓవర్లలోనే 76 పరుగులు జోడించాడు. యశ్ ధుల్ (2), రోవ్‌మన్ పావెల్ (4), లలిత్ యాదవ్ (2) నిరాశపరిచినా.. అక్షర్ పటేల్ ధనాధన్‌తో ఢిల్లీ భారీ స్కోరుపై కన్నేసింది. ఆరు ఫోర్లతో 43 బంతుల్లో వార్నర్ అర్ధ శతకం సాధించగా.. నాలుగు ఫోరడుల, ఐదు సిక్సర్లతో అక్షర్ పటేల్ 22 బంతుల్లోనే 50 పరుగుల మార్క్ చేరుకున్నాడు. అక్షర్, వార్నర్ క్రీజులో ఉండగా 18 ఓవర్లలో 165 పరుగులతో ఉన్న క్యాపిటల్స్ చివర్లో వరుసగా వికెట్లు కోల్పోయింది.19.4 ఓవర్లలోనే పది వికెట్లు చేజార్చుకుంది. 172 పరుగులకే పరిమితమైంది.

# సూపర్‌కింగ్స్‌కు ఎదురుందా?

## నేడు చెన్నైతో రాజస్థాన్ ఢీ



**చెన్నై :** ఐపీఎల్16 ఆరంభ మ్యాచ్‌లో ఓడినా.. ఆ తర్వాత వరుసగా రెండు మ్యాచుల్లో ఎదురులేని విజయాలు చెన్నై సూపర్‌కింగ్స్ సొంతం. పంజాబ్ కింగ్స్‌తో వర్షం ప్రభావిత మ్యాచ్‌లో పరాజయం పాలైనా.. పుంజుకుని రెండు మ్యాచుల్లో తిరుగులేని విజయాలు సాధించింది రాజస్థాన్ రాయల్స్. అటు సూపర్‌కింగ్స్, ఇటు రాయల్స్ సీజన్లో నాల్గో మ్యాచ్‌కు సిద్ధమయ్యాయి. ఈ పోరుకు చెన్నై చెపాక్ స్టేడియం వేదిక కానుంది. సొంతగడ్డపై సూపర్‌కింగ్స్‌కు ఘనమైన రికార్డుంది. ఇక్కడ ఆడిన 57 మ్యాచుల్లో ధోనీసేన ఏకంగా 41 విజయాలు సాధించింది. గెలుపు శాతం 72తో చెన్నై సూపర్‌కింగ్స్ చెపాక్‌ను కోటగా చేసుకుంది. స్పిన్ అనుకూల చెపాక్‌లో రాజస్థాన్ రాయల్స్ విజయంపై కన్నేసింది. రవిచంద్రన్ అశ్విన్, యుజ్వేంద్ర చాహల్ రాయల్స్ శిబిరంలో ఉండగా.. సూపర్‌కింగ్స్‌కు సొంతగడ్డ అదనపు ప్రయోజనం ఉండదని ఆ జట్టు డ్రెస్సింగ్‌రూమ్ ఆలోచన. రవీంద్ర జడేజా, మిచెల్ శాంట్నర్‌లకు తోడు మోయిన్ అలీ సూపర్‌కింగ్స్ తరఫున మాయజాలం చేస్తున్నారు. రాయల్స్ మాత్రం అశ్విన్, చాహల్‌పైనే ఆశలు పెట్టుకుంది. రుతురాజ్ గైక్వాడ్, డెవాన్ కాన్వేలకు తోడు అజింక్య రహానె సూపర్‌కింగ్స్ బ్యాటింగ్‌ను మరింత బలోపేతం చేశాడు. టాప్ ఆర్డర్‌లో దుమ్మురేపే ఇన్నింగ్స్‌లు నమోదు కావటంతో చెన్నై అలవోక విజయాలు సాధిస్తోంది. ఆ జట్టు మిడిల్ ఆర్డర్‌కు నిజమైన సవాల్ ఎదురుకాలేదు. ఆ సవాల్ విసిరేందుకు రాయల్స్ ఎదురుచూస్తోంది.

ఇక రాయల్స్ బ్యాటింగ్ ఆర్డర్ ప్రమాదకరంగా ఉంది. యశస్వి జైస్వాల్, జోశ్ బట్లర్, సంజు శాంసన్‌లు భీకర ఫామ్‌లో ఉన్నారు. రియాన్ పరాగ్, షిమ్రోన్ హెట్‌మయర్‌లు జోరుమీదున్నారు. సూపర్‌కింగ్స్ పేసర్లు తడబాటుకు లోనవుతుండగా.. రాయల్స్ పేసర్లు అంచనాలను అందుకుంటున్నారు. సూపర్‌కింగ్స్‌తో పోల్చితే మెరుగైన పేస్ విభాగం కలిగిన రాజస్థాన్ రాయల్స్.. అశ్విన్, చాహల్ మాయతో చెపాక్ కోటను బద్దలు కొట్టేందుకు సిద్ధమవుతోంది. చెన్నై సూపర్‌కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ పోరు నేడు.

# 1846 మ్యాచులతో..

- 2023-24 దేశవాళీ షెడ్యూల్
- జనవరి 5 నుంచి రంజీ ట్రోఫీ



**ముంబయి :** భారత క్రికెట్ దేశవాళీ సీజన్ ఈ ఏడాది కాస్త ముందుగానే ఆరంభం కానుంది. మూడేండ్ల అనంతరం దేవదర్ ట్రోఫీ పున ప్రారంభం కానుండగా, దులీప్ ట్రోఫీతో దేశవాళీ క్రికెట్ షురూ అవనుంది. దులీప్ ట్రోఫీ, దేవదర్ ట్రోఫీల్లో ఆరు జోన్ల జట్లు పోటీపడతాయి. సెంట్రల్, సౌత్, నార్త్, ఈస్ట్, వెస్ట్, నార్త్‌ఈస్ట్ జోన్లు ఈ రెండు టోర్నీల్లో పోటీపడతాయి. దులీప్ ట్రోఫీ జూన్ 28 నుంచి ఆరంభం కానుండగా, ఇరానీ కప్ అక్టోబర్ 1 నుంచి జరుగనుంది. సౌరాష్ట్రతో రెస్ట్ ఆఫ్ ఇండియా ఇరానీ కప్ కోసం ఆడనుంది. ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీ జనవరి 5-మార్చి 14 వరకు సాగనుంది. సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ అక్టోబర్ 16-నవంబర్ 6.. విజయ్ హజారే ట్రోఫీ నవంబర్ 23-డిసెంబర్ 15 వరకు జరుగనున్నాయి. రంజీ ట్రోఫీ, విజయ్ హజారే, సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీల్లో 38 జట్లు పోటీపడనున్నాయి. రంజీ ట్రోఫీ ఎలైట్ డివిజన్‌లో నాలుగు గ్రూపుల్లో ఎనిమిదేసి జట్ల చొప్పున 32 టీమ్స్ పోటీపడనున్నాయి. ప్రతి గ్రూప్ నుంచి టాప్-2 జట్లు క్వార్టర్‌ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. ప్రతి గ్రూప్‌లో చివరి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ప్లేట్ డివిజన్‌కు పడిపోతాయి. ప్లేట్ డివిజన్‌లో ఆరు జట్లు ఆడనుండగా.. టాప్-4లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్, ఆ తర్వాత గ్రూప్ ఫైనల్లో ఆడతాయి. దేశవాళీ మహిళల క్రికెట్ సీజన్ అక్టోబర్ 19-నవంబర్ 9న టీ20 ట్రోఫీతో ఆరంభం కానుంది. ఇంటర్ జోనల్ ట్రోఫీ (నవంబర్ 14-డిసెంబర్ 4), వన్డే ట్రోఫీ (జనవరి 4-26) ఈ సీజన్లో షెడ్యూల్ చేశారు. 2023-24 దేశవాళీ సీజన్‌లో ఓవరాల్‌గా 1846 మ్యాచులు ఉండనున్నాయి. ఇక ఈ ఏడాది రంజీ ట్రోఫీలో హైదరాబాద్ ఎలైట్ నుంచి దిగజారి ప్లేట్ విభాగంలో ఆడనున్న సంగతి తెలిసిందే. గత సీజన్లో హైదరాబాద్ ఎలైట్ గ్రూప్-బిలో చివరి స్థానంలో నిలిచింది.

**ఐపీఎల్‌లో నేడు**
చెన్నై X రాజస్థాన్
వేదిక : చెన్నై, సమయం : రా: 7.30
స్టార్‌స్పోర్ట్స్, జియో సినిమాలో

# నవచిత్రం

## 'బలగం' మొగిలయ్య ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరం



బలగం సినిమాలో తన పాటతో కోట్లాదిమంది హృదయాలను కదిలించిన మొగిలయ్య ఆరోగ్యం మంగళవారం మరింతగా క్షీణించింది. ఇప్పటికే రెండు కిడ్నీలు సరిగా పనిచేయకపోవడంతో వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయించుకుంటున్న మొగిలయ్య.. అస్వస్థతకు గురవడంతో వరంగల్ నగరంలోని సంరక్ష సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించాలంటూ వైద్యులు సూచించడంతో.. విషయం తెలిసిన వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సంరక్ష హాస్పిటల్‌కు చేరుకొని మొగిలయ్యను పరామర్శించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మొగిలయ్య ఆరోగ్య పరిస్థితి గురించి మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావుతో తాను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నానని తెలిపారు. నేడు మొగిలయ్య ఆరోగ్య స్థితిని తెలుసుకుని మెరుగైన వైద్యం కోసం కిమ్స్‌కు తరలించినట్టు తెలిపారు. కాగా ఎమ్మెల్యే నరేందర్ మొగులయ్యకు అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేయడంతో పాటు ఆర్థిక సాయం అందించారు. ఎమ్మెల్యే వెంట సంరక్ష హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పోలా నటరాజ్, తదితరులు ఉన్నారు.

# క్లైమాక్స్ ఎమోషన్‌కి క్లాప్స్ కొట్టా : అల్లు అరవింద్



వెట్రిమారన్, అల్లు అరవింద్

అల్లు అరవింద్ గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా తమిళ చిత్రం 'విడుతలై పార్ట్ 1' తెలుగు వెర్షన్ 'విడుదల పార్ట్ 1'గా ఈనెల 15న విడుదలకు సిద్ధంగా ఉంది. ఇందులో భాగంగా మీడియా ప్రతినిధులకు ఈ చిత్రాన్ని ప్రదర్శించారు.

నిర్మాత ఎల్రెడ్ కుమార్ మాట్లాడుతూ,'ఈ సినిమా కంప్లీట్‌గా కాన్సెప్ట్ మీద డిపెండ్ అయి ఉంటుంది. తమిళ్‌లో అరవింద్ చూసి అప్రిషియేట్ చేసి, సినిమాని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నందుకు ధన్యవాదాలు. ఇంత అద్భుతమైన సినిమాని వెట్రిమారన్ నాకు ఇచ్చినందుకు కృతజ్ఞతలు' అని తెలిపారు. 'నేను తీసే సినిమాలు ఎప్పుడు రూటెడ్‌గానే ఉంటాయి. ఈ సినిమా తెలుగులో రిలీజ్ అవుతుంది అనుకోలేదు. ఈ సినిమాను తెలుగులో అల్లు అరవింద్ రిలీజ్ చేయడానికి ఒప్పుకున్నందుకు థ్యాంక్యూ. నిర్మాత ఎల్రెడ్ కుమార్ ఎక్కడ కాంప్రమైజ్ కాలేదు. ఇళయరాజా మంచి ట్యూన్స్ అందించారు. ఈ సినిమాను మీరు ఆదరిస్తారని ఆశిస్తున్నాను' అని దర్శకుడు వెట్రిమారన్ అన్నారు.

నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ,'ఈ సినిమా చూసిన తర్వాత క్లైమాక్స్‌లో ఎమోషన్‌కి కనెక్ట్ అయి లేచి చప్పట్లు కొట్టేసాను. వెట్రిమారన్ అంటే నాకు ఇష్టం. ఆయన సినిమాలు అన్ని చూస్తాను. ఆయన సినిమాలే కాకుండా ఆయన ఇన్వాల్ అయ్యే సినిమాలు కూడా చూస్తాను. ఇది చాలా గొప్ప సినిమా. మన రూట్స్ నుంచి సినిమా తీస్తే అది ఆడియన్స్ ఎంజాయ్ చేస్తున్నారు. ఒక వరల్డ్ క్రియేట్ చేసి ఆడియన్స్‌ను ఆ వరల్డ్‌లోకి తీసుకెళ్తే ఆ సినిమాలు సక్సెస్ అవుతాయి. ఈ సినిమాలో కూడా అలాంటి వరల్డ్‌ను క్రియేట్ చేసి ఆసక్తిని పెంచాడు వెట్రిమారన్. ' అని చెప్పారు.

**ఎన్టీఆర్‌తో సినిమా**

చాలా కాలంగా ఎన్టీఆర్‌తో సినిమా చేస్తారనే వార్తలకు దర్శకుడు వెట్రిమారన్ స్పందించారు. లాక్‌డౌన్ తర్వాత ఎన్టీఆర్‌తో కలిసి చాలా విషయాలను చర్చించాను. ఆయనతో సినిమా చేసే ఛాన్స్ ఉంది. అయితే దానికి చాలా సమయం పట్టే అవకాశం. అలాగే అది మల్టీస్టారరా కాదా అనేది కూడా అప్పుడే తెలుస్తుందన్నారు.

# అన్ని వర్గాలనూ మెప్పించే రుద్రుడు



రాఘవ లారెన్స్, ప్రియా భవానీశంకర్

రాఘవ లారెన్స్ హీరోగా కతిరేసన్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'రుద్రుడు'. తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. లారెన్స్ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, శరత్ కుమార్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఫైవ్ స్టార్ క్రియేషన్స్ ఎల్‌ఎల్‌పి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కతిరేశన్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. పిక్సెల్ స్టూడియోస్ ప్రొడ్యూసర్ ఠాగూర్ మధు ఈ సినిమాని తెలుగు రాష్ట్రాలలో విడుదల చేస్తున్నారు. ఈ నెల 14న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా రిలీజ్ కానున్న నేపథ్యంలో ఈ చిత్ర ప్రీరిలీజ్ ఈవెంట్‌ని గ్రాండ్‌గా నిర్వహించారు. రాఘవ లారెన్స్ మాట్లాడుతూ,'రుద్రుడు కథని దర్శకుడు కతిరేసన్ చాలా అద్భుతంగా చెప్పారు. అందులో మదర్ సెంటిమెంట్ నా మనసుని చాలా ఆకట్టుకుంది. నా ప్రతి సినిమాలో ఫ్యామిలీ ఎలిమెంట్స్ వుండేలా చూసుకుంటాను. అలాగే మాస్, యాక్షన్ మిస్ కానివ్వను. రుద్రుడులో ఫ్యామిలీ, మాస్, యాక్షన్, డ్యాన్స్ అన్నీ ఉంటాయి' అని చెప్పారు.'ఈ సినిమాలో భాగం కావడం ఆనందంగా ఉంది. ఓ మంచి సినిమాతో మీముందుకు రాబోతున్నాం' అని నాయిక ప్రియా భవానీ శంకర్ అన్నారు.

# భారీ ఓపెనింగ్స్ ఖాయం



సంయుక్తా మీనన్

సాయిధరమ్ తేజ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా మిస్టిక్ థ్రిల్లర్ 'విరూపాక్ష'. సంయుక్తమీనన్ కథానాయిక. కార్తీక్ దండు దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్‌పై బాపినీడు బి.సమర్పణలో నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సుకుమార్ ఈ చిత్రానికి స్క్రీన్ ప్లే అందించారు. పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈనెల 21న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా రిలీజ్ అవుతుంది. మంగళవారం ఈ సినిమా ట్రైలర్‌ను నిర్మాతలు అల్లు అరవింద్, దిల్ రాజు రిలీజ్ చేశారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ, 'ట్రైలర్ చూశాక వాట్ ఎ ట్రైలర్ అనిపించింది. గూజ్ బమ్స్ వచ్చాయి. రేపు సినిమా ఎలా ఉండబోతుందో చూపించారు. పెద్ద సక్సెస్ అవుతుంది. నైజాం డిస్ట్రిబ్యూటర్‌ని కాబట్టి ఈ సక్సెస్‌లో నేను కూడా ఓ పార్ట్ అవుతాను' అని అన్నారు. 'ఎన్టీఆర్ వాయిస్ ఓవర్‌తో ఈ సినిమా ప్రమోషన్స్ స్టార్ట్ అయ్యాయి. తర్వాత పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ టీజర్ లాంచ్ చేశారు. ఇప్పుడు రాజు, అరవింద్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. బాపినీడు అధ్వర్యంలో చేసిన సినిమా అందరికీ నచ్చుతుంది' అని చిత్ర నిర్మాత బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ చెప్పారు. హీరో సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ, "ఎంతో ప్రేమించి, కష్టపడి చేసిన సినిమా. ఓ మంచి సినిమాను మీ ముందుకు తీసుకొస్తున్నాం' అని తెలిపారు. 'ఈ మధ్య సినిమాలకు ట్రైలర్ బట్టి ఓపెనింగ్స్ వస్తున్నాయి. ఈ ట్రైలర్ చూస్తుంటే పిచ్చ రేంజ్‌లో ఓపెనింగ్స్ వస్తాయని 100% అనిపిస్తుంది. 'కాంతార' మ్యూజిక్ డైరెక్టర్ ఈ సినిమాకు మ్యూజిక్ అందించటం హ్యాపీ. అన్ని కలిసొచ్చి ఈ సినిమా ఎక్కడో నిలబడుతుంది' అని అల్లు అరవింద్ అన్నారు.

# కచ్చితంగా నవ్విస్తాం..

రచయిత డైమండ్ రత్నబాబు దర్శకత్వంలో రూపొందుతున్న హిలేరియస్ ఎంటర్‌టైనర్ 'అన్ స్టాపబుల్'. 'అన్ లిమిటెడ్ ఫన్' అనేది ఉప శీర్షిక. విజె సన్నీ, సప్తగిరి హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రంలో నక్షత్ర, అక్సాఖాన్ హీరోయిన్లు. ఎ2 బి ఇండియా ప్రొడక్షన్‌లో రజిత్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'బేబీ బేబీ..' సాంగ్‌ని విడుదల చేశారు. ఈ స్పెషల్ సాంగ్‌ని 'ధమాకా' సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో ఫుల్ మాస్ ఎనర్జీతో కంపోజ్ చేశారు. కాసర్ల శ్యామ్ మాస్‌ని ఆకట్టుకునే లిరిక్స్ అందించగా, 'పుష్ప' ఫేం ఇంద్రావతి చౌహాన్ ఈ పాటని హుంషారుగా ఆలపించారు. "బుల్ బుల్..' అన్ స్టాపబుల్ పాట ఎంత సూపర్ హిట్ అయ్యిందో 'బేబీ...' పాట కుడా అంతకంటే పెద్ద హిట్ అవుతుంది. నిర్మాత రజిత్ రావు మాట్లాడుతూ, 'ఇది చిన్న సినిమా కాదు అన్నీ ఉన్న సినిమా. అత్యున్నత సాంకేతికతని వాడాం. ఖచ్చితంగా ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇచిస్తుంది. కుటుంబం అంతా కలిసి ఆనందంగా చూసే సినిమా ఇది' అని అన్నారు.'ఇప్పటి వరకు నన్ను డైమండ్ రత్నబాబు అని పిలిచారు. ఈ సినిమా తర్వాత 'అన్ స్టాపబుల్ డైరెక్టర్ డైమాండ్ రత్నబాబు అని పిలుస్తారని ఆశిస్తున్నాను' అని తెలిపారు.



Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.